www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 సంచిక : 202 | సోమవారం 14-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు: 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

బరి తెగింపే



కత్తి కడతాం...పందేలు వేస్తాం...ఎవరు వచ్చినా ఆపేది లేదు...మాకు అనుమతి ఉంది...బరులు ధ్వంసం చేయవద్దు...పందేలు ఉన్నాయి... భారీగా ఏర్పాట్లు చేశాం...ఇదీ కృష్ణా, గోదావరి జిల్లాల్లో కోడి పందేల నిర్వాహకుల మాటలు. ఎవరెన్ని చెప్పినా పందేలను ఆపేదిలేదంటున్నారు. పందేల కోసం వచ్చే వారికి సకల ఏర్పాట్లు చేశామని, ఎవరూ నిరాశపడాల్సిన పనిలేదంటున్నారు. సంక్రాంతి కోడి పందేల కోసం కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో భారీగా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే కోడి పుంజులన్నీ బరుల వద్దకు చేరాయి. రేయింబవళ్లు పందేలు నిర్వహించేందుకు ఫ్లడ్ లైట్లను సైతం ఏర్పాటు చేశారు. ఎన్నికల సంవత్సరం కావటంతో ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతోపాటు అధికారపార్టీ నేతలే దగ్గరుండి మరీ పందేలకు ఏర్పాట్లు చేయిస్తున్నారు. ఈ ఏడాది కోడి పందేలలో రూ.వెయ్యి కోట్లపైనే డబ్బులు చేతులు మారనున్నట్లు అంచనా.



విజయవాడకు సమీపంలోని కొత్తూరు తాడేపల్లిలోని మామిడి తోటలో సిద్ధమైన కోడిపందేల బరి

కోడి పందేలకు సై

- వారించినా ఆగే ప్రసక్తేలేదు
- కృష్ణా, గోదావరి జిల్లాలకు పయనం
- ప్రజా ప్రతినిధులే నిర్వాహకులు
- పందేల రాయుళ్లకు భారీ ఏర్పాట్లు
- వందలాది బరులు సిద్ధం
- రూ.వెయ్యి కోట్లపైనే పందేల నిర్వహణ

విశాలాంధ్ర సెంట్రల్ డెస్క్ - అమరావతి :
కోడి పందేలపై కోర్టులు, పోలీసులు నిషేధం విధించినా.. నిర్వాహకులు మాత్రం వినేపరిస్థితిలో లేరు. డింకీ మాటున కోళ్లకు కత్తులు కట్టి పందేలు వేసేందుకు ఏర్పాట్లు చేసేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మూడు రోజులపాటు రాష్ట్రంలో కోడి పందేల నిర్వహణ భారీగా జరగనుంది. కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరితోపాటు గుంటూరు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీగా ఏర్పాట్లు చేశారు. కోడి పందేలు అనగానే ఎవరికైనా పశ్చిమ గోదావరి జిల్లాయే గుర్తుకు వస్తుంది. ఆ జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాలలో పందేల నిర్వహణకు బరులు సిద్ధమయ్యాయి. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి సైతం పందేలరాయుళ్లు ఇప్పటికే తరలివచ్చారు. వారి రాకతో గోదావరి జిల్లాల్లోని పలు హోటళ్లు, లాడ్జిలు కిటకిటలాడుతున్నాయి. ఈ ఏడాది కనీసం రూ.వెయ్యి కోట్లపైనే డబ్బులు చేతులు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. కోడి పందేల నిర్వహణలో కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులే దగ్గరుండి మరీ ఏర్పాట్లు చేయటం గమనార్హం. కృష్ణాజిల్లాలో ఈడ్పుగల్లు, కొత్తూరు తాడేపల్లి, మైలవరం, శోభనాపురం, తిరువూరు, చాట్రాయి, విస్సన్నపేట, దివిసీమ, కైకలూరు తదితర ప్రాంతాలలో పందేల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేశారు. పశ్చిమ గోదావరిలో భీమవరం, ఐ భీమవరం, కాళ్ల, వెంప, యలమంచిలి,

- మిగతా 2 లో

నేడు భోగి



మత, మనువాద ఉన్మాద ధోరణులను
హామీలు గుప్పించడం తప్ప అమలు చేయని పాలకుల దుర్మార్గ పోకడలను
సగటు మనిషిలో గూడు కట్టుకున్న స్వార్థపూరిత చర్యలను..
ఈ భోగి మంటల్లో కట్ట కట్టి తగులబెడదాం..
రానున్న నవజీవన సమతాభావనకు అంకురార్పణ చేద్దాం..!

మైనర్‌పై గ్యాంగ్‌రేప్

ఆలస్యంగా వెలుగులోకి...

ముగ్గురి అరెస్టు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :
పాతబస్తీలో 16 ఏళ్ల బాలికపై 11 మంది యువకులు అత్యాచారానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. కామాటిపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలికను కొంతమంది యువకులు మాయమాటలు చెప్పి లైంగికంగా లొంగదీసుకున్నారు. మొత్తం 11 మంది కొద్దిరోజులుగా లైంగిక దోపిడీకి పాల్పడుతున్నారు. వీడియోలు తీసి బాధితురాలిని బెదిరిస్తూ నిత్యం నరకం చూపిస్తున్నారు. ఎవరికైనా చెబితే వీడియోలను సోషల్‌మీడియాలో పెట్టి పరువు తీస్తామని బెదిరించారు. అయితే, కామాంధుల చేష్టలతో విసిగిపోయిన బాధితురాలు విషయాన్ని

- మిగతా 2 లో

అన్నీ మాటలే..చేతలు శూన్యం. మా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. కానీ ఆచరణలో మాత్రం అది కనిపించడం లేదు. ఇందుకు ఇటీవల ముగిసిన జన్మభూమి మా ఊరు ప్రత్యక్ష తార్కాణం. జన్మభూమి మా ఊరు గ్రామ సభల్లో అర్జీల పరిష్కారం పది శాతంలోపుగానే ఉంది.

మాటలే..చేతలు శూన్యం



- జన్మభూమి అర్జీల పరిష్కారం10 శాతంలోపే
- మొత్తం దరఖాస్తులు 5.87 లక్షలు
- పరిష్కారమైంది 36,082
- ఇళ్లు, స్థలాలు, పింఛన్లకే 3 లక్షలు
- రేషన్ కార్డు అర్జీలు 1.42 లక్షలు

విశాలాంధ్ర సెంట్రల్ డెస్క్ - అమరావతి :
ప్రజా సమస్యల పరిష్కారం, రానున్న ఐదేళ్లలో అభివృద్ధి పనుల ప్రణాళికల రూపకల్పన కోసమే జన్మభూమి మా ఊరు గ్రామ సభలు నిర్వహించామని ప్రభుత్వం చెప్పుకుంటున్నా..సభల్లో సమస్యల పరిష్కారం అంతంత మాత్రంగానే

- మిగతా 2 లో

జన్మభూమి మా ఊరు గ్రామ సభల్లో జిల్లాల వారీగా దరఖాస్తులు

జిల్లా పేరు	వచ్చిన అర్జీలు	పరిష్కారం
పశ్చిమ గోదావరి	78,796	5,390
గుంటూరు	71,824	3,231
చిత్తూరు	63,155	4,071
తూర్పు గోదావరి	58,724	3,740
కర్నూలు	57,551	2,489
విశాఖపట్నం	43,507	3,534
ప్రకాశం	39,538	2,472
విజయనగరం	35,787	1,707
కృష్ణా	32,783	1,573
అనంతపురం	32,269	1,597
నెల్లూరు	26,465	3,495
శ్రీకాకుళం	25,682	1,313
కడప	21,496	1,468
మొత్తం	5,86,982	36,082

నిలిచిన ఎన్టీఆర్ వైద్య సేవలు

- రోగుల ఇక్కట్లు
- రూ.550కోట్ల పెండింగ్
- నెట్‌వర్కింగ్ ఆస్పత్రుల అసోసియేషన్ ఆగ్రహం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
ఎన్టీఆర్ వైద్యసేవల నెట్‌వర్కింగ్ ఆస్పత్రులకు రూ.550కోట్ల బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది నెట్‌వర్కింగ్ ఆస్పత్రుల అసోసియేషన్ నేతలకు రాష్ట్ర మంత్రులు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నెట్‌వర్కింగ్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు నిలిచిపోయాయి. వేలాది క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. పేదలకు ప్రాణం పోస్తున్న ఎన్టీఆర్ వైద్యసేవల బకాయిల చెల్లింపుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మూడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులు చెల్లించాలని, లేకుంటే సేవలు నిలుపుదల చేస్తామని నెట్‌వర్కింగ్ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర మంత్రులు రంగంలోకి దిగి..నెలరోజుల్లో బకాయిల చెల్లిస్తామని అసోసియేషన్‌కి భరోసా ఇచ్చారు. వారిచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. ఈ నెల ఒకటో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 350 నెట్‌వర్కింగ్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవల్ని నిలిపివేశారు. దానితో రాష్ట్ర వ్యాప్తంగా వైద్యారోగ్య పరిస్థితి అధ్వాన్నంగా మారింది. పేదలకు వైద్యసేవల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

పెండింగ్‌లో 80వేల రోగుల క్లైమ్‌లు

ఎన్టీఆర్ వైద్యసేవల నిలుపుదలతో రాష్ట్రవ్యాప్తంగా 80వేల మంది రోగుల క్లైమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి వారికి చెల్లించాల్సిన బకాయి విడుదల కానందున..ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నెట్‌వర్కింగ్ ఆస్పత్రుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కుటుంబంలో అందరికీ అవసరమైన వైద్యసేవలకు నిధులు కేటాయించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు నెలకొన్నాయి. అన్ని వర్గాల ప్రజలు వైద్యసేవలు పొందుతున్నారు. ప్రభుత్వం యుద్ధప్రాపతిపదికన బకాయిలు చెల్లించకుంటే.. అత్యవసర వైద్యం

- మిగతా 2 లో

యూపీలో కాంగ్రెస్
ఒంటరి బాటసారి..!

- ఇది స్వయం కృతమేనా ?
- ఎస్పీ, బీఎస్పీ ఏకపక్ష నిర్ణయ ఫలితమేనా



న్యూఢిల్లీ :
దేశంలో అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ది ఒంటరి పోరాటమేనన్న విషయం తేటతెల్లమైంది. ఎస్పీ, బీఎస్పీ మాత్రమే పొత్తు కుదుర్చుకుని రాష్ట్రంలో బీజేపీని ఓడించి అత్యధిక స్థానాలను గెలుచుకోగలమన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశాయి. తమ మధ్య పొత్తు కుదిరిందని, చెరో 38 స్థానాలలో పోటీచేస్తామని ఇప్పటికే ప్రకటించాయి. దేశవ్యాప్తంగా మహాకూటమిని ఏర్పాటుచేసి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని గద్దె దించాలన్న కాంగ్రెస్ లక్ష్యానికి ఎందుకు తూట్లుపడ్డాయనేది నేడు చర్చనీయాంశంగా మారింది. కూటమి ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ పార్టీతో సహా పెద్దగా ప్రయత్నాలు కనిపించలేదని భావించవచ్చు. ఆర్ఎల్‌డి పార్టీని కూడా కలుపుకుపోవాలని అఖిలేష్ యాదవ్,

- మిగతా 2 లో

ఇదీ లోకం!



బస్సు లేటయింది..అందుకే పండుగ దారిలో చేసేస్తున్నాం..

ఎన్నికల 'మేళా'
అర్ధ కాదు కుంభమేళానే



మార్చేసిన సీఎం యోగి ఆదిత్యనాథ్

నిర్వహణ వ్యయం రూ.4,236 కోట్లు

గతంతో పోల్చితే భారీగా పెరిగిన బడ్జెట్

నేటి నుంచి అలహాబాద్‌లో 50 రోజుల పండుగ

3లో

బోసిపోయిన భాగ్యనగరం

- హైదరాబాద్ నుంచి సంక్రాంతికి జనం సొంతూళ్లకు..
- వ్యాపార సముదాయాల వద్ద కనిపించని వినియోగదారులు
- రణగొణ ధ్వనులు, వాహనాల పొగ నుంచి రిలీఫ్

విశాలాంధ్ర బ్యూరో - హైదరాబాద్ :
సంక్రాంతి పండగను పురస్కరించుకుని నగరవాసులు సొంత ఊళ్లకు వెళ్లిపోవడంతో రోజూ వాహనాలతో రద్దీగా ఉండే నగర రహదారులు ఆదివారం బోసిపోయాయి. వరుసగా సెలవులు రావడంతో నగరంలో ఉన్న వారు కూడా ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో రోజు రణగొణ ధ్వనులు, వాహనాల పొగతో ఉక్కిరిబిక్కిరి అయ్యే నగరవాసులకు కాస్త ఊపిరాడినట్లయ్యింది. సికింద్రాబాద్, బేగంపేట, ఖైరతాబాద్, ఆబిడ్స్, కోఠి, సుల్తాన్‌బజార్, మోజాంజాహి మార్కెట్, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట్, పంజాగుట్ట,

- మిగతా 2 లో



ఎమర్జెన్సీ ప్రకటించను : ట్రంప్



వాషింగ్టన్ : పాక్షికంగా మూతపడిన తన ప్రభుత్వాన్ని తిరిగి పనిచేయించేందుకు ఎమర్జెన్సీని ప్రకటించబోనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి 5.7 బిలియన్ డాలర్లను మంజూరు చేయడానికి ప్రతినిధుల సభ అంగీకరించకపోవడంతో ట్రంప్ ప్రభుత్వాన్ని పాక్షికంగా మూసివేశారు. కొన్ని కీలకమైన శాఖలు మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రభుత్వం పూర్తిగా పనిచేయక ఆదివారంతో 23 రోజులైంది. డెమోక్రాట్లు నిధుల మంజూరుకు తిరస్కరిస్తున్నారు. గోడ నిర్మాణానికి నిధులను పొందడానికి తక్షణం జాతీయ ఎమర్జెన్సీని ఎందుకు ప్రకటించలేదని ఫాక్స్ న్యూస్ విలేకరి ప్రశ్నించగా, ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులకు మరికొంత గడువు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఎమర్జెన్సీ ప్రకటించలేదని ట్రంప్ చెప్పారు. డెమోక్రాట్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఒప్పందం కుదుర్చుకోవడానికి మరో అవకాశం ఇస్తున్నానని చెప్పారు. 1995-96లో కూడా బిల్‌క్లింటన్ ప్రభుత్వం 21 రోజులపాటు ప్రభుత్వాన్ని పాక్షికంగా మూసివేసింది. అమెరికా చరిత్రలో ట్రంప్ పాలనలోనే ఎక్కువ రోజులు ప్రభుత్వం పనిచేయలేదు. తన వైఖరిని సమర్థించుకుంటూ ట్రంప్ శనివారం అనేక ట్వీట్లు చేశారు. దక్షిణ సరిహద్దులో పెద్దఎత్తున మానవ సంక్షోభం ఏర్పడే అవకాశం ఉన్నదని ట్రంప్ హెచ్చరించారు. 15 నిముషాల్లో డెమోక్రాట్లు ప్రభుత్వం మూసివేత సమస్యను పరిష్కరించాలని కోరుతూ ట్రంప్ ఒక ట్వీట్ చేశారు. డెమోక్రాట్లు సెలవుల నుంచి తిరిగి వచ్చి మళ్లీ పనులలో నిమగ్నం కావాలని ఒప్పందంపై సంతకం చేసేందుకు తాను వైట్‌హౌస్‌లో సిద్ధంగా ఉన్నానని ట్రంప్ చెప్పారు. ప్రభుత్వం పనిచేయకపోవడం వల్ల 8 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెలలో ఇంత వరకు వేతనాలు చెల్లించలేదు.

చైనా గని ప్రమాదంలో 19 మంది మృతి



బీజింగ్ : చైనా ఉత్తర ప్రాంతంలోని బొగ్గు గని పైకప్పు కూలిపోయి 19 మంది మృతిచెందగా, లోపల శిధిలాలలో ఇద్దరు చిక్కుకుపోయారని మీడియా తెలిపింది. షాంఘ్జీ రాష్ట్రంలోని బొగ్గు గనిలో శనివారం మధ్యాహ్నం ప్రమాదం జరిగిన సమయంలో 87 మంది పనిచేస్తున్నారని జిన్హువా వార్తాసంస్థ తెలిపింది. స్థానిక అధికారులను ఉటంకిస్తూ, 66 మందిని సురక్షితంగా విమానం ద్వారా రక్షిత ప్రాంతానికి తరలించామని, ఇద్దరు మాత్రమే లోపల చిక్కుకుపోయారని ఆ వార్తా సంస్థ పేర్కొన్నది. ప్రమాదంపై దర్యాప్తు జరుగుతోంది. చైనాలో ఇటీవల కాలంలో గని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బొగ్గు ఉత్పత్తి పెంచడంపైనే కాకుండా భద్రతా సౌకర్యాలను కూడా పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 2017లో బొగ్గు గనుల్లో జరిగిన ప్రమాదాల్లో 375 మంది మృతిచెందారని, అయితే మృతుల సంఖ్య ఆ తరువాత సంవత్సరంలో 28.7 శాతం తగ్గిపోయిందని జాతీయ బొగ్గు గనుల భద్రతా విభాగం తెలిపింది.

బ్రెగ్జిట్‌ను ఆమోదించాలని ఓటర్ల డిమాండు



లండన్ : యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి వైదొలగేందుకు బ్రెగ్జిట్ ముసాయిదా ఒప్పందాన్ని పార్లమెంట్ సభ్యులు తక్షణం ఆమోదించాలని, ఈ అంశంపై 2016లో జరిగిన రెఫరెండంలో పాల్గొన్న ఓటర్లు డిమాండు చేస్తున్నారు. రెఫరెండం జరిగి సంవత్సరంన్నరపైగా గడిచినప్పటికీ బ్రెగ్జిట్‌పైన ఇంకా ఒక ఒప్పందం కుదరలేదు. ఈయూ నుంచి వైదొలగాలని 23 ఏళ్ల ఆడం గ్రీన్ ఆవేశంతో డిమాండు చేశారు. సుందర్‌ల్యాండ్‌కి చెందిన గ్రీన్‌తో పాటు అనేక మంది ఓటర్లు ఇదే విధంగా పార్లమెంట్ సభ్యులపై ఒత్తిడి తెస్తున్నారు. సుందర్‌ల్యాండ్ నగరం ఓడల తయారీ కేంద్రం, ఇక్కడ నిస్సాన్ కార్ల ఉత్పత్తి కూడా జరుగుతుంది. ఈయూ నుంచి వైదొలిగేందుకు ఇక్కడి ఓటర్లు అత్యధికంగా స్పందించారు. 2016 జూన్ 23న రెఫరెండం జరిగింది. సుందర్‌ల్యాండ్ నగర ఓటర్లు 61 శాతం మంది సానుకూలంగా స్పందించారు. బ్రెగ్జిట్‌పైన రానున్న మంగళవారం పార్లమెంట్‌లో చర్చ, ఓటింగ్ జరగనున్నది. బ్రెగ్జిట్ వ్యవహారం హాస్యాస్పదంగా తయారైందని గ్రీన్ వ్యాఖ్యానించారు. తన కుటుంబమంతా బ్రెగ్జిట్‌కు అనుకూలంగా ఓటుచేసిందని చెప్పారు. ఈయూ నుంచి వైదొలగకపోతే ఎంపీలంతా తలదించుకోవాల్సి వస్తుందని అన్నారు.

ప్రధాని హెచ్చరిక :

బ్రెగ్జిట్ ముసాయిదా ఒప్పందాన్ని పార్లమెంట్ ఆమోదించకపోతే విధ్వంసానికి దారితీస్తుందని, మన ప్రజాస్వామ్య వ్యవస్థలో విశ్వాస ఉల్లంఘన మరిచిపోలేని ఘటన అవుతుందని ప్రధాని థెరిస్సా మే హెచ్చరించారు. సండే ఎక్స్‌ప్రెస్‌లో ఆమె రాసిన వ్యాసంలో మంగళవారం జరగనున్న సభలో బ్రెగ్జిట్ ఒప్పందాన్ని ఆమోదించాలని ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. ఒప్పందం ఆమోదించకపోతే ఆ తరువాత బ్రెగ్జిట్ అనేదే ఉండదని ఆమె పేర్కొన్నారు. మంగళవారం జరిగే ఓటింగ్‌లో ప్రభుత్వం ఓడిపోతే ఏమి చేయాలనే అంశంపైన పాలకపక్షం ఎంపీలు తర్జనభర్జనపడుతున్నారు. బ్రెగ్జిట్‌కు అనుకూలంగా తీర్మానం విజయం పొందకపోతే మళ్లీ ఎన్నికలు జరపాలని లేబరుపార్టీ నాయకుడు జెరిమి కార్బిన్ ఇదివరకే డిమాండు చేశారు.

పారిస్ పేలుడులో ముగ్గురి మృతి



పారిస్ : పారిస్ నగరంలోని ఒక భవనంలో శక్తిమంతమైన గ్యాస్ పేలుడు జరిగి ఇద్దరు అగ్నిమాపకదళ సిబ్బంది మరణించారని అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో స్పెయిన్‌కు చెందిన మరో మహిళ కూడా మృతిచెందారు. అనేక డజన్ల మంది గాయపడ్డారు. పేలుడు జరిగిన భవనం చుట్టుపక్కల ఉన్న అపార్టుమెంట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. మంటలను ఆర్పేందుకు 200 అగ్నిమాపక శకటాలు ప్రమాదస్థలానికి చేరుకుని ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించడంతో పాటు తీవ్ర పోరాటం అనంతరం మంటలను ఆర్పగలిగినట్టు హోం శాఖ మంత్రి క్రిస్టోఫీ క్యాస్టనర్ విలేకరులకు తెలిపారు. ఒక వైపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎల్లో వెస్ట్ ఉద్యమం సాగుతోంది. ఈ ఉద్యమం సందర్భంగా హింసాయుత ఘటనలు, ఆందోళనకారుల విధ్వంసం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. పేలుడు జరిగినప్పుడు కార్లు తిరగబడిపోయాయని, భవనం ఉన్న వీధి పొడవునా అద్దాల ముక్కలు, ఇతర శిధిలాలు చెల్లాచెదురుగా నిండిపోయాయని అధికారులు తెలిపారు. స్వల్పంగా గాయపడిన డజన్ల మందికి తాత్కాలిక చికిత్స అందించి పంపారు. పేలుడు వల్ల భూకంపంలాంటి పెద్ద శబ్దం వచ్చిందని, నిద్రిస్తున్న తాను ఆందోళనతో లేచానని పేలుడు జరిగిన ప్రాంతంలో నివసిస్తున్న క్లెయిర్ నల్లావార్డు తెలిపారు.

శబ్దం విని తాను బయటకు వెళ్లిపోయేందుకు తలుపుల వరకు నడిచానని, పిల్లలు భయంతో తమ గదుల నుంచి బయటకు రాలేకపోయారని ఆమె చెప్పారు. అగ్నిమాపక దళ సిబ్బంది ఎలివేటర్ ద్వారా బయటకు రావాలని సూచించారని, అయితే, అప్పటికే ఎలివేటర్ పేలిపోయిందని, దట్టంగా పొగ అలుముకుందని ఆమె తెలిపారు. ఈ ప్రమాదంలో 47 మంది గాయపడగా, పది మందికి తీవ్ర గాయాలైనట్టు అధికారులు తెలిపారు.

ఏఎన్‌సీ ఎన్నికల ప్రణాళిక విడుదల



ప్రిటోరియా : దక్షిణాఫ్రికా సార్వత్రిక ఎన్నికలు వచ్చే మే నెలలో జరగున్నాయి. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) ఎన్నికల ప్రణాళికను అధ్యక్షుడు సిరిల్ రమఫోసా శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు పౌరులందరికీ అన్ని అవకాశాలను కల్పించడం ద్వారా పురోగతి సాధనకు వివిధ వ్యవస్థలలో మార్పు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. కొద్ది సంవత్సరాలుగా ప్రభుత్వ, ప్రైవేట్‌రంగాలలో పెట్టుబడులు స్తంభించిపోయాయని, దీని వల్ల ఉద్యోగాల కల్పనకు తీవ్ర ఆటంకం ఏర్పడిందని ఈ పరిస్థితులలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన నొక్కిచెప్పారు. డర్బన్ నగరంలోని మోసెస్ మబిద స్టేడియంలో జరిగిన ఎన్నికల ప్రణాళిక ఆవిష్కరణకు 10 వేల మంది ప్రజలు హాజరయ్యారు. ఎన్నికలకు మరో మూడు నెలలకుపైగా గడువున్నప్పటికీ ప్రచారాన్ని ఆయన ఇప్పుడే ప్రారంభించారు. దేశంలోని పదిమందిలో నలుగురికి సరైన ఉపాధిలేదని, అలాగే విద్య, నైపుణ్యాలు లేకపోవడం విషాదకర పరిణామమని అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలో వాగ్దానాలను నెరవేర్చడంలో పెద్ద సవాల్ ఎదుర్కొంటున్నామని తెలిపారు. దేశంలో 90 లక్షల మంది నిరుద్యోగులున్నారని ఆయన అన్నారు. ఎక్కువ ఉద్యోగాలను సృష్టించాలని, కార్మికులందరికీ గౌరవనీయమైన వేతనాలను అందించాలన్నదే తమ ఎన్నికల ప్రణాళిక లక్ష్యమని తెలిపారు. ప్రజల జీవనప్రమాణాలను పెంచేందుకు వారికి గౌరవనీయమైన ఉద్యోగాలను కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. దేశ ప్రజలంతా ఉమ్మడిగా కృషి చేయడం ద్వారా ఈ లక్ష్యాలను సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. సందేహాలు, అనిశ్చితి కాలాన్ని అధిగమించి ప్రస్తుతం ఆశాభావం కాలంలో ప్రవేశించామని ఆయన తెలిపారు.

ప్రపంచ బ్యాంకు అధ్యక్ష పదవికి ఇవాంక పోటీ

వాషింగ్టన్ :అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె, అధ్యక్షుడి సలహాదారు ఇవాంక ట్రంప్, ఐక్యరాజ్య సమితిలో రాయబారిగా పనిచేసిన నిక్కీ హేలి ప్రపంచ బ్యాంకు అధ్యక్ష పదవికి పోటీచేసే అవకాశాలున్నాయని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక తెలిపింది. ప్రస్తుత అధ్యక్షుడు జిమ్ యాంగ్ కిమ్ పదవీ విరమణ తరువాత జరిగే ఎన్నికల్లో ఈ ఇద్దరు మహిళల్లో ఒకరు పోటీచేయవచ్చునని పత్రిక తెలిపింది. పదవీ కాలం గడువు ముగియక ముందే తాను బ్యాంకు అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్టు జిమ్ యాంగ్ కిమ్ ప్రకటించారు. ఫిబ్రవరి 1న బాధ్యతల నుంచి ఆయన వైదొలుగుతారు. బ్యాంకు అధ్యక్షుడిగా పనిచేయడం ఇది రెండోసారి. అయితే, ఆయన పదవీకాలం మరో మూడేళ్లున్నది. ఐరాస రాయబారిగా ఉన్న నిక్కి హెయిలీ గత నెలలోనే పదవి నుంచి వైదొలిగారు. వీరిరువురితో పాటు అంతర్జాతీయ అభివృద్ధి అమెరికా ఏజెన్సీ అధిపతి మార్క్ గ్రీన్ ఆర్థిక శాఖ అంతర్జాతీయ వ్యవహారాల ఉప మంత్రి డేవిడ్ మాల్ పాస్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. 2017లో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు సౌది మద్దతుతో ప్రపంచ బ్యాంకు నుంచి మిలియన్ డాలర్ల నిధి మంజూరు కావటానికి ఇవాంక ట్రంప్ గట్టిగా కృషి చేశారు. ఇవాంక ట్రంప్ పేరును అనేక మంది సిఫార్సు చేసినట్టు ఆర్థిక శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. అమెరికా తరపున ఎవరు పోటీచేయాలన్న అంశంపై కసరత్తు జరుగుతోందని ఆయన చెప్పారు. కొత్త నాయకుడిని ఎంపిక చేసేందుకు గవర్నర్లతో సంప్రదిస్తున్నారని తెలిపారు. రెండో ప్రపంచ యుద్ధం తరువాత స్థాపించిన ప్రపంచ బ్యాంకులో పెద్ద వాటాదారు అయిన అమెరికా ఎప్పుడూ బ్యాంకు అధ్యక్ష పదవికి తగిన వ్యక్తిని ఎంపిక చేయడంలో కీలక పాత్ర వహిస్తోంది. ఇందుకు సంబంధించిన రాతపూర్వక ఒప్పందం ఏమీ లేకపోయినా అమెరికాదే ఈ విషయంలో పెత్తనం. అయితే, మారిన పరిస్థితుల్లో అమెరికా అభ్యర్థి తప్పనిసరిగా గెలుపొందుతాడన్న హామీ ఏమి లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

బరితెగింపే

(మొదటిపేజీ తరువాయి)

కలగాపురం, నల్లజర్ల, జంగారెడ్డిగూడెం, దెందులూరు, కొప్పాక, లింగపాలెం, ధర్మాజిగూడెం, ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు తదితర ప్రాంతాల్లో వందలాది బరులను సిద్ధం చేశారు. తూర్పు గోదావరిలో కోనసీమతోపాటు రాజమహేంద్రవరం, జగ్గంపేట, తుని, పెద్దాపురం ప్రాంతాల్లోనూ కోడి పందేల నిర్వహణకు స్థానికులు సై అంటున్నారు. పోలీసులు, కోర్టులు వారించినా ఆగే ప్రసక్తేలేదని నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలో ఇతర జిల్లాల్లో సైతం కోడి పందేలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కడప తదితర ప్రాంతాలలో బరులు సిద్ధమయ్యాయి. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా బరులు ఏర్పాటు చేసినా పోలీసు, రెవెన్యూ అధికారులు వాటిని ధ్వంసం చేస్తున్నారు.

టెంట్‌లతో ప్రత్యేక ఏర్పాట్లు

కోడి పందేలు తిలకించే వారి కోసం మామిడి తోటలు, కొబ్బరి తోటలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్ద పెద్ద టెంట్‌లు వేశారు. పందేల బరిలోకి ఇతరులను అనుమతించకుండా చుట్టూ వలలు (నెట్) కట్టారు. కొన్నిచోట్ల పెద్ద పెద్ద గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం తోటల్లోనే ప్రత్యేక వసతి ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం పెద్ద ఎత్తున షామియానా టెంట్‌లను తోటలకు తరలించారు. పందేలు చూసే వారి కోసం మద్యం, భోజనం హోటళ్లను కూడా ఏర్పాటు చేశారు. పెద్ద బరులలో స్థానికులతోపాటు వీఐపీల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి ప్రజా ప్రతినిధులు, సినీనటులు కూడా రానుండటంతో వారి కోసమూ ఏర్పాట్లు చేశారు. పురుషులతో సమానంగా మహిళలు, యువతులు పందేలకు తరలి వస్తున్నారు. దీంతో వారికి ప్రత్యేకంగా గ్యాలరీలు సిద్ధం చేయటం విశేషం.



పందేలు తిలకించేవారి కోసం షామియానా ఏర్పాటు

తూతూమంత్రంగానే తనిఖీలు

కోడి పందేలను అడ్డుకునేందుకు పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ, పశుసంవర్థకశాఖల అధికారులతో కమిటీలు వేసినా, అవి తూతూ మంత్రంగానే తనిఖీలు చేస్తున్నాయి. పోలీసు, రెవెన్యూ అధికారుల బృందాలు తనిఖీలకు రాకుండా ప్రజాప్రతినిధులతో సిఫార్సు చేయించుకుం టున్నారు. ఒకటీ రెండు చోట్లకు అధికారులు వెళ్లినా, తమకు అనుమతి వస్తుందని, మీరు వెళ్లిపోవాలంటూ నిర్వాహకులు హుకుం జారీ చేయటం గమనార్హం. విజయవాడ సమీపంలోని కొత్తూరు తాడేపల్లి, ఈడ్పుగల్లులో ప్రజా ప్రతినిధులే దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎంపీల నిర్వహణలోనే పందేలు జరగనుండటంతో పోలీసులు అటువైపు కన్నెత్తి చూసిన పాపానపోవటం లేదు. అసలే ఈ ఏడాది ఎన్నికలు జరగనుండటంతో ప్రజా ప్రతినిధులు ఏమీ మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారు. పోలీసు, రెవెన్యూ, పశుసంవర్థకశాఖలు సంయుక్తంగా కమిటీలు వేసి పందేలు నిర్వహించకుండా చూడాలన్న ప్రభుత్వ ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఎక్కడా కానరావటం లేదు. కేసుల కోసం అధికారులు చిన్న బరులపైనే దాడులు చేస్తున్నారుగానీ, పెద్ద బరుల జోలికి వెళ్లటం లేదనేది నగ్న సత్యం.

మాటలే..చేతలు శూన్యం

(మొదటిపేజీ తరువాయి)

ఉందన్న విషయం అధికారిక గణాంకాలతోనే తేటతెల్లమైంది. ఈ నెల రెండు నుంచి 11వ తేదీ వరకు జన్మభూమి గ్రామసభల నిర్వహణకు ప్రభుత్వం అక్షరాల రూ.13 కోట్లు విడుదల చేసింది. వాస్తవానికి ఖర్చు మాత్రం రూ.50 కోట్లపైనే జరిగినట్లు అంచనా. జన్మభూమి మా ఊరు గ్రామసభలలో మరోసారి ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, పింఛన్లకే అత్యధికంగా అర్జీలు వచ్చాయి. పుష్కరకాలంగా ఇళ్ల స్థలాల సమస్య మాత్రం పరిష్కారం కావటం లేదు. రాష్ట్రంలో సుమారు లక్షన్నరకుపైగానే ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. వాస్తవానికి ఈ సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ గణాంకాలలో తక్కువగా చూపించటం గమనార్హం. ఇళ్లు కావాలని మరో లక్షమంది దరఖాస్తు చేసుకున్నారు. పేదరిక నిర్మూలన, సామాజిక పింఛన్లకు 1.70 లక్షల దరఖాస్తులు రాగా, వాటిలో 3,606 మాత్రమే పరిష్కారమయ్యాయి. రేషన్ కార్డుల కోసం 1.42 లక్షలకుగాను 15,109 అర్జీలు పరిష్కరించారు. పక్కా ఇళ్ల కోసం 90 వేల అర్జీలు రాగా, కేవలం 3,321 ఇళ్లనే ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం 5.87 లక్షల అర్జీలలో పలు శాఖల అధికారులు 3.98 లక్షల దరఖాస్తులను పరిశీలించినా, ఒక్క మంజూరు లేదు. మరో లక్షకుపైగా అర్జీలను పరిశీలించాల్సి ఉంది. రాష్ట్రంలో ఎన్‌టీఆర్ గృహనిర్మాణ పథకం కింద పక్కా గృహాల కోసం లక్షలాది మంది పేదలు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది పేదలు ఇళ్లు కావాలని దరఖాస్తు చేసుకున్నట్లు గతేడాది గృహనిర్మాణశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు ప్రకటించారు. తాజాగా సభలతో ఆ సంఖ్య మరింత పెరిగినట్లు సమాచారం. ఇక ఇళ్ల స్థలాల సమస్య నేటికీ పరిష్కారం కావటం లేదు. ఒకటీ, రెండు జిల్లాల్లోని మంత్రుల అసెంబ్లీ నియోజకవర్గాల్లోనే నివేశన స్థలాల పంపిణీ జరగ్గా, మెజార్టీ నియోజకవర్గాల ప్రజలు అందుకు నోచుకోలేదు. ఆరో విడత జన్మభూమిలోనే 1.20 లక్షల మంది స్థలాలు కావాలని అర్జీ చేసుకున్నారు. గతంలోనూ పది లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

పశ్చిమ గోదావరిలో అత్యధికం

జన్మభూమి మా ఊరు గ్రామసభల్లో పశ్చిమ గోదావరి జిల్లాలోనే అత్యధికంగా ప్రజల నుంచి అర్జీలు వచ్చాయి. పశ్చిమంలో మొత్తం 78,796 దరఖాస్తులు రాగా, ఇప్పటి వరకు 5,390 పరిష్కారమయ్యాయి. ఈ జిల్లాలోని పోలవరం అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా ప్రజల నుంచి 7,519 దరఖాస్తులు రాగా, 884 పరిష్కారమయ్యాయి. అత్యల్పంగా కడప జిల్లాలో 21,496 దరఖాస్తులకుగానూ 1,468ని అధికారులు పరిష్కరించారు. ఇక గుంటూరులో 71,824, చిత్తూరులో 63,155 , తూర్పు గోదావరిలో 58,724, కర్నూలులో 57,551, విశాఖలో 43,507 జన్మభూమి అర్జీలు వచ్చాయి. అసెంబ్లీ నియోజకవర్గాలలో తూర్పు గోదావరి జిల్లా ప్రత్తిపాడు నుంచి అత్యధికంగా 11,200 దరఖాస్తులకు 608 పరిష్కారమయ్యాయి. విశాఖ తూర్పు నియోజకవర్గంలో 8,631కి 944, గోపాలపురంలో 8,365కి 313, గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో 7,648 అర్జీలకు కేవలం 383 మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి.

నిలిచిన ఎన్టీఆర్ వైద్య సేవలు

(మొదటిపేజీ తరువాయి)

పొందాల్సిన రోగుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉన్న ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎన్టీఆర్ వైద్యసేవల పేరుతో సీఎం చంద్రబాబు ఆర్భాటంగా ప్రవేశపెట్టారు.

ఈ పథకం నిర్వహణలో లోపాలను ఎప్పటికప్పుడు సమీక్షించకపోవడం, బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం వెరసి పథకం అమలు అధ్వాన్నంగా మారిందని ఆస్పత్రుల నిర్వాహకులు పేర్కొంటున్నారు.

ఎన్నికల తర్వాతే బకాయిల చెల్లింపు..?

ఎన్టీఆర్ వైద్యసేవలకుగాను నెట్‌వర్కింగ్ ఆస్పత్రులకు చెల్లించాల్సిన బకాయిలను సార్వత్రిక ఎన్నికల తర్వాతే ప్రభుత్వం చెల్లించే అవకాశమున్నట్లు సమాచారం. ప్రస్తుతం వైద్యసేవలు నిలిచిపోవడంపై అటు నెట్‌వర్కింగ్ ఆస్పత్రులు, రోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ప్రభుత్వం తమ సేవలను వినియోగించుకుని, బకాయిలను సకాలంలో విడుదల చేయలేదని నెట్‌వర్కింగ్ ఆస్పత్రుల అసోసియేషన్ నేతలు పేర్కొంటున్నారు. రెండు నెలల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది.

సంక్షేమ పథకాల పేరిట నిధుల దుర్వినియోగం

పీసీసీ డాక్టర్స్ సెల్ కో-చైర్మన్ అంబటి

ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరిట విచ్చలవిడిగా నిధులను దుర్వినియోగం చేస్తోందని, ఎన్టీఆర్ వైద్యసేవలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పీసీసీ డాక్టర్స్ సెల్ కో-చైర్మన్ అంబటి రాధాకృష్ణ విమర్శించారు. నెట్‌వర్కింగ్ ఆస్పత్రుల అసోసియేషన్ నేతలకు రాష్ట్ర మంత్రులు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ముఖ్యమైన వైద్యసేవలపై ప్రభుత్వం దృష్టిపెట్టడంలో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పేరుతో ఈ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించారని గుర్తుచేశారు. ప్రచారానికి దుబారా ఖర్చుచేస్తోందని పేర్కొన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని డిమాండు చేశారు.

బోసిపోయిన భాగ్యనగరం

(మొదటిపేజీ తరువాయి)

కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, కాప్రా, ఉప్పల్, వనస్థలిపురం తదితర ప్రాంతాలలో జనసంచారం లేక రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ప్రధాన, అంతర్గత రహదారుల్లో వాహనాల రాకపోకలు పెద్దగా లేకపోవడంతో ట్రాఫిక్ పోలీసులకు విశ్రాంతి లభించినట్లయ్యింది. నగరంలో ప్రతి రోజూ వ్యాపార, వాణిజ్య సముదాయాలు వినియోగదారులతో కిటకిట లాడుతుంటాయి. సంక్రాంతి ప్రభావంతో వ్యాపార సముదాయాలు, మార్కెట్‌లు వినియోగదారులు లేక బోసిపోతున్నాయి. రాష్ట్రంలోనే ప్రధాన వాణిజ్య కేంద్రంగా పేరుపొందిన బేగంబజార్‌లో వినియోగదారుల సందడి కనిపించలేదు. కొనుగోలుదారులు లేక వ్యాపారస్తులు కాలక్షేపం చేయాల్సి వచ్చింది. అలాగే నగరంలో ఇతర ప్రధాన వ్యాపార కేంద్రాలుగా పేరుపొందిన చార్మినార్, లాల్‌బజార్, మదీన, సికింద్రాబాద్, అబిడ్స్, అమీర్‌పేట్, చిక్కడపల్లి, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాలలో వాణిజ్య సముదాయాలు బోసిపోయాయి. వీటితోపాటు సాధారణ వాణిజ్య కేంద్రాల్లో సైతం వ్యాపార కార్యకలాపాలు స్తంభించిపోయాయి. వ్యాపారాలు సాగకపోవడంతో కొంత మంది వ్యాపారస్తులు తమ దుకాణాలు త్వరగా మూసివేశారు. కాగా, పండుగకు ఊరెళ్లే ప్రయాణికులతో రైళ్లు, బస్సులు కిటకిటలాడుతున్నాయి.

ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో టికెట్లన్నీ బుకింగ్ అయ్యాయి. దూరప్రాంత రెగ్యులర్ రైళ్లలో రెండు నెలల క్రితమే రిజర్వేషన్లు పూర్తవడంతోపాటు అదనపు చార్జీలతో నడిపే ప్రత్యేక రైళ్లలో సీట్లు నిండిపోయాయి. వీటిలో చాలా రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ పరిమితి కూడా దాటిపోయింది. బెర్తు, సీటు దొరక్కపోయినా.. నిల్చొనైనా వెళ్దామనుకున్నా టికెట్లు బుక్ చేసుకునే పరిస్థితి లేదు. దీంతో సంక్రాంతికి సొంతూరుకు వెళ్లడమెలా అని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సికింద్రాబాద్ తోపాటు కాచిగూడ, నాంపల్లి స్టేషన్లు సంక్రాంతికి ఊళ్లకు వెళ్లే తెలుగు రాష్ట్రాల ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి.

ఒంటరి బాటసారి..!

(మొదటిపేజీ తరువాయి)

మాయావతి ఇంతవరకు నిర్ణయించలేదు. ఆర్ఎల్‌డి నేత అజిత్ సింగ్ ఆరు సీట్లు కావాలని కోరడం వల్లే పొత్తు కుదరలేదని తెలుస్తోంది. కాంగ్రెస్ కూడా తన బలానికి మించి సీట్లు కోరుకుంటోందని ఎస్పీ, బీఎస్పీ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రాష్ట్రాలలోనూ బీఎస్పీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోకుండా నిర్లక్ష్యం చేసిందన్న భావన మాయావతిలో ఉంది. కాంగ్రెస్‌తో పైకి కనిపించని ఘర్షణాత్మకవైఖరి మాయావతిలో ఉందనే ప్రచారం జరుగుతోంది. 2014లో అప్నా దళ్ ఇతర చిన్నచిన్న కులాల గ్రూపులను కలుపుకుని బీజేపీ పోటీచేయడం ద్వారా రాష్ట్రంలోని 80 లోక్‌సభ స్థానాలకు 71 స్థానాలలో గెలుపొందింది. ఈ సారి అప్నా దళ్ బీజేపీకి దూరమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. బహుశా అందువల్లనే పాత మిత్రులను కలుపుకుపోతామని తాజాగా ప్రధాని మోడీ ప్రకటించారు. 2014లో బీజేపీ కూటమికి వచ్చిన ఓట్ల కంటే ఎస్పీ, బీఎస్పీ ఓట్లు కలుపుకుంటే దాదాపు 22 సీట్లకుపైగా అధికంగా ఉన్నాయని, అక్కడ గెలుపు తమదేనని ఆ పార్టీలు ఘంటాపథంగా చెపుతున్నాయి. ప్రస్తుతానికి విశ్లేషకులు కూడా అదేవిధమైన అంచనా వేస్తున్నారు. ఆనాటి మిత్రులు బీజేపీకి ఇప్పుడు దూరంకావడం, అదే సమయంలో తమ రెండు పార్టీలు కలిసి పోటీచేయాలని నిర్ణయించడం, గతంలో ప్రజాదరణ మోడీకి లేకపోవడం వల్ల తామే అధిక సీట్లు గెలుపొందుతామని ఈ రెండు పార్టీలు భావిస్తున్నాయి. గత మూడు దశాబ్దాల కాలంలో కాంగ్రెస్ ఓటింగ్ శాతం గణనీయంగా పడిపోయింది. సోని యా గాంధీ, రాహుల్‌గాంధీ పోటీచేస్తారని భావి స్తున్న అమేథి, రాయ్‌బరేలి స్థానాలలో పోటీపెట్ట రాదని కూడా ఈ రెండు పార్టీలు నిర్ణయించాయి. అప్నాదళ్ కలిసివచ్చేటట్టుంటే 2014 లోక్‌సభ ఎన్నికల్లో వారికి వచ్చిన ఓట్లను అనుసరించి కొన్ని స్థానాలను కేటాయించే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. 2014లో ఎస్పీ, బీఎస్పీలకు వచ్చిన ఓట్లను ఆధారం చేసుకుని సీట్ల పంపిణీ జరిగింది. బీఎస్పీ 34, ఎస్పీ 31 స్థానాలలో రెండో స్థానంలో నిలిచాయి. ఈ ఓట్ల ప్రకారం కాంగ్రెస్ ఆరుస్థానాల్లో మాత్రమే రెండో స్థానంలో నిలిచింది. తమకు 15 లేదా 16 స్థానాలను కేటాయించినా పొత్తు కుదుర్చుకుంటామని కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వి చెప్పారు. 2014లో మోడీ గాలివీచిందని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఆయన అన్నారు. ఉమ్మడి శత్రువుతో పోరాడేందుకు ఒకే వేదికపైకి ఎందుకు రాలేకపోయామన్న అంశాన్ని రానున్న కాలం చెపుతుందని ఆయన వ్యాఖ్యానించారు. 2009లో 22 సీట్లలో గెలిచిన కాంగ్రెస్ 2014లో మూడు సీట్లలో ఐదో స్థానంలో, 11 సీట్లలో నాల్గవ స్థానంలో, రెండు సీట్లలో మూడో స్థానంలో, ఆరు సీట్లలో రెండో స్థానంలో నిలిచిందని గణాంకాలు తెలుపుతున్నాయి. ఒకవేళ పొత్తు కుదుర్చుకున్నా కాంగ్రెస్ ఓట్లు తమకు బదిలీకావడం కష్టమేనని కూడా ఎస్పీ, బీఎస్పీ భావిస్తున్నాయి. ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్పీ 47 సీట్లలో మాత్రమే గెలుపొందింది. 2012లో జరిగిన ఎన్నికలలో అది 221 సీట్లను గెలుచుకుని కాషాయదళాలను మట్టికరిపించింది. 1996లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే ఆ తరువాత కాంగ్రెస్‌తో కలిసి పోటీచేసినప్పటికీ వచ్చాయి. ఓబీసీ, బీసీ, ఎస్సీ తరగతుల ప్రజలు ఎస్పీ, బీఎస్పీకే అత్యధికంగా మద్దతు ఇచ్చే అవకాశం ఉందని, అగ్రవర్ణాలకు ప్రయోజనం కల్పించే పథకాల వల్ల వారు తమకు గణనీయంగా మద్దతు తెలుపుతారని ఎస్పీ నేత అఖిలేష్ యాదవ్ అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో 10 శాతం అగ్రవర్ణాల పేదలకు రిజర్వేషన్ కల్పించడం వల్ల ఎంత ప్రయోజనం కలుగుతుందో ఇప్పుడే అంచనావేయడం కష్టమని విశ్లేషకులు భావిస్తున్నారు. అగ్రవర్ణాలు, మధ్యతరగతి ప్రజలు బీజేపీ పాలన తీరుపై ఆగ్రహంగా ఉన్నట్టు విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

మైనర్‌పై గ్యాంగ్‌రేప్

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు షాక్‌కు గురయ్యారు. బస్తీవాసుల సాయంతో కామాటిపురా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం సుమారు 200 మంది స్థానికులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని కామాంధులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీ సులు రాజేష్, శుభం వ్యాస్, అజిత్ అనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కీలక నిందితుడైన విజయ్‌ని వెంటనే అరెస్ట్ చేయాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు.

డాక్టర్ నిర్లక్ష్యం.. రోగి కిడ్నీ తొలగించిన వైనం

ఫ్లోరిడా : ట్యూమర్ అనుకుని మహిళ శరీరంలోని మూత్రపిండాన్ని తొలగించాడో వైద్యుడు. ఈ ఘటన ఏప్రిల్ 2016లో అమెరికాలోని వెల్లింగ్టన్ రీజనల్ మెడికల్ సెం టర్‌లో జరిగింది. రోగి మౌరీన్ పచెకోకు సర్జన్ రామన్ వాజ్‌క్విజ్ ఆధ్వర్యంలోని ఇద్దరు వైద్యులు సర్జరీ చేస్తూ ట్యూమర్ అనుకుని ఆమె కిడ్నీని తొలగించారు. ఆ తర్వాత విష యాన్ని గుర్తించి నాలుక కరుచుకున్నారు. అయితే, రోగి మౌరీన్ కోర్టుకెక్కింది. డా॥వాజ్‌క్విజ్ తప్పనిసరిగా 3 వేల డాలర్లు (రూ. 2 లక్షలు) జరిమానా చెల్లించాలని, తప్పుడు సర్జరీ చేసినందుకు ఆసుపత్రిలోని సహ వైద్యులకు గంటపాటు ఉపన్యాసం ఇవ్వాలని ఆదేశించింది. కోర్టు ఖర్చుల కింద 4,819.90 డాలర్లు చెల్లించాలని ఆదేశించింది.

సమాచారదర్శిని రైతన్న డైరీ

ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ముద్రించిన రైతన్న డైరీ రైతులకు సమాచారదర్శినిగా ఉపయోగపడుతుందని ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య అన్నారు. విజయవాడలోని రైతు సంఘం కార్యాలయంలో ఆదివారం రైతన్న డైరీతోపాటు రైతులోకం జనవరి సంచికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతాంగానికి అవసరమైన అన్ని రకాల సమాచారం రైతన్న డైరీలో పొందుపరచినట్లు ఆయన చెప్పారు. రైతులోకం మాస పత్రికలో ప్రతి నెలా వివిధ పంటలకు సంబంధించిన విత్తనాల ఎంపిక మొదలుకుని పురుగు మందుల వాడకం, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, నిల్వ, వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు తదితర అంశాలపై శాస్త్ర, సాంకేతిక, వ్యవసాయ రంగ నిపుణులు, రైతు సంఘాల నాయకుల



వ్యాసాలు, ఆదర్శ రైతుల అనుభవాలు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్, కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రధాన కార్యదర్శులు మల్నీడు యల్లమందరావు, ముసునూరు రమేష్, చెరకు రైతు సంఘం నాయకులు ఎం.సుహాస్, సంఘ నాయకులు బండ్లమూడి రాంబాబు, గుంటూరు సాంబిరెడ్డి, విద్యార్థి సమాఖ్య నాయకురాలు కుమారి పాల్గొన్నారు.

వృద్ధాప్య పింఛన్ల పెంపుదలపై సీఎంకు అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వృద్ధాప్య పింఛన్లు వెయ్యిరూపాయిల నుంచి రెండువేలరూపాయిలకు పెంచడంపై ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ సమాఖ్య హర్షం వ్యక్తం చేసింది. ఈమేరకు ఉండవల్లి ప్రజావేదికలో సీఎం చంద్రబాబును కలిసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా వృద్ధుల సంఘం అధ్యక్షుడు బాబూరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ వృద్ధులకు రూ.2 వేలు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం మంచి మేలు చేసిందని అన్నారు. ఎంతో కాలంగా ఈ పెంపు కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. 2007 తల్లిదండ్రుల రక్షణ చట్టాన్ని సమర్థంగా అమలుచేయాలన్నారు.

డ్రై రిసోర్స్ సెంటర్ వద్దు : సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: మహావిశాఖ నగర పాలక సంస్థ పరిధి పెద గంట్యాడ ప్రాంతం బాలచెరువు మీసేవ కేంద్రం గ్రౌండ్స్‌లో 'డ్రై రిసోర్స్ సెంటర్' (డంపింగ్ యార్డ్) ఏర్పాటు చర్యలను తక్షణమే ప్రభుత్వం ఉపసంహరించు కోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సీఎం చంద్రబాబుకు ఆయన ఆదివారం లేఖ రాశారు. ఆవాసాల మధ్య యార్డ్‌ను ఏర్పాటు చేయడం వల్ల 20వేల మంది ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం కలుగుతుంద న్నారు. జీవీఎంసీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీకువానిపాలెం, పెదకోరాడ, చినకోరాడ, బాలచెరువు ప్రాంతం, పెదగంట్యాడ ప్రజలు పెద్ద సంఖ్యలో రెండు వారాల నుంచి తీవ్ర పోరాటం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ విషయమై వెంటనే జోక్యం చేసుకుని డంపింగ్ యార్డు ఏర్పాటు చేయకుండా ఆదేశాలు జారీ చేయాలని సీఎంను కోరారు. విశాఖపట్నం జిల్లా గాజువాక మండల పరిధిలోని సిద్దార్థనగర్ ప్రాంతాన్ని 22-ఎ పరిధి నుంచి తొలగించాలని మరో లేఖలో మధు సీఎంను కోరారు.

పంచాయతీ ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తొలి విడతలో జరిగే పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి నాగిరెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లాలో పర్యటించిన అధికారి పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లపై నోడల్ అధికారులతో పోలీసు అతిథిగృహంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్, ఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రత్యేక ఎన్నికల అధికారి చిరంజీవులు పాల్గొన్నారు. చివ్వెంలలో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై పీవోలకు ఏర్పాటు చేసిన శిక్షణలో నాగిరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తొలి విడత ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వేలం ద్వారా పంచాయతీలను ఏకగ్రీవం చేయడం నేరమన్నారు. సంక్రాంతి సెలవుల్లో సైతం సిబ్బంది పని చేయడం హర్షణీయమని కొనియాడారు. ఎంపీడీవోలు సర్పంచ్ ఎన్నికకు చేసే వ్యయాలను లెక్కిస్తారన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ శాతం భారీగా నమోదయ్యేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్నికల 'మేళా'





లక్నో/అలహాబాద్ : ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన కుంభమేళాకు సైతం అధికార బీజేపీ రాజకీయ రంగును పులుముతోంది. సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కమలనాథులు కుంభమేళా నిర్వహణను ప్రతిష్టాత్మకంగా భావించి విశేష ప్రచారం చేస్తున్నారు. మహా కుంభమేళా ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వస్తుంది. ఆరేళ్ల తర్వాత అర్ధ కుంభమేళా నిర్వహించడం ఆనవాయితీ. 2013లో మహా కుంభమేళా జరిగింది. వాస్తవంగా ఈ ఏడాది అర్ధ కుంభమేళాను నిర్వహించాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఓటుబ్యాంకు రాజకీయాలకు బీజేపీ తెరతీసింది. అర్ధ కుంభమేళాను కుంభమేళా నిర్వహించాలని సీఎం యోగి ఆదిత్యనాథ్ నిర్ణయించారు. ఇందుకోసం రూ.4,236 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. గత బడ్జెట్‌తో పోల్చితే ఇది భారీగా ఉండటం గమనార్హం. ప్రధాని మోడీ చిత్రంతో కూడిన 'దివ్య కుంభ్ - భవ్య కుంభ్' పేరుతో భారీ కటౌట్లు, బ్యానర్లతో ప్రచారాన్ని ముమ్మరం చేసింది. కుంభమేళా ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభమై మార్చి 4వ తేదీ వరకు (50 రోజులపాటు) జరగనుంది. ముఖ్యమైన తేదీల్లో అలాహాబాద్‌లో అంతర్భాగంగా ఉన్న ప్రయాగలోని త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు చేసేందుకు కోట్ల సంఖ్యలో యాత్రికులు వస్తారు. వీరికి అన్ని రకాల సదుపాయాలను కల్పించేందుకు యూపీ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఘాట్‌లతోపాటు రోడ్ల నిర్మాణం, విస్తరణ, తదితర ఏర్పాట్లకు ఇప్పటికే రూ. 2 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. మిగిలిన రూ. 2,236 కోట్లను మంజూరు చేయాలని కేంద్రానికి గత ఏడాదిలోనే లేఖ రాసింది. దీనిపై స్పందించిన కేంద్రం తొలుత రూ. 1,200 కోట్లను గ్రాంట్‌ను అందించేందుకు అంగీకరించింది. మొత్తం బడ్జెట్‌లో రూ. 3 వేల కోట్లను కేవలం అలహాబాద్ అభివృద్ధికి యూపీ ప్రభుత్వం వినియోగించటం గమనార్హం. నగరంతోపాటు నదీ తీరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను శాశ్వత, తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టింది. ఇందుకు సంబంధించిన నివేదికను గత ఏడాది నీతి ఆయోగ్‌కు సమర్పించింది. 2013లో జరిగిన మహా కుంభమేళా నిర్వహణ కోసం అప్పటి యూపీఏ ప్రభుత్వం రూ. 1,141.63 కోట్లను అఖిలేష్ యాదవ్ హయాంలోని సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వానికి గ్రాంట్‌గా అందచేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా దాదాపు రూ. 800 కోట్లను ఖర్చు చేసింది. గత వ్యయంతో పోలిస్తే బడ్జెట్ మూడు రెట్లు పెరిగింది. అర్ధ కుంభమేళా కోసం ఇంత భారీగా ఖర్చు చేయాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దేశంలోనే అత్యధికంగా యూపీ 80 లోక్‌సభ సీట్లను కలిగి ఉన్నందున కేంద్రంలో అధికారంలోకి రావడానికి యూపీ సీట్లు అత్యంత కీలకం. ఈనేపథ్యంలో కుంభమేళాను అత్యంత ఘనంగా నిర్వహించి వివిధ సామాజిక వర్గాల ఓటుబ్యాంకును ఆకర్షిందం కోసమే బీజేపీ శ్రేణులు భారీగా ఖర్చు చేస్తున్నాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. వాస్తవానికి 2025లో మహాకుంభమేళా జరగాల్సి ఉండగా అర్ధకుంభమేళాకు ఇంత హడావుడి చేయాల్సిన అవసరం ఏంటనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

రైల్వేశాఖా అత్యుత్సాహం

కుంభమేళా సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 800 ప్రత్యేక రైళ్లను రైల్వేశాఖ ఇప్పటికే ప్రకటించింది. వీటిలో కొన్ని ఏసీ తరగతి రైళ్లను కేవలం విదేశీ పర్యాటకుల కోసం న్యూఢిల్లీ- అలహాబాద్ మధ్య ఐఆర్‌సీటీసీ నడుపుతోంది. ఇందు కోసం ప్రత్యేకంగా 'కుంభ రైల్ సేవ' పేరుతో మొబైల్ యాప్‌ను కూడా తీసుకొచ్చింది. ఇదంతా ఒక ఎత్తైతే.. అలహాబాద్ సహా సమీపంలోని రైల్వేస్టేషన్లలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు రూ. 700 కోట్లను వెచ్చించింది. అలహాబాద్, సుబేదార్‌గంజ్, అలహాబాద్ నైని, అలహాబాద్ చౌకీ స్టేషన్లలో ప్లాట్‌ఫారాలను విస్తరించడమే కాకుండా అదనంగా ప్లాట్‌ఫారాలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, ప్రయాణీకులు వేచి ఉండే గదులు, తాగునీరు, మరుగుదొడ్ల వంటి సదుపాయాలను కల్పించింది. ప్రయాగ్‌ఘాట్ పేరుతో నూతనంగా రైల్వే టెర్మినల్‌ను నిర్మించింది. ఇందులో ఐదు ప్లాట్‌ఫారాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించింది. అలహాబాద్‌లో కూడా నూతనంగా ప్లాట్‌ఫారాన్ని ఏర్పాటు చేసింది. గత 2013లో కుంభమేళాలో ఒకేసారి రద్దీ పెరిగి పోయిన కారణంగా అలహాబాద్ రైల్వేస్టేషన్‌లో ఫుట్ బ్రిడ్జి కూలి 35 మంది మృత్యువాత పడ్డారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రద్దీకి అనుగుణంగా ప్లాట్‌ఫారాలపైకి ప్రయాణీకులను అంచెలంచెలుగా అనుమతించే ఏర్పాటు చేసింది.



ఆకట్టుకుంటున్న కైట్, స్వీట్ ఫెస్టివల్స్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్‌లో రంగు రంగుల పతంగులు.. రకరకాల ఆకృతులు నింగీ నేలను కలుపుతూ రివ్వున ఎగిరే అంతర్జాతీయ పతంగుల పండుగ ప్రారంభమైంది. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్‌ను ఆదివారం ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభించారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్, హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. వెంకయ్య మాట్లాడుతూ కైట్ ఫెస్టివల్‌తో పాటు స్వీట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. దేశ సమైక్యతను ప్రతిబింబిచేలా చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయన్నారు. మహమూద్ అలీ మాట్లాడుతూ నాలుగేళ్లుగా అంతర్జాతీయ పతంగుల పండగు నిర్వహిస్తున్నామని, పతంగుల పండగ అందరిలోనూ ఉత్సాహం నింపుతోందన్నారు. ఈ వేడుకలో 20 దేశాలనుంచి 42 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లైయర్స్, 60 దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు, పెద్దసంఖ్యలో సందర్శకులు పాల్గొంటారు. అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్‌లో భాగంగా 22 దేశాలు, దేశంలోని 25 రాష్ట్రాలకు చెందిన 1,200 రకాల స్వీట్లు కొలువు దీరాయి. కాకినాడ ఖాజా, బందరు లడ్డూ, పదిరకాల పాయసాలు ఉన్నాయి. హైదరాబాద్‌లో స్థిరపడిన గుజరాతీలు, బెంగాలీలు, రాజస్థానీలు, కేరళ, తమిళనాడు, కర్ణాటక అసోసియేషన్స్ మిఠాయిలను ప్రదర్శనకు ఉంచారు.రోజు ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు కైట్ ఫెస్టివల్‌లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

హోదా రాకుంటే
ఏపీలో అడుగుపెట్టను

రఘువీరా

విశాలాంధ్ర- అనంతపురం: ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ ప్రధాని అయిన వెంటనే ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేస్తారని, వాటిని అమలు చేయకపోతే తాను తన స్వగ్రామం నీలకంఠాపురంలో, ఏపీలో అడుగు పెట్టనని ఏపీసీసీ అధ్యక్షులు ఎన్. రఘువీరారెడి వెల్లడించారు. ఆదివారం అనంతపురం సప్తగిరి సర్కిల్ టవర్‌క్లాక్ వద్ద దివంగత మాజీ ప్రధానులు రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీల విగ్రహాలను కర్ణా టక మాజీ ముఖ్యమంత్రి సిద్దారామయ్య, ఏపీసీసీ అధ్యక్షులు ఎన్.రఘు వీరారెడ్డి ఆవిష్కరించారు. దేశ సమగ్రత కోసం ఇందిరాగాంధీ,రాజీవ్ గాంధీ ప్రాణ త్యాగం చేశారన్నారు. ఇందిరా గాంధీ హయాంలో హరిత విప్లవంతో ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించామన్నారు. రాజీవ్ గాంధీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి బాటలు వేశారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని ఇటీవల దుబాయ్‌ల, అంతకు ముందు కర్నూలులో రాహుల్‌గాంధీ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, కర్ణాటక మాజీ మంత్రి రేవణ్ణ, డీసీసీ అధ్యక్షులు కోటా సత్యం, పీసీసీ అధికార ప్రతినిధి కేవీ రమణ, అనంతపురం పార్లమెంట్ నియోకజకవర్గ బాధ్యులు డా.రాజీవ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుధాకర్, నాగరాజురెడ్డి, నగర కాం గ్రెస్ అధ్యక్షులు దాదాగాంధీ పాల్గొన్నారు.

అధికారుల జోక్యంతో నిలిచిన
టోల్ చార్జీల వసూళ్లు

- ప్లాజాల వద్ద సాధారణ పరిస్థితి
- మూడు షిఫ్టులలో పోలీసుల పర్యవేక్షణ

విశాలాంధ్ర బ్యూరో - హైదరాబాద్/అమరావతి : సంక్రాంతి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో సొంత ఊళ్లకు వెళుతున్న ప్రజలకు చుక్కలు చూపిన టోల్ ప్లాజా సిబ్బంది చివరకు అధికారుల జోక్యంతో టోల్ చార్జీల వసూళ్లను నిలుపుదల చేశారు. టోల్ చార్జీలను రద్దు చేసినట్లు స్వయంగా ముఖ్యమంత్రులే చెప్పినా లెక్కచేయకుండా ఆదివారం టోల్ ఫీజు కట్టాల్సిందనంటూ ముక్కుపిండి మరీ వసూలు చేశారు. టోల్ గేట్ యాజమాన్యాల తీరుపై వాహనదారులు తీవ్రంగా మండిపడ్డారు. సంక్రాంతి రద్దీతో వాహనదారుల సౌలభ్యం కోసం టోల్ ట్యాక్స్ రద్దు చేస్తూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ నెల 13, 16 తేదీల్లో వాహనదారుల నుంచి ఎలాంటి ట్యాక్స్ వసూలు చేయొద్దని, వారిని ఫ్రీగా వదిలేయాలని ఆదేశించారు. కానీ టోల్ ప్లాజాల యాజమాన్యాలు మాత్రం ఆదేశాలను లెక్క చెయ్య లేదు. ఔటర్ రింగ్ రోడ్డుపై



విజయవాడ-చెన్నై మార్గంలోని కాజ టోల్‌ప్లాజా

ఉన్న జడ్చర్ల, నల్గొండ జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ గేట్ దగ్గర ఆదివారం సాయంత్రం వరకూ వసూళ్లు కొనసాగాయి. చార్జీలు వసూలు చేస్తుండటంతో వాహనదారులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి లిఖిత పూర్వక సమాచారం రాలేదని చెబుతున్న సిబ్బంది చార్జీలు కడితేగానీ వాహనాలను వెళ్లనిచ్చేది లేదని స్పష్టం చేస్తున్నారు. దీంతో పలువురు వాహనదారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పత్రికల్లో వచ్చిన వార్తలను చూపించి గొడవపడుతుండటంతో తెలుగు రాష్ట్రాల్లో దాదాపు అన్ని టోల్ ప్లాజాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం టోల్ ట్యాక్స్ రద్దు చేసింది కదా మరి ఎందుకు వసూలు చేస్తున్నారని వాహనదారులు అడిగితే.. తాము ఎన్‌హెచ్‌ఏఐ పరిధిలో పని చేస్తున్నామని.. కేంద్ర ప్రభుత్వం నుండి ఆదేశాలు వస్తేనే టోల్ వసూలు నిలిపి వేస్తామని సిబ్బంది తెగేసి చెప్పారు. పంతంగి టోల్ ప్లాజా వద్ద కొందరు వాహనదారులు తాము టోల్ కట్టేది లేదని, దీనికోసం ఎంతకైనా వెళతామని నిరసనకు దిగారు. దీంతో హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. మరోవైపు ఆర్డీవో సంపత్‌కుమార్ పంతంగి టోల్‌ప్లాజా నిర్వాహకులతో చర్చించి ఒప్పిందంతో సాయంత్రం నుంచి టోల్ చార్జీల వసూళ్లను నిలిపివేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ పలు టోల్‌ప్లాజాల వద్ద కూడా సాయంత్రం వరకూ పన్ను వసూళ్లు చేసిన నిర్వాహకులు జిల్లా అధికారుల జోక్యంతో వెనక్కి తగ్గి పన్ను వసూళ్లను నిలిపివేశారు. దీంతో హైదరాబాద్-విజయవాడ మార్గంలోని చిల్లకల్లు, కీసర టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ తగ్గి పరిస్థితి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే విశాఖపట్నం వైపు వెళ్లే రహదారిలోని కత్తిపూడి, కుక్కిపాడు, తణుకు టోల్‌ప్లాజాలు, విజయవాడ-చెన్నై మార్గంలోని కాజ, గుంటూరుజిల్లాలోని తుమ్మలచెరువు టోల్‌ప్లాజాల వద్ద పోలీసులు మూడు షిఫ్టులలో పనిచేస్తూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. ఈ చర్యలతో అన్ని టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్‌జామ్‌లు లేకుండా అన్ని రకాల వాహనాలు సజావుగా వెళుతున్నట్లు పోలీసు వర్గాలు స్పష్టం చేశాయి.

జగన్‌పై హత్యాయత్నం కేసు..
హైదరాబాద్‌కు నిందితుడు

విశాఖపట్నం / హైదరాబాద్ : ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్నారు. విచారణలో భాగంగా నిందితుడు శ్రీనివాసరావును ఆదివారం విశాఖకు తీసుకెళ్లిన ఎన్ఐఏ అధికారులు అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. తొలుత విశాఖ విమానాశ్రయంలో నిందితుడు పనిచేసిన టీడీపీ నేత హర్షవర్ధన్ చౌదరికి చెందిన ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంట్‌తో పాటు వీవీఐపీ లాంజ్‌ను పరిశీలించారు. నిందితుడ్ని తీసుకెళ్లి ఘటన జరిగిన తీరుతెన్నులను తెలుసుకున్నారు. కోడిపందాల కత్తిని భద్రపర్చిన ప్రదేశంపై కూడా ఆరా తీశారు. అంతకుముందు విశాఖలోని సీఆర్పీఎఫ్ ట్రైనింగ్ సెంటర్‌లో న్యాయవాది సలీం సమక్షంలో నిందితుడిని విచారించాలని అధికారులు భావించారు. అయితే ఈ ప్రదేశం అనువైనది కాదని భావించి మరో చోటుకు తరలించేందుకు ఉన్నతాధికారుల అనుమతిని కోరారు. సమ్మతి లభించడంతో నిందితుడు శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లోని ఎన్ఐఏ ప్రాంతీయ కార్యాలయానికి తరలించారు.

భావితరాలు 'కనబడుటలేదు'

- రాష్ట్రవ్యాప్తంగా 5,810 మిస్సింగ్ కేసులు
- కృష్ణాలోనే అత్యధికం
- పిల్లల్లో మానసిక ఒత్తిళ్లే కారణం



విశాలాంధ్ర-అమరావతి : రేపటి పౌరులుగా బంగారు భవిష్యత్తును పొందాల్సిన బాలలు వేర్వేరు కారణాలతో ఇళ్ల నుంచి వెళ్లిపోతున్నారు. ఇందుకు తెలిసి తెలియని వయస్సులో చేదు వ్యసనాలకు బానిసలు కావటం, ప్రేమ వ్యవహారాల నేపథ్యంలో వివాదాలు, కుటుంబంలో కలహాలు, మార్కులు, ర్యాంకుల ఒత్తిళ్లు, తల్లిదండ్రుల ప్రేమానురాగాలకు దూరం కావడం వంటివి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గతేడాదికి 5810 మంది చిన్నారుల మిస్సింగ్ కేసులు నమోదయ్యాయని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నతమైన భవిష్యత్తు ఆకాంక్షతో పిల్లల్లో విద్యా సామర్థ్యాన్ని పెంపొందించాలని విపరీతమైన ఒత్తిడిని తల్లిదండ్రులు తీసుకొస్తున్నారని, పిల్లల సంరక్షణలో వారు విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పిల్లల మిస్సింగ్ కేసులు 5810 నమోదు కాగా, కృష్ణా జిల్లాలో 985, శ్రీకాకుళంలో 124, విజయనగరంలో 172, విశాఖపట్నంలో 629, గుంటూరులో 655, ప్రకాశంలో 301, నెల్లూరు జిల్లాలో 326, చిత్తూరులో 473, కడపలో 236, కర్నూలులో 325, అనంతపురంలో 522, తూర్పు గోదావరి జిల్లాలో 569, పశ్చిమగోదావరి జిల్లాలో 493 కేసులు నమోదయ్యాయని అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తోంది. పిల్లల్లో అపోహలను తొలగించి, మానసిక పరివర్తనను పెంపొందించేందుకు కృషి చేస్తే ఇలాంటి ఇబ్బందులను నివారించవచ్చునని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పాఠశాలల్లో బాలలకు స్నేహపూర్వక వాతావరణం ఉండాలని చెబుతున్నారు. విద్యతో పాటు వారికి ఆసక్తి ఉన్న రంగంలో ప్రోత్సహించాలని, ప్రతిభను మెచ్చుకుంటూ మరింతగా ప్రోత్సహిస్తే వారు ఉత్సహంగా ముందుకు వెళ్తారన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన తరగతులు నిర్వహిస్తే మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. అయితే, చిన్నారుల మిస్సింగ్ కేసులు విషయంలో అధికారులు ఏ విధంగా చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

పంటలు ఎండుతుంటే...
సంక్రాంతి సంబరాలా...!

- 20 గ్రామల్లో ఎండిన పంటలు
- చంద్రబాబుపై విపక్ష నేతల ధ్వజం
- జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో
- 22న బీఎన్ కండ్రిగ మండల కార్యాలయం ముట్టడి



తొట్టంబేడు మండలంలో రాస్తారోకో నిర్వహిస్తున్న ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జనార్ధన్ తదితరులు

విశాలాంధ్ర - బిఎన్‌కండ్రిగ / తొట్టంబేడు (చిత్తూరు) : వర్షాభావం, సాగునీటి కొరత, కరవు తదితర సమస్యలతో రైతులు అల్లాడుతుంటే, సీఎం చంద్రబాబు సంక్రాంతి సంబరాలు చేసుకోవటంపై పలువురు నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా బీఎన్ కండ్రిగ, తొట్టంబేడులో రైతాంగ సమస్యలపై సీపీఐ, ఏపీ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో జరిగింది. బీఎన్ కండ్రిగ మండలంలోని 20 గ్రామాల్లో వరి పంట పూర్తిగా ఎండిపోయింది. తొట్టంబేడు మండలంలో సుమారు తొమ్మిది వేల ఎకరాల పంట ఎండింది. కండ్రిగ మండలంలోని నమనంబేడులో ఎండిన పంటలను సీపీఐ నాయకులతోపాటు ఏపీ రైతుసంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు టీ జనార్ధన్, కార్యదర్శి పీఎల్ నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) కార్యదర్శి చిన్నం పెంచలయ్య తదితరులు పరిశీలించారు. ఎండిన పంటలు, కరవును పట్టించుకోకపోవటాన్ని నిరసిస్తూ నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారిపై లింగమనాయుడుపల్లె వద్ద రాస్తారోకో చేశారు. వీరికి వైసీపీ నాయకులు కూడా మద్దతు పలికారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు జనార్ధన్ మాట్లాడుతూ, తొట్టంబేడు ప్రాంతానికి తెలుగు గంగ ప్రవహిస్తేనే పంటలు పండుతాయన్నారు. ఏళ్ల తరబడి నుంచి పాలకులు పట్టించుకోకపోవటంతో వేలాది ఎకరాల్లో పంట ఎండుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కండ్రిక మండలంలో ఏటా 3,500 హెక్టార్లలో వరి సాగవుతుండగా, ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో పంట వేయలేదన్నారు. తీవ్ర వర్షాభావానికి తోడు సాగునీటి సమస్య ఉందన్నారు. కొద్దిపాటి వర్షానికి రైతులు పంటలు వేయగా, మరికొందరు విద్యుత్ మోటార్లపై ఆధారపడి పంట వేశారన్నారు. రైతులకు సాగునీటిని అందించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కనీసం తెలుగుగంగ పరివాహక ప్రాంతాలకు కూడా సాగునీరు అందని పరిస్థితి నెలకొంద న్నారు. తెలుగుగంగను పూర్తి చేయలేని ప్రభుత్వా నికి గోదావరి - పెన్నా ప్రాజెక్టు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఎన్నికల కోసం ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెబుతోందని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న బీఎన్ కండ్రిగ మండల కార్యాలయాన్ని ఐదు వేల మంది రైతులతో ముట్టడించనున్నట్లు హెచ్చరించారు. సీపీఐ సీనియర్ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ, కరవుతో రైతులు అల్లాడుతుంటే, చంద్రబాబు సొంతూళ్లో సంక్రాంతి సంబరాలు ఎలా నిర్వహించుకుంటారని ప్రశ్నించారు. సంక్రాంతి అంటేనే రైతుల పండుగని, అలాంటి రైతులే బాధల్లో ఉన్నారని తెలిపారు. వైసీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, రైతాంగ సమస్యలపై నారావారిపల్లె వెళ్లి చంద్రబాబుకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సీఎం వ్యవహరిస్తున్న తీరును చూస్తేనే, ఆయనకు రైతులపై ఏమేర ప్రేమ ఉందో అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. రాస్తారోకో వల్ల జాతీయ రహదారిపై మూడు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కత్తి రవి, సుబ్రహ్మణ్యం, కత్తి ధర్మయ్య, అజయ్ కుమార్, వైసీపీ నాయకులు వాసుదేవనాయుడు, రమణయనాయుడు, గిరిబాబు, శేఖర్, రైతు సంఘం నాయకులు పుట్టా వినోద్‌కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కనమనంబేడులో ఎండిన వరిపంటను పరిశీలిస్తున్న ఏపీ రైతుసంఘం నాయకులు జనార్ధన్, నరసింహులు

సాహితి

చాసో, జయకాంతన్ కథలు - మహిళా జీవనం

- డా. రాయదుర్గం విజయలక్ష్మి

“మార్క్సిజాన్ని కథా సాహిత్యంలో ప్రవేశ పెట్టింది నేనే” అని సగర్వంగా చెప్పుకొన్న చాగంటి సోమయాజులు, (1914–1994) చాసో గారు, తమ కథల్లో, ఔచిత్యం, క్లుప్తత, అనితరసాధ్యమైన శిల్పవిన్యాసంతో మానవ జీవితాన్ని శాసించే ఆర్థికఅంశాల ప్రభావాన్ని, నిర్దిష్టంగా చూపారు. మానవ జీవితం, ఈ భూగోళం చుట్టూ, ఎక్కడైనా ఒక్కటేనని, తాను విజయనగర ప్రాంతానికి చెందిన జీవితాలను రాసినా, అది సమస్త మానవ జీవితాలకు వర్తిస్తుందనే నమ్మకంతోనే రాశానని చెప్పుకొన్నారు. ఇది ఎంతోనిజం కూడా!

ఇక తమిళ రచయిత జయకాంతన్ గారు, (1934–2015) తమిళనాడు, కడలూరులో జన్మించారు. బాల్యంలోనే తండ్రిని కోల్పోయిన వీరు, మేనమామల దగ్గర పెరుగుతూ, పన్నెండేళ్ళ ప్రాయంలో మదరాసుకు చేరుకుని, కమ్యూనిస్టు పార్టీ ఆఫీసులోనే పెరిగిన వ్యక్తి, పార్టీ సభ్యులు కూడా! స్నేహితులు, సాటి రచయితలు, జె.కె.అని పిలుచుకునే జయకాంతన్, చాసో గారి లాగే లెఫ్టిస్ట్ భావజాలాన్ని ప్రేమించే వారు. దాదాపు 28 కథా సంపుటాలను, 38 నవలలను, పెక్కు వ్యాస సంకలనాలను, జీవిత చరిత్రలను, తన ఆత్మకథను రచించిన వీరు, తమ నవలలు కొన్నిటిని తామే దర్శకులుగా, సినిమాలను తీసినవారు కూడా!

“మానవ జాతిని, జీవితాన్ని ప్రేమించడమే నా సిద్ధాంతం. మానవజాతిని గురించి మానవుడి ఊహలు, ఆలోచనలు ; దేశము, భాష అనే ఎల్లలను దాటి విశ్వవ్యాప్తంగా పరిఢవిల్లడమే ఉత్తమ నాగరికతా లక్షణం” అని నమ్మిన జె.కె.చాసో గారి లాగే తాను ఎన్నుకున్న ప్రగతి పథంవైపు నడిచిపోతూ, అందుకనుగుణంగా రచనలు చేసినవారు. జీవితంలోని లోతులను, సమాంతరాలను, మానవతను, ఆర్థిక అంశాల నేపథ్యంతో కథలుగా మలిచినవారు కూడా!

చాసో, జె.కె.కథల్లో దాదాపు, నాలుగు తరాల మహిళలు కన్పిస్తారు. ప్రపంచ యుద్ధాల నేపథ్యంలో, సమాజం కల్లోలిత మైన విధం కనిపిస్తుంది. బాల్యం, యౌవనం, విద్య, కుటుంబ వ్యవస్థ, సమాజం.. వీటిని ఆర్థికఅంశాలు ఎలా ప్రభావితం చేస్తున్నాయో ఈ కథలు చెబుతాయి. ముగింపును వాచ్యం చేయకుండా పఠితల విచక్షణకే వదిలివేసే చాసో కథలు, జీవితాలను శాసించే సామాజిక అంశాలను వివరించే జె.కె.కథలు – ఎన్నో పోలికలతో కనిపిస్తాయి.

మొదట చాసోగారి కథల్లో మహిళా జీవనాన్ని, ముఖ్యంగా తల్లుల చేతనను గమనిద్దాం!

'వెలం వెంకడు' (1952–53) కథలో, నాయురాలు, కొడుకును చదువు నిమిత్తం పట్నం పంపడానికి పేచీ పెడుతున్న భర్తకు నచ్చజెప్పడానికి వచ్చిన మనుష్యులను చూస్తూ, “అంతా వెళ్ళండి” అంటూ మెడ తడుముకుంటుంది. మెడ నిండా, మెడ తిరగని బంగారం అందరికీ పచ్చగా కనబడ్డదట! 'నువ్వు ఒప్పుకోకపోతే, నేను చదివించగలను' అని నోరు తెరవకనే చెప్పిన భార్య ధైర్యాన్ని గమనించిన వెంకడు, తానే కొడుకును పట్నం పంపాడట! కార్యాన్ని సానుకూలంచేసుకున్న చైతన్యం నాయురాలిది.

'తేలమ్మ' అని నిందింపబడుతూ, ఒంటిచేత్తో సంసారాన్ని నడిపిస్తున్న ముత్తేలమ్మ, తనకు చెప్పకుండా కొడుకు, తమ మళ్ళలోని గడ్డిని అమ్మేయడమే గాక, తానే ఇంటికి యజమానినని, ఎవరికీ చెప్పవలసిన అవసరం తనకు లేదని పంచాయితీలో చెప్పినపుడు, 'అయ్యో, కొడుకు అమ్మిన విషయం తెలియక, రచ్చ కీడ్చానే' అని బాధపడటం, ఆమె మాతృ ప్రేమకు ఉదాహరణ (బొక్కా, బొచ్చు తువ్వాలు, 1979)! పితృస్వామ్య వ్యవస్థలో, ఆర్థిక ప్రభావంతో అహంకరించిన కొడుకు మనస్తత్వానికిది ప్రతీకకూడా!

తన పసిబిడ్డడిని దత్తతకిచ్చి, కొడుకు పెద్దవాడై నడుపుతున్న, బట్టలకొట్టుకు వచ్చి కొడుకును చూసిపోవడాన్ని అలవాటు చేసుకున్న, గున్నమ్మ (పోనీతిను, 1979), ముసలితనంలో అదే బట్టలకొట్టు ముందు ప్రాణాలు విడుస్తుంది. ఆర్థిక లేమి, మాతృత్వాన్ని కూడా వ్యాపారవస్తువుగా మార్చిన వైనాన్ని చెప్పే ఈ కథ చదువుతుంటే, తానే అతని తల్లినని చెప్పక, కొడుకును కళ్ళారా చూసుకునే, గున్నమ్మ పాత్ర మనసును తడిచేస్తుంది.

రైల్వే సిబ్బందికి ఎంతో కొంత ముట్ట జెప్పినా, బియ్యాన్ని దొంగతనంగా అమ్ముకునే వ్యక్తిగానే తనను ముద్రవేసినా, కొడుకు సంసారంకోసం గోదావరి మండలం నుండి బియ్యాన్ని కొనుక్కుని వెళ్ళే ముసలమ్మ కథను చెప్పే 'కుక్కుటేశ్వరము' (1952) అన్న కథ, మనుగడకు అత్యంత అవసరమైన బియ్యం వంటి సరుకులు కూడా వ్యక్తులను దొంగలుగా ఎలా ముద్రిస్తాయో చెప్పడంతో బాటు, అత్యంత నిరుపేదలను కూడా దోచుకునే 'అసలు దొంగలెవరు' అన్న విషయాన్ని, స్పష్టంగానే చర్చిస్తుంది.



చాగంటి సోమయాజులు

తన ముగ్గురుపిల్లల పోషణ కోసం ఊరిలోని పెద్ద మనుషులెందరితోనో సంబంధం పెట్టుకొని, పెద్ద కొడుకును ఉద్యోగస్థుని చేసిన తల్లులు (చెప్పకు, చెప్పకు– 1979), రంగూన్ వెళ్ళిన అల్లుడు రెండేళ్ళైనా తిరిగి రాకపోగా, తమ కూతురి పెళ్లికైన నూట పాతికరూపాయల అప్పునుతీర్చేసిన, శాస్త్రితో, తన కూతురికి సంబంధాన్ని కల్పించిన (ఆవెత– 1946) తల్లులు.. వీరు తమ పేదరికం మీద యుద్ధం చేసిన వారే !

అనైతికంగా సంపాదిస్తూ, భర్తను చదివించి, పెద్ద ఉద్యోగస్థుని చేసి, అతనికి వచ్చిన 'సర్' బిరుదు ద్వారా తాను 'లేడీ కరుణాకరం (1945) అనిపించుకున్న, శారద వంటి వారి పతనానికి కూడా ఆర్థిక స్థితే మూలం కావడం ఆలోచించవలసిన విషయమే! 'తన భర్త చెడితేనే తాను చెడ్డానని, తాను బుద్ధి తెచ్చుకుని బాగుపడడమే కాక, తన భర్త బుద్ధినిమార్చి తానే బాగుచేసుకున్నానని' చెప్పుకున్న, 'బదిలీ (1945) కథలోని నాయిక, భర్త దుర్వ్యసనానికి బలై, తేరుకున్న మహిళ.

సంఘంలోని దురాచారాలు మారాలంటే వ్యవస్థలోనే మార్పురావాలన్నది చాసో గారి అభిప్రాయం. ఇటు విద్య గాని, అటు ఆర్థిక వనరులమీద హక్కుగాని లేని గత శతాబ్దపు మహిళలు కొందరు, తమ మనుగడ కోసం తమ శీలాన్నే పెట్టుబడిలా ఉపయోగించుకున్న విధాన్ని గూర్చి వివరిస్తాయి ఈ కథలు. బొమ్మా–బొరుసులా సాగిన సామాజిక వైకృతాన్ని, ఎత్తిచూపడమే చాసో గారి ఉద్దేశ్యం! వితంతువుల జీవితాల్లోని అసమానతలు, పేదరికం, పితృస్వామ్య వ్యవస్థలో మహిళల పాట్లు – వీటితో బాటు సౌఖ్యవంతమైన జీవితాలకు అలవాటుపడి, అందులో నుంచి బయటకు రాలేక, పాపపు బ్రతుకుల్లోనే కూరుకుపోయిన మహిళలను కూడా పరిచయం చేస్తాయి ఈ కథలు. తనకు ప్రాణం పోసి, కొత్త చీరను పెట్టిన, అమ్ముడుపోయిన ఫిడేలులో కన్నతల్లిని చూసుకున్న రాజ్యం (వాయులీనం–1952) వంటివారితో బాటే, తమ కూతుర్ని కూడా తనతో తిప్పుకున్న తల్లులు (చెప్పకు, చెప్పకు) కూడా ఈ కథల్లో కనిపిస్తారు. సాధారణంగా దిగువమధ్యతరగతి ప్రజల్లో కానవచ్చే జీవితం పట్ల నిర్లక్ష్యాన్ని కూడా ఈ కథలు నమోదు చేస్తాయి. వ్యవస్థలోనికుళ్లను ఎన్నో విధాలుగాచూపిన చాసో, అందుకే, 'వ్యవస్థే మారాలి' అంటారు.

ముసలిభర్త చనిపోతే, నిస్సంతువైన భార్యకు, ఆస్తి హక్కు లేదు అన్న ఆనాటి వ్యవస్థ మూలంగా జరిగిన అనర్థాలను జయించిన మహిళ మాణిక్యమ్మ. 'ఏలూరెళ్ళాలి' (1943) కథలో, ముసలి ఆడిటర్ రెండవ భార్య అయిన ముప్పై అయిదేళ్ళ మాణిక్యమ్మ, ఇంటరు చదువుతున్న పద్దెనిమిదేళ్ళ పురుషోత్తం ద్వారా కొడుకును కని, ఆస్తిపైహక్కును సంపాదించుకుంటుంది. అందుకే వ్యవస్థే మారాలి అంటారు చాసో!

'సంతతి', 'ఆస్తి హక్కు'.. వితంతువుల జీవితాలకు చాలా అవసరమని, ఆ రెండూ లేని వితంతు స్త్రీల జీవితాలు, ఎంత నిర్దాక్షిణ్యంగా అణచివేయబడినాయో అన్న విషయాలపై మనకు కొంతైనా అవగాహన ఉంది. సరిగ్గా ఇదేవిషయాన్ని చెప్పే జయకాంతన్ కథ, 'యుగసంధి' (2000) అన్న కథ!

వితంతువు అయి, టీచర్‌గా పనిచేస్తున్న, తమ ముప్పైయేళ్ళ కూతురు గీత, తనతో పనిచేసే హిందీ టీచర్‌ను వివాహం చేసుకుందని తెలిసి, ఆమెను నానారకాలుగా శాపనార్థాలు పెట్టే, ఆమె తల్లిదండ్రులను, అక్కను అసహ్యించుకునే, సోదరీ సోదరులను గమనిస్తూండిన నాన్నమ్మ, గౌరియమ్మ, చాలా విచక్షణా శీలి అయిన వ్యక్తి. “మీ నాన్న పోయినపుడు, నువ్వు పాలుతాగే పసివాడివి. నా బోడితలను, బొట్టులేని మొహాన్ని చూసి, నా దగ్గరకు వచ్చేవాడివే కాదు. ఆకలితో అల్లాడుతున్న నిన్ను చూసి, గుండెలు తరుక్కుపోతున్నా, ఆచారాల పేరుతో, అన్నిటినీ భరించాం.. కానీ నువ్వు గీతకు తలబోడి చేయకుండా ఎందుకు ఒదిలినట్లు? కాలంతో బాటు వచ్చిన మార్పు వలనే కదా! ఆమె ఉద్యోగం చేయడానికి అనుమతిని అడిగినపుడు, నువ్వు 'సరే' అన్నావు ఎందుకు? కాలం మారుతూ వస్తోంది. మనుషులు కూడామారాలి అని..నాకప్పుడు నువ్వన్నావు.. కొంత ఆస్తిఉండింది. మరి గీతకు అవేవీ లేవు. ఆమె ఏం తప్పు చేసింది?

ఆలోచించు... ఈ శాస్త్రాలు, ఆచారాలు నాతోబాటే పోనీ. నువ్వు, నీ కుటుంబం సుఖంగా ఉండండి. నాకు 'గీత' కావాలి. నేను పోతున్నాను గీత దగ్గరకు. గీతతో పాటే నాకు కూడా చేర్చి తలను మునిగేయ్” అంటూ ఆ ఉదయపు చల్లని నీడలో కాళ్ళకు చల్లగా తగులుతున్న మట్టిలోకి నడుచుకుంటూ గౌరియమ్మ వెళ్ళిపోతుంది. 'మెల్లగా అడుగులేస్తూ ముందుకు కదులుతున్న పాత యుగపు ప్రతినిధి అయిన ఆమె, వేగంగా ఆవేశం లేకుండా వస్తున్న కొత్త యుగానికి ఎదురేగి ఆ యుగాన్ని ఆహ్వానించేందుకు పయనిస్తూ ఉంటే... 'ఓ.. దానికి ఒక పరిపక్వత కావాలి' అంటూ ముగిస్తారు జయకాంతన్. ఈ రెండు కథలు కూడా వ్యవస్థా లోపాన్ని వివరిస్తూనే, ఈ ధనస్వామ్య ప్రపంచంలో, జరిగే అన్యాయాలకు బలి కాకుండా, వాటికి ఎదురొడ్డి నిలబడాలని చెప్పేకథలే!

అలాగే చాసోగారి, 'ఆవెత' అంటే విందు అన్న కథలోనూ, 'చెప్పకు, చెప్పకు' కథలోను, తల్లులను గుర్తుచేసే కథ జయకాంతన్ గారి 'అగ్నిప్రవేశం' (1966) కథ! ఒక వర్షపు రోజు సాయంత్రం, ఎంతకూ రాని బస్సు కోసం ఎదురుచూస్తూ నిల్చున్న డిగ్రీ చదువుతున్న అమ్మాయిని, కారెక్కించుకుని, ఆమెపై అత్యాచారం చేసి, ఇంటి దగ్గర దింపుతాడొక ధనిక యువకుడు. కూతురు ద్వారా విషయం తెలుసుకొన్న తల్లి, మొదట్లో కూతురిని చితకబాదినా, తరువాత ఆమె ఆలోచనల్లోని విచక్షణతో కూడిన పక్వతను గమనించగలం. తన బిడ్డా, తాను చనిపోయినా, వచ్చిన అపప్రథ తొలగిపోదుకదా? చిన్నపిల్ల తన తప్పులేకుండా తానెందుకు చావాలి? అని ఆలోచించి, కూతురికి చన్నీళ్లతో తలస్నానం చేయించి, “నీ మచ్చ కడిగి పారేశానే తల్లీ! ఏ మచ్చా నిన్నంటలేదని నమ్ము. పాప పుణ్యాలకు మనస్సే కారణం.. తెలిసీ తెలియని వయసమ్మా నీది. ఈ వయస్సులో మనసుకు నొప్పి కలుగనే కూడదు. జరిగిందాన్ని గురించి బాధపడకు. కాని దాన్ని మరచిపోకుండా జాగ్రత్తగా మసలడం నేర్చుకో.. ఈ విషయం గురించి ఎంత దగ్గరివారైనా, ఎవరితోనూ చెప్పకు” అని ఒట్టేయించుకుంటుంది ఆ తల్లి.

“ఇప్పుడామె కాలేజీకి వెడుతోంది. రోడ్లపైన కార్లు తిరుగుతూ, అడ్డ తగులుతూనే ఉన్నాయి. కార్లను ఎగాదిగా చూసే ధ్యాస ఆమెకుండనే ఉండదు. ఎప్పుడైనా అలా చూడ్డం జరిగితే, ఆ చూపులో తన దారికి ఆ కారుగానీ, దానిదారికి తాను గాని అడ్డుతగిలి మోదుకోరాదన్న జాగరూకత మాత్రమే కనిపిస్తుంది” అని ముగిస్తారీ కథను జయకాంతన్. ఇదే కథ ఎంతో మంది రచయితలను ప్రభావితం చేసి ఎన్నో కథలను రాయించింది తమిళ సాహిత్యంలో..

ఈ మూడు కథల్లో కూడా తల్లుల పాత్రలు ప్రధానం. తన తప్పులేకుండా జరిగిన పనికి కృంగిపోకుండా, ధైర్యంగా ఎదగవలసిన అవసరాన్ని గూర్చి చెబుతోంది జె.కె.కథ. ధనస్వామ్య ప్రపంచపు ఎదురుదెబ్బలను తట్టుకుని, ఎదగడానికి 'ఆవెత' కథలోని తల్లి తన కూతురినివాడుకుంటే, 'చెప్పకు, చెప్పకు' కథలోని తల్లి తన్ను తానే నైతికంగా బలి చేసుకోవడమే గాక, తన కుమార్తెను కూడా ఆ ఊబిలోనికే దింపుతుంది.

“మనిషి జీవితంలో సుఖ దు:ఖాలు, చీకటి వెలుగుల లాగా ఉన్నాయి. వీటిని ప్రతి ఒక్కరూ అనుభవించడం అయితే అనుభవిస్తారు. కాని అందరూ వ్యక్తీకరించలేరు. అవి లోలోపలే అణిగి మూగవిగా ఉండిపోతాయి. వాటిని బయటకు తేగలిగిన వారే కళాశీలురు” అని శ్రీదేవీ ప్రసాద్ రాయ్ చౌదరి చెప్పేవారట! (చాగంటి సోమయాజులు, పుట. 79). అలా వెలుగు నీడల్లా దాగిన సుఖ దు:ఖాలను, కథల రూపంలో బయటకు తెచ్చిన కళాశీలురే, మదరాసుకు వచ్చినపుడు ఆయనను కలిసి వెళ్ళే చాసో, మదరాసులోనే నివసించే జె.కె. ఇద్దరూ కూడా! 'గుడిసె – దీర్ఘరోగి' (1975) అన్న చాసో కథ, 'చీకట్లోకి' (1964) అన్న జయకాంతన్ కథ, రెండూ దీనికి మంచి ఉదాహరణలు.

ఒక చిత్రకారుడు, తాను గీసిన చిత్రంలోని, దీర్ఘ రోగి ముఖంలో 'చచ్చిపోతాడేమో' అన్న భావం కనిపించడానికి, ఆ భావానికై ఎన్నెన్ని చోట్లలోనో వెదికాడట! చివరకు తన ఇంటికి భిక్షానికివచ్చిన ముసలి, ముష్టిదాని ముఖంలో ఆ భావం కనబడ్డదట! “నీడలూ, ఎండ వెలుగులూ పడి దాని మొహంలో ఎనభై ఏళ్ల జీవితపు బాధ, మరణవేదన దేదీప్యమానంగా దివ్యజ్యోతులై వెలుగుతున్నాయి. దివ్యత్వం అన్నింటా ఉన్నది. వేదనలోనూ చూశా” అంటారు చాసో.

'జుట్టెందుకు ముడివేశావు? అన్న చిత్రకారునితో, “చింపిరిగా ఏటి బావుంటాది” అంటుంది ముష్టిది. “ఆ ముఖాన్ని నా చిత్రంలోకి దిగుమతి చేసుకున్నాను. దాని 'ముచ్చట ముడి'ని వినియోగించుకోలేకపోయాను. 'ముచ్చటముడి' అంటే, మనిషిలో అంతర్గతమై ఉన్న సౌందర్య పిపాస అంటారు చాసో.

'చీకట్లోకి' అన్న జయకాంతన్ కథ కూడా అతడిలోని కళాకారుని వెలికి తెచ్చే కథే. పట్టు, రుక్కు అన్న చిన్న నాటి స్నేహితురాండ్రు, ఒక రోజు పట్నంలో కలుసుకుంటారు. తండ్రి మరణించిన తరువాత పట్టు, తనను సినిమాలలో చేర్పిస్తానన్న వ్యక్తిని నమ్మి, మోసగింపబడి, వ్యభిచార వృత్తితో జీవితాన్ని గడుపుతుంటుంది. అయినవారందరినీ పోగొట్టుకున్న రుక్కు, పట్నంలో చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటూ తన బ్రతుకు తాను బ్రతుకుతుంటుంది.



జయకాంతన్

“పేదరికం చుట్టుముట్టినపుడు, మనసు వదులుకోక, పగ్గాలు బిగపట్టడం వల్లనే మనిషికి శ్రేయస్సు, సమ్మెట దెబ్బలవలన ఇనుము గట్టిపడ్డట్టుగానే, పేదరికం వల్ల మనసు గట్టిపడాలి. ఏవో కష్టాలొచ్చేశాయని, నీతిమాలిన పనులకు పాల్పడుతూ, బ్రతుకును పాడు చేసుకున్నందువల్ల, కష్టాలు సమసిపోవు. అలా దిగజారడం, చేతకానితనం కిందే లెక్క” అని నమ్మిన రుక్కు 'చిత్రశిల్పకళాశాల'లో మోడల్‌గా కుదురుకుంటుంది. “అనిత్యమూ, అసత్యమూ అయిన అందంలోంచి ఒక నిరంతరానంద దాయకమైన శిల్పాన్ని రూపొందించడం కోసం కళాకారుడు అందాన్ని ఆధారం చేసుకుంటున్నాడు. అని నమ్మిన రుక్కు, తన మాటను కాదని వెళ్ళిపోయిన పట్టును తలచుకుని, 'నువ్వుండేది చీకట్లో, నేనుండడం వెలుగులో' అని అనుకుంటుంది.

పేదరికాన్ని, దీర్ఘరోగంగా గుర్తించిన చాసో, సుఖదు:ఖాలను, వెలుగు చీకట్లు అనే నమ్మారు. జె.కె. కూడా జీవితంలో దిగజారడం కన్నా, ఉన్నతమైన కళాసృష్టికి దోహదపడటాన్ని చీకటి వెలుగులతో పోల్చారు. పేదరికం అనే దీర్ఘరోగాన్ని వెలుగు మార్గంలో జయించిన మహిళ రుక్కు.

“ఎందుకు పారేస్తాను నాన్నా?” వంటి అద్భుతమైన చాసో కథలాంటి కథను, జయకాంతన్ వ్రాసాడేమో అని వెదకవలసి ఉంది. అంగవైకల్యం, దీర్ఘరోగాలు వంటివి ఆర్థిక అంశాల నేపథ్యంలో మనుష్యులను ఎలాబాధిస్తాయోచెప్పే జె.కె. కథ 'నేనున్నాను' అన్న కథ! పోలియో వ్యాధిగ్రస్తుడైన ఒక యువకుడు, తన కోసం తన తల్లి పడుతున్న ఆరాటాన్ని చూడలేక, రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు. అతడిని ఒక కుష్టువ్యాధిగ్రస్తుడైన బిచ్చగాడు రక్షించి, అతడికి జీవితం మీద మమకారాన్ని కలిగిస్తాడు. ఈ కథలోని, కుష్టు భిక్షగాడు, జీవితాన్ని కాచివడబోసిన వాడైతే, చాసో కథ, 'పరబ్రహ్మము' (1948)లో పిచ్చివాడు మౌనమూర్తి. ఇద్దరూ ఆకలి బాధను, జీవితపు విలువలను ఎరిగినవారు.

“ప్రతి మనిషీ ఒక సెపరేట్ యూనిట్లా ఉంటారు. ఎవరి ఆంతర్యం వారికి ఉంటుంది. దానిలోకి ఇతరులు, ఎవరైనా కావొచ్చు, చొరబడకూడదు” అంటూ తమ అన్యోన్య దాంపత్యంలో ఒక చిన్న నెరసులాంటి విషయాన్ని, తరచి చూడకూడదన్న చైతన్యం కలిగిన రమాదేవి (ఎవరి ఆంతర్యం వాళ్ళది – 1967), జయకాంతన్ కథలోని పాత్ర.

తనను అర్థం చేసుకోక, మానసికంగా హింసిస్తున్న, భార్యను గురించి, తన స్నేహితురాలు గిరిజ దగ్గర వాపోయిన నందగోపాల్‌కు గిరిజ చెప్పిన మాటలు గుర్తుపెట్టుకోదగినవి. కొత్తచెప్పులు కరుస్తాయి' (1971) అన్న జె.కె. కథలో, “ఆమె చిన్న పిల్ల. మీరు ఆమెకు అలవాటయ్యేదాకా ఓపిక పట్టక తప్పదు. కొత్త చెప్పులు కరుస్తాయని పాత చెప్పుల్ని కొనుక్కోం గదా!” అని సున్నితంగా చెప్పిన గిరిజ రెండు చేతులు పట్టుకుని వల వలా ఏడ్చేశాడట, నందగోపాల్. ఇలా చాసో, జె.కె. ఇద్దరి కథల్లోనూ, మహిళలు స్వయం నిర్ణయాలను తీసుకుగలిగిన స్థైర్యవంతులుగానే కనిపిస్తారు.

కుంకుడాకు (1943) లో గవిరి, ఎంపు (1945) లో ఎర్రి కూడా అట్టడుగు వర్గానికి చెందినవారు. ధనస్వామ్య వ్యవస్థా బాధితులే! పసిపిల్ల అయినా, పొయ్యిలోకి కావలసిన, ఎండిన కుంకుడాకును ఏరుకు రావడమే జీవితధ్యేయంగా కలిగినది, ఎనిమిదేళ్ళ గవిరి. కుష్టు వ్యాధిగ్రస్తుడైన తండ్రికింత గంజి కాచి పొయ్యడమే జీవితధ్యేయంగా కలిగినది భిక్షగత్తె అయిన ఎర్రి. తాను కుంటి భిక్షగాడిని ప్రేమించినా, అతనికన్న, గుడ్డి భిక్షగాడికి, ఎక్కువ డబ్బులు దొరుకుతాయని, గుడ్డివాడినే పెళ్లాడమని, బోధించిన తండ్రిమాటకు, ఒప్పుకుంటుంది. బాల్యాన్ని, యౌవనాన్ని మాత్రమే కాదు, పేదరికం పై, ఆఖరికి, భిక్షగాళ్ల జీవితాలపై కూడా, ఆర్థిక అంశాలు, పితృస్వామ్యం ఎలా ఆధిపత్యం చలాయిస్తున్నాయో అనేందుకు ఈ కథలు గొప్ప ఉదాహరణలు!

మంచి సాహిత్యానికి ప్రయోజనం జీవితాన్ని విశ్లేషించడం. చాసో, జెకే ఇద్దరూ తాము జీవిస్తున్న యుగ స్వభావాన్ని గుర్తించినవారు. ఆ స్వభావాన్ని కళాత్మకంగా మలిచినవారు. సమాజంలో మహిళా శక్తిని, మహిళా జీవనాన్ని సరిగ్గా అంచనావేసిన వారు. పితృస్వామ్య వ్యవస్థలో, ధనికస్వామ్య వ్యవస్థలో మహిళలు పడిన, పడుతున్న అవస్థలతో బాటు, ఆ అవస్థలనెదుర్కొని పోరాటం చేయగలిగిన మహిళల శక్తియుక్తులకు చక్కటి రూపకల్పన చేసినవారు. కాలంతోబాటు వ్యవస్థా, వ్యవస్థలోని మనుష్యులూ మారవలసిన అవసరముందని నమ్మినవారు. వ్యవస్థాలోపాలపై పోరాటం చేయడానికి, ఈ ఇద్దరి పాత్రలు ఎన్నుకున్న మార్గాలు మాత్రం ఆయా కాలాలకు అనుగుణమైనవని మనం గమనించాలి. వీరిరిరువురి కథలను కూడా, చదవగానే, మొదట్లో అంతులేని అలజడికి గురవుతాం. నిదానంగా తేరుకుని, కాలప్రభావానికి, సమాజాన్ని కుదిపేస్తున్న ఆర్థిక అసమానతలకు ఆశ్చర్యపోతాం. ప్రతికథా చిరకాలం మనసులో ఒక మారుమూల స్థిరంగా కూర్చుని, మనలను కదిలిస్తూనే ఉంటుంది.

తమ కాలపు చరిత్రను పునర్నిర్మించేందుకు దోహదపడే జీవన తాత్వికతలో తమ కథలను వ్రాసిన చాసో, జెకే ల కథలు, ఎన్ని సార్లు చదివినా, ప్రతిసారి ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తూనే ఉంటుందన్నదన్నది మాత్రం అక్షరసత్యం.



పల్లె! - సంక్రాంతి!!

పల్లె పచ్చదనంతో వెల్లివిరియడం ఒకప్పటి సంక్రాంతి జ్ఞాపకం.
ఆరుగాలం శ్రమించిన సేద్యానికి
గరిశెలకొద్దీ పసిడిరాసుల్ని గాదెల్ని నింపుకోవడం
రైతన్నల తపఃఫలం! అది వరఫలం!

×××

కాలంవెంబడితుఫాన్లు, కరవులు,నకిలీమందులు–అప్పుల ఊబులు
పెట్టుబడి కిట్టుబాటు ధరల్లోంచి దళారీల దోపిళ్ళమయాన
లాభనష్టాల బేరీజుల్నించి
ఆకళ్ళ నకళ్ళు కానీయని సంభ్రమాల్నించి తేరుకోవడం
ఒకింత ఆనందం మిగిలిస్తేనే “కర్షకాళి” నిజజీవన క్రాంతి.

×××

ఖగోళ విజ్ఞానం నుంచి సాగే సూర్యగమనం
ఏర్పడే ఉత్తర దక్షిణ అయనాలు –
మకర కర్కాటక సంక్రమణాలు ప్రాధాన్య పర్వాలవుతుంటాయి.
వైకుంఠపాళీలు వసుధ సూర్యరథాల్ని తలపిస్తుంటాయి.
దూడు బసవన్నల దీవెనలు – సన్నాయి సరిగమలు
గుమ్మడిచెంబు తలకెత్తుకున్న హరిగుణగానాలు.
పెద్దకోటును తొడుక్కున్న
పెనులింగ మూర్తుల్లా జంగమదేవరలు
జనపదం లోంచి జ్ఞానపథానికి
మార్గదర్శనాలౌతుంటాయి.

×××

భోగిమంటల నెగళ్ళు
భోజ్యవంటలు, సరికొత్త బియ్యం పొంగళ్ళు
వంశపెద్దల్ని తలచి తరింపచేస్తున్న దానధర్మాలు.
గోసంపదల్ని, పాడిపంటల్ని రక్షించే గోమాత ఆరాధనలు
బొమ్మదేముళ్ళందర్నీ కొలువుదీరించడాలు
అన్నీ సరదాలు భోగిపళ్ళ పేరంటాలు మురిపాలు
తిరిగిరాని బాల్యానికి – రేపటి తరానికి
సంబరాల్ని నిర్దేశించడంఇప్పుడు ప్రశ్నార్థకమౌతోంది!?

×××

మనీ సంబంధాలతో మానవ సంబంధాలన్నీ
ఎపార్ట్‌మెంట్ మనుగడల వంటరి కొమ్మలవుతున్నప్పుడు,
భోగి పిడకలతో సహా అన్నీ వ్యాపారమయమైన నేపథ్యం!
నెలగంట పట్టిన లోగిళ్ళు – రంగవల్లుల జాళ్ళు
మురిపాల సంక్రాంతిని ముగ్ధ(ద్ధ)బంతుల్లా
కనువిందు చేస్తే అదే
సంక్రాంతి విరిపంట సంతృప్తులింటింట
పుష్యమాసపు సిరులు మెండుగా కురియాలి.
ఈ సంక్రాంతి తెలుగులకు నిజమైన వెలుగులివ్వాలి.

- వి.యస్.ఆర్.యస్. సోమయాజులు
✆:9441148158

11వ జాతీయస్థాయి 'సోమేపల్లి' చిన్నకథల పోటీ విజేతలు

'రమ్యభారతి' ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన తెలుగు చిన్నకథల పోటీలలో 11వ జాతీయస్థాయి 'సోమేపల్లి సాహితీ పురస్కారాల'కోసం దేశం నలుమూలల నుండి గతంలో కంటే అత్యధికంగా 157 కథలు పరిశీలనార్థం వచ్చాయి. వాటిలో అనకాపల్లికి చెందిన కోయిలాడ రామ్మోహనరావు రాసిన 'సార్థకత' కథకు ప్రథమ పురస్కారం లభించింది.

అలాగే బండి ఉష (ఖమ్మం) రాసిన 'పండగొచ్చింది' కథకు ద్వితీయ, వెంకటమణి ఈశ్వర్ (విశాఖపట్నం) రాసిన 'దేవుడి మార్కులు'కు తృతీయ పురస్కారాలు లభించాయి. మొలుగు రవికృష్ణకుమారి (విజయవాడ) రాసిన 'విజయదశమి', మాధవరపు కృష్ణ (కాకినాడ) రాసిన 'పుట్టినరోజు', నుసర్ల మాధవి (నరసారావుపేట) రాసిన 'ఆత్మహత్యకు కోచింగ్ సెంటర్', వలివేటి నాగచంద్రావతి (విజయవాడ) రాసిన 'ఆకలి', బెహరా వెంకట సుబ్బారావు (రాజమండ్రి) రాసిన 'లక్ష్యం' కథలకు ప్రోత్సాహక పురస్కారాలు లభించాయి. విజేతలకు వరుసగా 2,500, 1,500, 1,000, ప్రోత్సాహకం 500రూపాయల నగదుతో పాటు జ్ఞాపిక, శాలువతో త్వరలో జరిగే ప్రత్యేక సభలో సత్కరించడం జరుగుతుంది. ఈ పోటీలకు ప్రఖ్యాత రచయిత విహారి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ పోటీలు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా రమ్యభారతి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నది.

–సోమేపల్లి వెంకటసుబ్బయ్య, అవార్డు కమిటీచైర్మన్,
చలపాక ప్రకాష్, ఎడిటర్, రమ్యభారతి

పుస్తకావిష్కరణ సభకు ఆహ్వానం

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమేపల్లి వెంకటసుబ్బయ్య నానీల సంపుటి 'చేను చెక్కిన శిల్పాలు', ఎస్.ఎం. సుభానీ నానీల సంపుటి 'సామాజిక నానీలు' ఆవిష్కరణసభ 20.1.2019 ఆదివారం ఉదయం గం.10.30ని॥లకు జిల్లా పరిషత్ మీటింగ్‌హాల్, గుంటూరులో జరుగుతుంది. ఈ సభకు ప్రఖ్యాత రచయిత్రి డా॥ సి.భవానీదేవి సభాధ్యక్షులుగా, ముఖ్యఅతిథి, ఆవిష్కర్తగా ఆచార్య ఎన్. గోపి (పూర్వ కులపతి, తెలుగు విశ్వవిద్యాలయం) పాల్గొంటారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి కె.జె. రమేష్ 'చేను చెక్కిన శిల్పాలు' గ్రంథాన్ని, ప్రముఖ కవి, సమీక్షకులు పి. లక్ష్మణ్‌రావు 'సామాజిక నానీలు' గ్రంథాన్ని సమీక్షిస్తారు. ఈ కార్యక్రమానికి సాహితీ ప్రియులు, సాహితీవేత్తలందరూ రావాల్సిందిగా కోరుతున్నారు.

-బి.హనుమారెడ్డి, గౌరవాధ్యక్షులు,
బొమ్ము ఉమా మహేశ్వరరెడ్డి, కోశాధికారి,
చలపాక ప్రకాష్, ప్రధానకార్యదర్శి.

విశాలాంధ్ర
బతుకు
The Life
సోమవారం
14 జనవరి 2019

పండగ కళ!



పండగ వచ్చిందంటే పెళ్ళీడు పిల్లల హడావుడి మొదలవుతుంది. మిగతా అన్ని రోజుల్లో బిజీబిజీగా తిరిగేసే అమ్మాయిలు పండగనాడు తీరిగ్గా తయారయ్యేందుకు ప్రాధాన్యతనిస్తారు. సంప్రదాయ లంగాఓణీలతో ఇంటికి పండగ కళ తీసుకొస్తారు. లంగా ఓణీ లేటెస్ట్ ట్రెండ్‌లో ఒకటి. ఇందులోనూ ఎన్నో డిజైన్లు వస్తున్నాయి. ఎన్ని రకాలు వచ్చిన పట్టుకున్న హుందాతనమే వేరు. పండగకి పట్టు లంగా ఓణీదే హవా. అలాంటి పట్టు లంగా ఓణీల్లో మెరిసిపోతున్న ఈ జవ్వనులు భలే బాగున్నారుగా!









చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టపడే పండగే సంక్రాంతి.

సంక్రాంతి.... గాలిపటం


దేశమంతటా జరుపుకునే పండగల్లో ముఖ్యమైనదిగా చెప్పకోవచ్చు. అన్ని రాష్ట్రాల సంగతి అటుంచితే తెలుగు వారికి మాత్రం ఎంతో ప్రత్యేకమైన పండుగ సంక్రాంతి. ఈ పండుగ వారి లోగిళ్ళలో సందడిని నింపుతుందనడం అతిశయోక్తి కాదేమో..! తెలుగు వారింట ధనుర్మాసం మొదలైన నాటి నుంచి ఈ పండగ వాతావరణం నెలకొంటుంది. సంక్రాంతి పండుగ సమయంలో గాలిపటానికి విశిష్టమైన స్థానం ఉందనే చెప్పకోవాలి. చిన్న వారి నుంచి పెద్ద వారి వరకు అందరూ ఎగరేస్తుంటారు. చిన్న పిల్లలకు మాత్రం ఈ గాలిపటమంటే అమితమైన ఇష్టం. అసలు సంక్రాంతి పండుగ వాతావరణాన్ని ప్రదర్శించే వాటిలో గాలిపటమే మొదటిది. ఇలాంటి గాలిపటం కావాలని పిల్లలు పదేపదే మారాం చేస్తుంటారు. ఒకటి కొని ఇచ్చినా దానితో ఎక్కువసేపు ఆడుకోరు మరొకటి కావాలంటారు. వీటిని కొనుక్కోవడం కన్నా తయారు చేసుకుంటే డబ్బులు ఆదాతో పాటు ఆనందం. మరి ఈ గాలిపటాన్ని ఎలా తయారు చేయాలో తెలుసుకుందామా...!


గాలిపటం తయారు చేసే విధానం

కావలసిన వస్తువులు

- మీకు నచ్చిన రంగు పేపర్స్ 8.5×11 అంగుళాల్లో ఉండేలా చూసుకోవాలి, మైదా లేదా గ్లూ, దారం, కొబ్బరి ఈనెలు, కత్తెర, స్కేల్‌ను తీసుకోండి.
- పేపర్‌పై పక్కన చూపిన విధంగా డ్రా చేయండి.
- స్టెప్-1 పైన చూపిన విధానంగా కత్తిరించవలెను
- స్టెప్-2 చిత్రంలో చూపిన విధంగా పెన్సిల్‌తో పేపర్‌పై రఫ్ స్కెచ్ గీయాలి.
- స్టెప్-3 పటంలో చూపిన విధంగా కొబ్బరి ఈనెలను అమర్చండి
- స్టెప్-4 పేపర్‌ను ఐదు చిన్న చిన్న చతురస్రాకార ముక్కలుగా కత్తిరించండి.
- స్టెప్-5 చివర భాగం తయారు చేయడానికి పేపర్‌ను పొడవు ఎక్కువగా, వెడల్పు తక్కువగా పటంలో చూపిన విధంగా కత్తిరించండి. ఇది కనీసం ఒకటిన్నర మీటరు ఉండాలి.
- స్టెప్-6 ఇది గాలి పటం తయారీలోనే ముఖ్యమైన ఘట్టం. దారం కట్టడం. దీన్ని పేపరు మధ్య భాగంలో ఉన్న ఈనె పుల్ల వద్ద కట్టండి.
- ఇక మీ గాలిపటం గాలిలో ఎగరడానికి సిద్ధంగా ఉంది. ఇక ఈ గాలిపటాన్ని మీ పిల్లలకిచ్చి పండగ సమయంలో వారి ఆనందాన్ని చూడండి.

-ముప్పిడి రాంబాబు







పాలతో ఫేషియల్

సాధారణంగా ఫేషియల్స్ మీ ముఖానికి నిగారింపును ఇస్తాయి. కానీ ఈ బిజీబిజీ జీవితంలో పార్లర్‌కు వెళ్ళి గంటల తరబడి వేచి ఫేషియల్స్ చేయించుకోవడమనేది అందరికి సాధ్యం కావడంలేదు. దీంతో ముఖంపై నల్లని మచ్చలు, ముడతలు, బ్లాక్ హెడ్స్ వంటివి అధికమవుతున్నాయి. వీటివల్ల మీ అందమే కాదు మీ ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. ఇలాంటి పరిస్థితుల్లో మీరు బయటికి వెళ్ళాలన్నా చాలా ఇబ్బందిపడతారు. మరి ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే ఇంటి వద్దనైనా కొంచెం కేర్ తీసుకోక తప్పదు. నిజానికి పార్లర్‌లో చేయించుకునే ఫేషియల్స్ వల్ల ఒక్కొక్కసారి సైడ్‌ఎఫెక్ట్స్ వచ్చే అవకాశాలున్నాయి. ఇంటి వద్ద సహజ పదార్థాలతో ప్రయత్నించే వాటితో మేలు కలుగుతుంది. అంతేకాక ఫర్‌ఫెక్ట్ లుక్ వస్తుంది.

పాలను నిత్యం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు అందరికి తెలుసు. కానీ పాలతో అందానికి మెరుగు పెట్టవచ్చునని చాలా కొద్ది మందికి మాత్రమే తెలుసు. విటమిన్స్, ప్రోటీన్స్ ఎక్కువగా ఉన్న పాలు చర్మపు ఆరోగ్యాన్ని కాపాడమేగాక మీ స్కిన్‌ను కాంతివంతంగా మారుస్తుంది. పాలలోని లాక్టిక్ యాసిడ్ చర్మం పైన మృత కణాలను తొలగిస్తుంది. దీంతో చర్మం మరింత నిగారింపుని సంతరించుకుంటుంది.

పచ్చిపాలతో ఫేషియల్ తయారు చేసుకునే విధానం

ఒక టేబుల్ స్పూన్ పచ్చిపాలు, ఒక టేబుల్ స్పూన్ నిమ్మ రసాన్ని తీసుకోని ముఖంపై బాగా మసాజ్ చేసి పావుగంట పాటు వదిలేయండి. తరువాత కడిగేయండి. తర్వాత రెండు టేబుల్ స్పూన్స్ పాలు, ఒక టేబుల్ స్పూన్ ఎర్ర కందిపప్పు పొడిని కలిపి ముఖంపై బాగా స్క్రబ్ చేయండి. దీంతో ముఖంపై ఉన్న జిడ్డు తొలగుతుంది. ఈ మిశ్రమాన్ని మెడ భాగంలో కూడా పట్టించవచ్చు. ఐదు నిముషాల తర్వాత ఈ మిశ్రమాన్ని చల్లని నీటి సాయంతో తొలగించండి. తర్వాత ఒక టేబుల్ స్పూన్ పచ్చిపాలలో కొంచెం పసుపు వేసి ముఖంపై ప్యాక్‌లా వేసి పది నిముషాల తర్వాత కడిగేయండి. ఇలా చేయడం వల్ల సహజ సౌందర్యం మీ సొంతమవుతుంది. మీ స్కిన్ టోన్ కోసం ఒక టేబుల్ స్పూన్ పచ్చిపాలు, పచ్చి పచ్చి తేనెను కలిపి పేస్ట్‌లా తయారు చేసుకోండి. ఈ పేస్ట్‌ను ముఖంపై మసాజ్ చేయండి. దీని వల్ల చర్మం సాఫ్ట్‌గా అందంగా ఉంటుంది. ఈ విధంగా వారానికొకసారి చేస్తే చాలు మీ అందం రెట్టింపవుతుంది.





పొంగళ్ళ రంగోలి

సంక్రాంతి పండుగను చాలా మంది పొంగల్‌గా పిలుచుకుంటారు. ఈ పండుగ సమయంలో ఆడపిల్లలు పొంగళ్ళను తయారు చేయడంతో పాటుగా వాటితో ముగ్గులు కూడా వేస్తున్నారు. సంక్రాంతి సమయంలో ముగ్గుల విశిష్టత అంతా ఇంతా కాదు. ఒకరిని మించిన రంగవల్లి మరొకరు తీర్చిదిద్దాలనుకుంటారు. అలాంటీ వైరైటీ ముగ్గుల్లో ఇవి కూడా కొన్ని..!









నేను - సుడిగుండం

(నవల) 15

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575

నిన్నటి సంచిక తరువాయి

"నా జీవితంలో మరిచిపోలేని అనుభవం అయింది. ఇప్పటిదాకా నా మనసులో కష్టాలన్నీ నాకూ, మా అమ్మకే అనుకున్నాను. మాకంటే పేదరికం అనుభవిస్తున్న వారిని చూసాను. అయితే నాగరికతకు దూరం అయిన వారిని దగ్గరగా చూసాను. వారితో మాట్లాడాను. రేపటి కోసం దాచుకోవాలని వారికి లేదు. తమ బతుకులు తాము బతుకుతారు. ఇతరుల్ని దోచుకోవాలనుకోరు. ఇప్పుడిప్పుడే వారిలో కొంతమందిలో స్వార్థం పెరుగుతోంది. అవన్నీ నాగరికులమనుకుంటున్న మనుషుల నుండి నేర్చుకుంటుందే."

చిన్నగా నవ్వింది.

"ఇప్పటికీ అక్కడ దోపిడి వుంది. వారిని మోసం చేయటం వుంది. అక్కడ వ్యాపారాలు చేసేవారికి నక్సలైట్లంటే భయం వుంది"

"ఇంకా..."

"ఇంతకు ముందు సౌందర్యం గురించి నాకు తెలియదు. ఆ అడవుల్ని, ఆ వాతావరణాన్ని, ఆ గాలిని చూసి మైమరిచిపోయాను. ప్రకృతిని మనం ఎంత మిస్ అవుతున్నామో అనుకున్నాను"

"అంతేనా.... అక్కడే వుండిపోవాలని పించిందా!"

"అలానే అనుకున్నాను. అంతలోనే బాధ్యతలు గుర్తొచ్చాయి. మనం అనుకున్నవి చేయలేం. అయితే నిరంజన్ కొంతమంది వ్యక్తుల గురించి చెప్పాడు. వారు కొన్ని బంధాలను వదిలించుకున్నారు. తాము అనుకున్న ఆశయాల్ని సాధించటానికి అంకితం అయ్యారు. వాళ్ళ ఈరోజున లేరు. వారి మార్గం సరయిందో, కాదో నాకు తెలియదు. కానీ వారి త్యాగానికి మాత్రం జోహార్లు" అన్నాను.

అమిత కూడా కొంతసేపు ఆలోచనల్లో వుండిపోయింది. అలా ఆ సమావేశం ముగిసింది.

****

నిరంజన్ ఆ తర్వాత కూడా నన్ను రకరకాల సమావేశాలకు తీసుకువెళ్లాడు. ఓ దశలో నేను చదువుకి మరీ దూరంగా వెళ్తున్నానా అనిపించింది. నేను సెలవుల్లో కూడా ఇంటికి వెళ్లటం కుదరలేదు. మధ్యలో జయదేవ్‌గారిని, అమితని, లలితను కలుసుకుంటున్నాం. మాట్లాడుకుంటున్నాం..



"నీలో మార్పు వస్తోంది రామూ" అని లలిత అంది.

"ఎలాంటి మార్పు?" అన్నాను.

"అది నేను ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. నిన్ను నువ్వు పరిశీలించుకో" అంది.

రెండో సంవత్సరం పరీక్షలు అయ్యాక ఇంటికి వెళ్లాను. అప్పుడు మావయ్యకి కష్టాలు మొదలయ్యాయని అర్థం అయింది.

మొదటి సంవత్సరం అనావృష్టి వల్ల ఖర్చులు మాత్రం వచ్చాయి. రెండో సంవత్సరం అతివృష్టి వల్ల పంట పూర్తిగా పోయింది. అప్పుడు ఆలోచించాను. అయిందేదో అయింది. ఇంక చదువు మానేస్తాను. మావయ్యకి ఇంకా భారం కాకూడదు. ఏదొక పని చేయాలి.

"ఈ సంవత్సరం పంట చేతికి రానంత మాత్రాన ఎప్పుడూ అలానే వుంటుందా. అలా అనుకుంటే ఏ పనీ చేయలేం. రైతన్నాక అప్పో సప్పో చేస్తాడు. భూమిని నమ్ముకున్న వారెవరూ చెడిపోరు. నువ్వు మొదలు పెట్టిన పనిని మధ్యలో ఆపొద్దు. అది కూడా వ్యవసాయం లాంటిదే. నా కారణం వల్ల నీ చదువు ఆగిపోతే నేను తట్టుకోలేను అల్లుడూ" అన్నాడు బాధగా

"నేను ముందు నుంచి చెబుతున్నాను. అన్నయ్య వినలేదు" అంది అమ్మ.

మా మేనమావలు మా గురించి ఏమాత్రం పట్టించుకోక పోయినా బంధువుల దగ్గర వ్యంగ్యంగా మాట్లాడుతూనే వున్నారంట.

"తనకు మాలిన ధర్మం అంటే ఇదే. ఆడు కూలి పనులు చేసుకుంటాడో, పద్దులు రాసుకుంటాడో నరసయ్యకి ఎందుకు? ఆ పనులు చేసేవారు మనుషులు కాదా? ఆడ్ని కలెక్టర్ని చేయాలనుకుంటున్నాడేమో. చివరకి నరసయ్య కూతుర్ని కూడా చేసుకోడు. చివరికి అంతా మునిగాక, కూతుర్ల పెళ్లిళ్ల చేయాలి. సాయం చేయండని మీదగ్గరికో మా దగ్గరికో రావాల్సిందే"

ఈ మాటలు నాకే బాధనిపించాయి.

అప్పటికప్పుడు వాళ్ల దగ్గరకు వెళ్లి దులిపేసి రావాలనుకున్నాను. అదేదో ఇంతకుముందు చేయాల్సింది. సమాజం గురించి తెలుసుకుంటున్నాక, చదువుకుంటూ ఇలాంటి ఆవేశాలకు లోనవకూడదు అని నిగ్రహించుకున్నాను.

ప్రతి కుక్కకి కూడా ఏదొక రోజు అవకాశం వస్తుందంటారు. నరసయ్య మావయ్య లోలోపల ఎంత గాయపడ్డా బయటకు తేలలేదు. ఏదొక రోజున వారికి సమాధానం చెప్పాలి అనుకుని వుండొచ్చు లేదా అలాంటి వారి మాటల్ని పట్టించుకుంటే తన వ్యక్తిత్వానికి అవమానం అనుకొని వుంటాడు.

నేను మళ్లీ విశాఖ వచ్చాను.

****



చివరి సంవత్సరం పరీక్షలు రాసాను.

ఇంటికి బయలుదేరేముందు జయదేవ్‌గారిని కలుసుకున్నాను.

"బహుశా నేను యూనివర్సిటీకి రాకపోవచ్చు. నా చదువు ఇంతటితో ముగిసిపోయింది. ఇంటికి వెళ్లాక నేను ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటాను మాస్టారూ" అన్నాను.

"నాలాంటి వారే ఔట్ సైడర్స్ గా వున్నారు. నాకు అంగీకారం లేకుండా ఏ సంస్థలో పని చేయలేను. అంతకంటే నాకు కొన్ని బాధ్యతలున్నాయి. నువ్వు కలిసినపుడు నీ ఆర్థిక పరిస్థితి గురించి అందుకే అడిగాను రామూ. నీకు బాధ్యతలున్నాయని నాకు తెలుసు. అలాంటివి పూర్తి చేయకుండా అడవులకు వెళ్లిన వారున్నారు. ఆశ్రమాలకి, హిమాలయాలకు వెళ్లిన వారున్నారు. ఎవరు ఎక్కడికి వెళ్లినా అసంతృప్తి. పరిస్థితులు అలా వున్నాయి. ముందు ముందు అగ్రరాజ్యాలు మనల్ని కబళించే ప్రయత్నాల్ని తీవ్రం చేస్తాయి. అందుకే జాగ్రత్తగా నిర్ణయం తీసుకో. కుటుంబాన్ని, ఆశయాల్ని సమన్వయం చేసుకోవటం అవసరం. ఏం చేసినా సమాజానికి ఉపయోగపడు" అన్నారాయన.

"నువ్వు పీ.జీ. ఇక్కడ చేయాలని నాకుంది. నువ్వు ఫీజుల గురించి ఆలోచించకు. నీలాంటి బలమైన కార్యకర్తలు మనకు కావాలి. చదువూ, పోరాటం అనేది మన నినాదం కావాలి. అందుకు తగ్గ అన్నీ ఏర్పాట్లూ నేను చూసుకుంటాను" అన్నాడు నిరంజన్,

"తప్పకుండా ఆలోచిస్తాను" అన్నాను.

అందరి చిరునామాలు తీసుకున్నాను. మళ్లీ ఎవరు ఎప్పుడు కలుస్తారో తెలియదు. అప్పుడప్పుడు ఉత్తరాలు రాసుకుందాం అనుకున్నాం. లలిత, అమితలకు వీడ్కోలు చెప్పాను. ఫలితాలు వచ్చాక సర్టిఫికెట్లు తీసుకుంటానికి వచ్చినప్పుడు కలుస్తాను అన్నాను.

"అంటే నువ్వు ఇంక చదవననే అభిప్రాయానికి వచ్చావు, అవునా" అంది. అమిత.

"చదవనని చెప్పను. యూనివర్సిటీలో చదవను"

"అదే నాకు బాధగా వుంది. తెలివిగల వారికి అవకాశాలు వుండవు. అయినా ఆలోచిద్దాం" అంది. తనేం ఆలోచిస్తుందో నాకు తెలియదు.

****

ఇంటికి వచ్చాను..

అమ్మ కళ్లల్లో నాకు రిలీఫ్ కనిపించింది.

వెన్నెల - అర్చన వేసుకున్న బట్టల్ని గమనించాను. వారి ముఖాల్ని చూస్తుంటే అర్థం అయింది.

మావయ్య వారి బట్టలు నాకు యిచ్చాడు. వారి తిండి నాకు పెట్టాడు. దేవుడి గురించి నాకు ఇంకా నిశ్చితమైన అభిప్రాయం లేదు. మావయ్య మాకు దేవుడు.

నేను ఉద్యోగ ప్రయత్నాలు మొదలు పెట్టాను. అవంత త్వరగా వస్తాయా!

****

డిగ్రీ ఫలితాలు వచ్చాయి. నన్ను పీ.జీ చేయమన్నాడు మావయ్య

"చాలు మావయ్యా. దేనికయినా హద్దు వుంటుంది. నీ ప్రేమతో ఇంకా మమ్మల్ని రుణగ్రస్థుల్ని చేయవద్దు" అన్నాను.

"అంత మాట అన్నావేంటి అల్లుడూ" అన్నాడు బాధగా

"మూడు సంవత్సరాలుగా పంటలు దెబ్బ తిన్నాయి. అత్తయ్య మెడలో గొలుసూ, గాజులూ, ఇంట్లో వున్న బంగారం మాయం అయింది. పసుపు తాడు మెడలో కట్టుకుంది" అంటుంటే....

"నేను బంగారం తాకట్టు పెట్టాను అల్లుడూ. నా చెల్లి మెడలో గొలుసు వుందా? బుల్లమ్మాయ్ అప్పటి నుంచి ఇప్పటిదాకా చాకిరి చేయటం లేదా? అంతగా అయితే ఇల్లు తాకట్టు పెడతా... రెండు సంవత్సరాలు కళ్లు మూసుకుంటే అయిపోతుంది"

"అప్పుడు పీ. హెచ్.డి. చేయవద్దా?"

"ఆలోచిద్దాం"

"నేను సూటిగా అడుగుతున్నాను మావయ్యా... వెన్నెల, అర్చనా కడుపు నిండా తింటున్నారా?"

అప్పుడు హతాశుడయ్యాడు.

"మొదటిసారి నిన్ను కాదంటున్నాను మావయ్యా. నేను ఉద్యోగం చేస్తూ చదువుకుంటాను. ఈ చదువులకి అంతం వుండదు. ఇప్పటివరకూ నీ మాట మీద నువ్వు నిలబడ్డావు. నన్ను స్వంత కొడుకులా చూసుకున్నావు. అది చాలు. నువ్వు ఇంకా చదువు అంటే నా వల్ల కాదు"

(ఇంకా ఉంది)

ఎయిమ్స్- బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు



ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. ఎంబీబీఎస్ కోర్సుతోపాటు పలు బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(బీఎస్సీ) కోర్సులను అందిస్తున్నాయనే విషయం చాలా కొద్దిమందికే తెలుసు. ఈ విషయం తెలియక తెలుగు రాష్ట్రాల్లోని చాలామంది విద్యార్థులు ఎయిమ్స్‌లో చదివే సువర్ణావకాశాన్ని చేజార్చుకుంటు న్నారు. కాగా, తాజాగా ఎయిమ్స్ బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ పారామెడికల్, బీఎస్సీ పోస్టు బేసిక్, ఎంబీబీఎస్ కోర్సులకు ప్రాథమిక దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఔత్సాహికులకు ఉపయోగపడేలా ఎయిమ్స్- బీఎస్సీ కోర్సుల వివరాలు..

ఎయిమ్స్, ఢిల్లీ :

1. బ్యాచిలర్ ఆఫ్ ఆప్టోమెట్రీ : 19 సీట్లు.

కాలవ్యవధి : నాలుగేళ్లు

బ్యాచిలర్ ఆఫ్ ఆప్టోమెట్రీతో రోగులకు సరిపోయే కాంటాక్ట్ లెన్స్‌ను సూచించే సామర్థ్యంతోపాటు వాటి తయారీలో పాలుపంచుకునే అవకాశం లభిస్తుంది.

2. బీఎస్సీ (ఆనర్స్) మెడికల్ టెక్నాలజీ ఇన్ రేడియోగ్రఫీ : 9 సీట్లు.

కాలవ్యవధి : మూడేళ్లు

హ్యూమన్ అనాటమీ, ఫిజియాలజీ అధ్యయనంతో హ్యూమన్ బయాలజీపై ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది. ఎక్స్- రే రేడియేషన్, అల్ట్రా సౌండ్, ఎంఆర్ఐ వంటి ఇమేజింగ్ పద్ధతుల భౌతిక నియమాలపై అవగాహన ఏర్పడుతుంది. రేడియోగ్రఫీలో పూర్తిస్థాయి శిక్షణతో భవిష్యత్‌లో ఇమేజింగ్ టెక్నాలజిస్ట్, అధ్యాపకుడిగా స్థిరపడవచ్చు.

3. బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్ (నాలుగేళ్లు) :

కోర్సులో భాగంగా వివిధ రకాల సర్జికల్, మెడికల్ అంశాలపై అవగాహన పెంపొందించుకొని హాస్పిటల్‌లోని రోగులకు నర్స్‌గా అందించాల్సిన సమగ్ర సేవల గురించి బోధిస్తారు.

4. బీఎస్సీ నర్సింగ్(పోస్టు బేసిక్) (రెండేళ్లు) :

ఔట్ సైడర్ : 15 సీట్లు,

ఎయిమ్స్ డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులకు : 10 సీట్లు

నర్సింగ్ కేర్‌లో పూర్తిస్థాయి శిక్షణ ఇస్తారు, వ్యాధులు రాకుండా ముందస్తు రక్షణ చర్యలు, వ్యాధుల గురించి ప్రచారం, వ్యాధుల నుంచి ఉపశమన విధుల గురించి అవగాహన పెంపొందిస్తారు. నర్సింగ్ మేనేజ్‌మెంట్ స్కిల్స్, టీచింగ్ (ప్రాథమిక స్థాయి)లో శిక్షణ ఇస్తారు. దీంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్ క్వాలిటీస్, డెసిషన్ మేకింగ్ స్కిల్స్‌ను బోధిస్తారు.

5. బీఎస్సీ ఇన్ డెంటల్ ఆపరేటింగ్ రూమ్ అసిస్టెంట్ : 8 సీట్లు (మూడున్నరేళ్లు).

ఆయా విభాగాల్లో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ రోగులకు మెరుగైన సేవలందించడంపై ఈ కోర్సు దృష్టిసారిస్తుంది.

6. బీఎస్సీ ఇన్ డెంటల్ హైజీన్ : 4 సీట్లు.

కాలవ్యవధి : మూడున్నరేళ్లు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా ఆయా అంశాల్లో నాలెడ్జ్, సామర్థ్యాల పరంగా నిష్ణాతులైన మానవ వనరులను తీర్చిదిద్దేలా ఈ కోర్సును రూపొందించారు.

7. బీఎస్సీ ఇన్ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ : 20 సీట్లు.

కాలవ్యవధి : మూడున్నరేళ్లు.

ఇంటర్ లేదా తత్సమాన కోర్సును పూర్తిచేసిన వారితోపాటు ఇప్పటికే ఆపరేషన్ థియేటర్‌లో పనిచేస్తున్న అభ్యర్థులు సైతం ఈ కోర్సులో ప్రవేశించవచ్చు. కోర్సులో భాగంగా ఆపరేషన్ రూమ్ టెక్నిక్స్‌కు సంబంధించి ప్రాక్టికల్, థియరిటీకల్ శిక్షణ ఇస్తారు. దీంతోపాటు ఐసీయూలో వాడే వివిధ రకాల అనస్థీషియా మెషీన్లు- మానిటర్లు, పెయిన్ మేనేజ్‌మెంట్ డివైజెస్, ఇతర సర్జికల్ ఎక్విప్‌మెంట్ల ఆపరేటింగ్ గురించి నేర్పిస్తారు.

ఎయిమ్స్, భువనేశ్వర్ :

1. మెడికల్ లేబొరేటరీ టెక్నాలజీ : 10 సీట్లు

కాలవ్యవధి : మూడేళ్లు.

2. ఆపరేషన్ థియేటర్ అండ్ అనస్తీషియాలజీ : 10 సీట్లు

కాలవ్యవధి : మూడేళ్లు.

3. మెడికల్ టెక్నాలజీ అండ్ ఇమేజింగ్ థెరపీ : 10 సీట్లు

కాల వ్యవధి : మూడేళ్లు.

బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్ :

సీట్ల సంఖ్య : ఎయిమ్స్ న్యూఢిల్లీ 77, బోపాల్ 60, భువనేశ్వర్ 60, జోధ్‌పూర్ 60, పాట్నా 60, రాయ్‌పూర్ 60, రిషికేశ్ 100.

అర్హతలు : ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత. ఇంటర్‌లో ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/ మ్యాథ్స్/ బయాలజీ చదివుండాలి. బీఎస్సీ డెంటల్ ఆపరేటింగ్ రూమ్ అసిస్టెంట్, బీఎస్సీ డెంటల్ హైజీన్, బీఎస్సీ ఇన్ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ కోర్సులకు బయాలజీ చదివుండటం తప్పనిసరి. నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి మహిళా అభ్యర్థులే అర్హులు.

పరీక్ష విధానం :

బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్షను అన్ని క్యాంపస్‌లకు ఉమ్మడిగా నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్/హిందీ మాధ్యమాల్లో మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

సబ్జెక్టు	మార్కులు
ఫిజిక్స్	30
కెమిస్ట్రీ	30
బయాలజీ	30
జనరల్ నాలెడ్జ్	10
మొత్తం	100

పరీక్ష కేంద్రాలు : పాట్నా, రాయ్‌పూర్, ఢిల్లీ, తిరువనంతపురం, ముంబై, భోపాల్, భువనేశ్వర్, జోద్‌పూర్, చెన్నై, డెహ్రాడూన్, కోల్‌కతా.

బ్యాచిలర్ ఆఫ్ ఆప్టోమెట్రి/ బీఎస్సీ(ఆనర్స్) మెడికల్ టెక్నాలజీ ఇన్ రేడియోగ్రఫీ కోర్సులు...

ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్/బయాలజీల నుంచి 30 ప్రశ్నల చొప్పున అడుగుతారు. ప్రశ్నపత్రం మల్టిపుల్ ఛాయిస్ విధానంలో హిందీ లేదా ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం 90 నిమిషాలు. అభ్యర్థులు పరీక్షకు సంబంధించి మ్యాథ్స్, బయాలజీల నుంచి ఒక విభాగాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది.

పరీక్ష కేంద్రాలు : ఢిల్లీ ఎన్‌సీఆర్, భువనేశ్వర్.

బీఎస్సీ పోస్ట్ బేసిక్ :



ఈ కోర్సులో ప్రవేశాలకు సంబంధించి రెండంచెల విధానాన్ని అమలు చేస్తున్నారు. తొలిదశలో 70 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. ప్రశ్నలను ఇంగ్లిష్ మాధ్యమంలో మల్టిపుల్ ఛాయిస్ విధానంలో అడుగుతారు. ఫండమెంటల్స్ ఆఫ్ నర్సింగ్, మెడికల్ సర్జికల్ నర్సింగ్, అనాటమీ, ఫిజియాలజీ, ఫార్మకాలజీ, మిడ్‌వైఫరీ, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్ తదితర అంశాల నుంచి ప్రశ్నలుంటాయి. ప్రవేశ పరీక్షను ఢిల్లీలో మాత్రమే నిర్వహిస్తారు.

ప్రవేశ పరీక్షకు హాజరైన వారిలో నుంచి ఖాళీలకు మూడురెట్లలో అభ్యర్థులను పర్సనల్ అసెస్‌మెంట్/ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇందులో ఇంటర్మీడియెట్ లేదా తత్సమానం, పోస్ట్ నర్సింగ్ ఎగ్జామ్, స్టాఫ్ నర్స్‌గా కనబరిచిన పనితీరులకు ప్రత్యేక వెయిటేజీ ఉంటుంది. మొత్తంగా రెండు దశల్లో అభ్యర్థులు పొందిన మార్కుల ఆధారంగా తుది ప్రవేశాలను ఖరారు చేస్తారు.

కోర్సులు- ముఖ్య తేదీలు (2019) :

బీఎస్సీ- పోస్టు బేసిక్ :

ప్రవేశ పరీక్ష : జూన్ 1

ఫలితాలు : జూన్ 7

పర్సనల్ అసెస్‌మెంట్/ఇంటర్వ్యూ : జూన్ 26

తుది ఫలితాలు : జూన్ 28, 2019.

బీఎస్సీ(ఆనర్స్) పారా మెడికల్ కోర్సులు :

ప్రవేశ పరీక్ష : జూన్ 15, 2019.

ఫలితాలు వెల్లడి : జూన్ 24, 2019.

బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్ :

ప్రవేశ పరీక్ష : జూన్ 23, 2019.

ఫలితాల వెల్లడి : జూలై 3, 2019.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్ : https://www.aiimsexams.org/

ఇంటర్ నుంచి పీహెచ్‌డీ వరకు విద్యాభ్యాసానికి

ఎస్ఆర్ జిందాల్ స్కాలర్‌షిప్‌లు

కోర్సు పూర్తయ్యేవరకూ ప్రతి నెలా ఎంతో కొంత మొత్తం ఉపకార వేతనంగా వస్తే ఉన్నత విద్యాకోర్సుల్లో చేరిన విద్యార్థులకు ఎంతోవెసులుబాటు. అందుకే ఆర్థికంగా వెనుకబడిన అర్హులైన విద్యార్థులను ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించాలనే ఆశయంతో ఎస్ఆర్ జిందాల్ స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రవేశపెట్టారు. విభిన్న కేటగిరీల్లో ఏడాది పొడవునా ఇంటర్మీడియట్ నుంచి పీహెచ్‌డీ వరకు ఇవి అందుబాటులో ఉన్నాయి. వీటి వివరాలు చూద్దామా?

బెంగళూరుకు చెందిన ప్రభుత్వేతర సంస్థ ఎస్ఆర్ జిందాల్ ఫౌండేషన్. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరూ ఈ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. వివిధ కేటగిరీలుగా విభజించి స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నారు. ఒక్కో కేటగిరీకి అర్హత ఒక్కోవిధంగా ఉంది.


కేటగిరీ-ఎ : ప్రభుత్వ, ప్రభుత్వ అధీనంలోని కళాశాలలు/ సంస్థల్లో ఇంటర్మీడియట్ మొదటి, రెండు సంవత్సరాలు చదువుతున్నవారు అర్హులు. గత ఏడాది రాసిన పరీక్షల్లో అబ్బాయిలు 65%, అమ్మాయిలు 60% మార్కులు (కర్ణాటక, పశ్చిమ్ బంగకు చెందినవారు వరుసగా 75%, 70%) సాధించినవారు అర్హులు.

కేటగిరీ-బి : ఐటీఐ విద్యార్థులకు ఇస్తారు. ప్రభుత్వ కళాశాలలు/ సంస్థలు, ప్రభుత్వ అధీనంలోని కళాశాలలు/ సంస్థలతోపాటు ప్రైవేటు ఐటీఐ కళాశాలలు/ సంస్థల్లో చదివేవారూ అర్హులే. అయితే ప్రభుత్వ సంస్థలకు చెందినవారికి పాస్ మార్కులు వస్తే చాలు. ప్రైవేటు సంస్థల్లో చదివినవారైతే అబ్బాయిలు 50%, అమ్మాయిలు 40% మార్కులు సాధించి ఉండాలి.

కేటగిరీ-సి : బీకాం, బీబీఏ, బీబీఎం, బీఎఫ్ఏ, బీఎస్‌సీ- అగ్రికల్చర్, ఫైనాన్స్/ ఎకనామిక్స్ బ్యాచిలర్ డిగ్రీవారికి అందిస్తారు. ఇంటిగ్రేటెడ్ కోర్సులకు దరఖాస్తు చేసుకున్నవారైతే మూడేళ్ల స్కాలర్‌షిప్ పొందగలుగుతారు. జనరల్ కేటగిరీ అబ్బాయిలు, అమ్మాయిలు, శారీరక వైకల్యం ఉన్నవారు, వితంతువులు దరఖాస్తు చేసుకోవచ్చు. గత ఏడాది పరీక్షల్లో అబ్బాయిలు 65%, అమ్మాయిలు 60% మార్కులు సాధించివుంటే అర్హులు.

కేటగిరీ-డి : ఇంజినీరింగ్, ఎన్విరాన్‌మెంట్, మెడికల్ సైన్సెస్ విభాగాల్లో డిప్లొమా కోర్సులవారికి అందిస్తారు. గత ఏడాది రాసిన పరీక్షల్లో అబ్బాయిలు 60%, అమ్మాయిలు 55% మార్కులున్నవారు అర్హులు.

కేటగిరీ-ఇ : ఇంజినీరింగ్, మెడికల్ సైన్సెస్‌ల్లో బ్యాచిలర్స్, పీజీ వారికి అందిస్తారు. బీఆర్క్, ఆయుర్వేద, హోమియోపతి, నేచురోపతితోపాటు ఎంబీబీఎస్, బీడీఎస్ ఉన్నాయి. గత ఏడాది పరీక్షల్లో అబ్బాయిలు 70%, అమ్మాయిలు 65% సాధించి వుంటేఅర్హులు.



పీహెచ్‌డీ కోర్సులు : ఎంకాం, ఎంబీఏ, ఎంఎఫ్ఏ, ఎంఎస్‌సీ అగ్రికల్చర్, ఫైనాన్స్/ ఎకనామిక్స్‌ల్లో పీజీ కోర్సుల వారికి అందిస్తారు. దీనికి జనరల్ కేటగిరీ అబ్బాయిలు, అమ్మాయిలు, శారీరక వైక్యలం ఉన్నవారు, విధవలు దరఖాస్తు చేసుకోవచ్చు. గత ఏడాది పరీక్షల్లో అబ్బాయిలు 65%, అమ్మాయిలు 60% మార్కులు సాధించినవారు అర్హులు.

గమనించాల్సినవి

❀ కుటుంబ ఆదాయం రూ.2.50 లక్షలు, ఆపై ఉన్నవారు ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

❀ కోర్సులో భాగంగా ఒక్కసారి దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది.

❀ ఇతర స్కాలర్‌షిప్‌లు, స్టైపెండ్ పొందేవారు అనర్హులు. అలాగే నామమాత్రపు ఫీజులను వసూలు చేసే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలవారే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

❀ మూడేళ్లు, అంతకన్నా ఎక్కువ కాలవ్యవధి గల కోర్సులకు తుది సంవత్సరం చదివే విద్యార్థులు దరఖాస్తుకు అనర్హులు.

❀ ఏడాది కంటే తక్కువ వ్యవధి గల కోర్సులకు దరఖాస్తులు స్వీకరించరు.

❀ 30 ఏళ్లు దాటినవారికి స్కాలర్‌షిప్ అవకాశం ఉండదు.

వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారం లభిస్తుంది. డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి వివరాలతో నింపి సంబంధిత చిరునామాకు పంపాల్సి ఉంటుంది. దాంతోపాటు అవసరమైన పత్రాలు జత చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫీజు ఉండదు. ఇతర వివరాలకు- www.sitaramjindal-foundation.org/scholarships సందర్శించవచ్చు.

ఎవరెవరికి ఎంతెంత...

❀ ఎ కేటగిరీ వారికి నెలకు రూ. 500.

❀ బి కేటగిరీలో ఐటీఐ ప్రైవేటు సంస్థల్లో చదివేవారికి నెలకు రూ.700, ప్రభుత్వ సంస్థల్లో వారికి రూ.500.

❀ సి కేటగిరీలో జనరల్ కేటగిరీ అబ్బాయిలకు నెలకు రూ.600, అమ్మాయిలు, పీహెచ్ వారికి రూ.800, వితంతువులు, ఎక్స్ సర్వీస్‌మెన్ (అన్‌మారీడ్ వార్డ్స్)కు రూ.1000.

❀ డి కేటగిరీలో నెలకు అబ్బాయిలకు రూ.800, అమ్మాయిలకు రూ.600.

❀ ఇ కేటగిరీలో బ్యాచిలర్ డిగ్రీవారికి అబ్బాయిలకు రూ.1300, అమ్మాయిలకు రూ.1500. పీజీ వారికి నెలకు అబ్బాయిలకు రూ.1800, అమ్మాయిలకు రూ.2000.

❀ పీహెచ్‌డీ కోర్సుల్లో.. నెలకు జనరల్ అబ్బాయిలు, అమ్మాయిలకు వరుసగా రూ.800, రూ.1000. పీహెచ్ వారికి రూ.1000, వితంతువులకు రూ.1200 నెలకు చెల్లిస్తారు.

❀ హాస్టల్‌లో ఉండేవారికి అదనంగా ఐటీఐ/ జనరల్ డిగ్రీ/ పీజీ కోర్సులవారికి నెలకు రూ. 500, టెక్నికల్/ ప్రొఫెషనల్ కోర్సులైన ఇంజినీరింగ్, మెడికల్ సైన్సెస్ కోర్సుల వారికి నెలకు రూ.1000 చొప్పున చెల్లిస్తారు.

ముద్ర రుణాలతో ఎన్‌పీఏల పెరుగుదల : ఆర్‌బీఐ

ఇప్పటికే రూ.11,000 కోట్ల మొండి బకాయిలు

న్యూఢిల్లీ : చిన్న పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి ముద్ర పథకం కారణంగా బ్యాంకింగ్ రంగంలో ఎన్‌పీఏలు పెరుగుతున్నాయని భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) హెచ్చరించింది. భవిష్యత్తులో ఆ పథకం ఎన్‌పీఏలకు మూలంగా మారు తుందని పేర్కొంది. ఈ పథకం కింద ఇప్పటికే దాదాపు రూ.11,000 కోట్ల మేరకు మొండి బకాయిలు ఉన్నా యని వెల్లడించింది. ఒక్క 2017-18 సంవత్సరాల్లోనే ఈ పథకం కింద రూ.2.46 లక్షల కోట్ల మేరకు రుణాలు పంపిణీ చేశా రు. వీటిల్లో మొత్తం 40 శాతం మహిళలకు పంపిణీ చేశారు. మరో 33 శాతం సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అందజేశారు. ఈ పథకం మొత్తం 4.81 కోట్ల మంది లబ్ధి పొందారు. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభం కొనసాగుతున్న సమయంలో ఆర్‌బీఐ ముద్ర రుణాలపై కూడా హెచ్చరికలు జారీ చేసింది. 2015లో పీఎంఎంవై పథకాన్ని ప్రారం భించింది. ఈ పథకం కింద చిన్న పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు బ్యాంకులు రూ.10 లక్షల వరకు రుణాలు ఇవ్వాలి. మొత్తం మూడు విభాగాల్లో ఈ రుణాలను మంజూరు చేస్తారు.

కార్పొరేట్ పన్నులో కోత విధించండి : ఫిక్కీ

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశ పెట్టబోయే మధ్యంతర బడ్జెట్‌లో కార్పొరేట్ వర్గాలకు మేలు చేకూరేలా పన్నులు తగ్గించాలని పరిశ్రమల సంస్థ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) కోరింది. ఆర్థిక వృద్ధి, పన్ను ఆదాయం పెరగా లంటే టర్నోవర్‌తో సంబంధం లేకుండా కార్పొరేట్ పన్నును 25 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించింది. పన్ను శ్లాబులను సైతం సవరించాలని కోరింది. 'ప్రస్తు తం వ్యాపార రంగం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. వాటిలో అధిక పన్నులు ఒకటి. దీని వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతోంది. పెట్టుబడులు పెట్టడానికి, వ్యా పార విస్తరణకు అవకాశం లేకుండా పోతోంది. ప్రాథమికంగా 30 శాతం పన్ను రేటుతోపాటు డివిడెంట్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ రూపంలో మరో 20 శాతం పడుతోంది. దీంతో కంపెనీలు అత్యధిక పన్ను చెల్లించాల్సి వచ్చింది.' అని ఫిక్కీ పేర్కొంది. బడ్జెట్‌కు ప్రభుత్వానికి పంపించే అభ్యర్థనల్లో భాగంగా ఫిక్కీ ఈ మేరకు కోరింది. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో పన్ను రేట్లు తగ్గిస్తున్న నేపథ్యంలో భారత్ కూడా వాణిజ్యాన్ని ప్రోత్సహించే విధంగా అదే బాటలో పయనించాలని సూచించింది. ప్రస్తుతం కనీస ప్రత్యామ్నాయ పన్ను (మాట్) రేటు 18.5 శాతంగా ఉందని.. ఇది కూడా చాలా ఎక్కువ అని పేర్కొంది. దీనిని కూడా క్రమంగా తగ్గించాలని ఫిక్కీ ప్రభుత్వాన్ని కోరింది. పరిశోధనలకు, కార్పొరేట్ సామాజిక బాధ్యతగా వెచ్చించే మొత్తానికి మినహా యింపులను కొనసాగించాలని పేర్కొంది. దీంతో పాటు ఆదాయ పన్ను కనీస మినహాయింపు పరిధిని రూ.3 లక్షలకు పెంచాలని సూచించింది.

నియంత్రణ మంచిదేగానీ.. !

ముంబై: ప్రముఖ సామాజిక మాధ్యమాలు ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్‌లలో ఉన్న చట్టవ్యతిరేక అంశాలను తొలగించేందుకు ఐటీ శాఖ విధివిధానాలను రూపొందించింది. ఏదేని అంశాన్ని చట్టవ్యతిరేకమైనదిగా ప్రతిపాదిస్తే అది జరిగిన 24 గంటల్లోపే సోషల్ మీడియా నుంచి ఆ సమాచారాన్ని తొలగించేలా ఈ నిబంధనలు ఉంటాయి. ఈ క్రమంలో సోషల్ మీడియా నియంత్రణపై భారతప్రభుత్వ ఆంక్షలను చట్టపరంగా ఎదుర్కొనేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా వేదికలు పరిశీలించి, తమ అభ్యంతరాలను ఐటీ శాఖ ముందుంచేందుకు సిద్ధమవుతున్నాయి. సోషల్ మీడియాను ప్రభుత్వం నియంత్రించాలని చూస్తే ఊరుకునేది లేదని అంతర్జాతీయ సోషల్ మీడియా కంపెనీలు హెచ్చరిస్తున్నట్టు తెలుస్తోంది. సోషల్ మీడియా వేదికగా ప్రచారమయ్యే దేశ సమగ్రతకూ, సార్వభౌమత్వానికీ నష్టం చేకూర్చే విషయాలను నిరోధించేందుకు కేంద్రం విధిస్తున్న ఆంక్షలను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సోషల్ మీడియా దిగ్గజాలు సిద్ధమౌతున్నాయి. కాగా, దేశంలో 50 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులు ఉండగా, 30 కోట్ల మంది ఫేస్‌బుక్‌ని వాడుతున్నారు. లక్షలాది మంది ట్విట్టర్‌ని వినియోగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ కొత్త నిబంధనలు ఇంటర్నెట్ యూజర్ల ప్రతి కదలికపై నిఘా పెట్టేలా ఉండటంతో యూజర్ల వ్యక్తిగత స్వేచ్ఛకు అవి భంగకరమన్న భావన అంతర్జాతీయ సోషల్ మీడియా వర్గాల్లో ఉంది. నియంత్రణ మంచిదే అయినప్పటికీ ప్రభుత్వం గుడ్డిగా నిబంధనలు విధిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మితిమీరిన నియంత్రణ వ్యక్తుల భావప్రకటనా స్వేచ్ఛకూ విఘాతం కలిగిస్తుందని ఇంటర్నెట్ కంపెనీ దిగ్గజాలు భావిస్తున్నాయి. అయితే సోషల్ మీడియాను సురక్షితంగా ఉంచడమే ఈ నిబంధనల లక్ష్యమని, ఇది భావప్రకటనా స్వేచ్ఛను నియంత్రించడానికో, వారిపై తమ అభిప్రాయాలను రుద్దడానికో ఉద్దేశించింది కాదని ఐటీ శాఖ చెబుతోంది. మరోవైపు ఐటీ శాఖ ఆంక్షల తోనూ, అభిప్రాయాలతో ట్విట్టర్ ఏకీభవిస్తోంది.

గ్రామాల్లోనూ 'యూజీడీ'

తొలి విడతలో 11 గ్రామాల్లో అమలు



విశాలాంధ్ర - అమరావతి: నగరాలకే పరిమితమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ గ్రామాల్లోకూడా అందుబాటులోకి వస్తోంది. గ్రామీణాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఎంపికైన గ్రామాల్లో ఈ యూజీడీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్దేశించింది. ఈ క్రమంలో ఎంపికైన 11 గ్రామాల్లో దీనిని అమలు చేస్తున్నారు. భూగర్భ మురుగు నీటి పారుదల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మార్చి నాటికి పనులు పూర్తి చేసి 20 వేలకు పైగా నివాసాలకు కనెక్షన్లు జారీ చేయనున్నారు. యూజీడి వ్యవస్థ అందుబాటులోకి వస్తే ఇళ్లల్లో వినియోగించే నీరు, ఇతర అవసరాల కోసం వాడే నీటిని పైపుల్లో నుంచి బయటికి పంపించి పరిశుభ్రతకు పెద్ద పీట వేస్తారు. నివాసాల ముందు, రహదారులపై, మురుగునీరు నిలిచిపోవటం వంటి ఇబ్బందులు తొలగిపోతాయి. దీంతో రోగాలు ప్రబలకుండా అడ్డుకట్ట వేయవచ్చు. ఈక్రమంలో యూజీడీ వ్యవస్థ ఏర్పాటుతో పల్లెటూర్లల్లో పరిశుభ్ర వాతావరణం ఏర్పడుతుందని అధికారులు భావిస్తున్నారు. గ్రామీణాభివృద్ధికి తొలి విడతలో మూడున్నరేళ్ల క్రితం చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు, విశాఖపట్నం, అనంతపురం జిల్లాల్లో 56 గ్రామాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపిక చేశాయి. అయితే రాష్ట్రంలో ఇప్పటికే పది పంచాయతీల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన యూజీడీ వ్యవస్థపై ప్రజల నుంచి సానుకూల స్పందన లభించింది. దోమల బెడత తప్పిందని, అనారోగ్య బాధ నుంచి బయట పడ్డామని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ముందే మురుగు పారే ఇబ్బందులు నుంచి బయటపడగలిగామని ప్రభుత్వ ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడించారు. కాగా ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక పంచాయతీలో యూజీడి వ్యవస్థను సాధ్యమైనంత వేగంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

యూజీడీ అమలు గ్రామాలు..

రాష్ట్ర వ్యాప్తంగా మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటులో భాగంగా 11 గ్రామాల్లో యూజీడీ పనులు చేస్తున్నారు. అందులో చిత్తూరు జిల్లాలో కుప్పం, నెల్లూరు జలాల్లో వెంకటాచలం, అనంతపురం జిల్లాలో కంబదూరు, కురుకులపల్లి, ములకనూరు, రాంపురం, ప్రకాశం జిల్లాలో ఎస్.కొండ, శానంపూడి, మూలగంటపాడు, సోమరాజుపల్లి, ఓల్డ్ ఎస్.కొండ గ్రామాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు జరుగుతోంది. పూర్తిస్థాయిలో ఈ కార్యక్రమం అమల్లోకి వస్తే గ్రామాల్లో మురుగు నీరు పారే కాలువలు బెడద వదిలిపోతుంది. పట్టణాల్లో మాదిరిగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ గ్రామీణ ప్రాంతాలకు సైతం అందుబాటులోకి రావటం మంచి పరిణామమే అయినప్పటికీ నిర్వహణలో నిర్లక్ష్యం కనబరిస్తే ఇబ్బందులు తప్పవు.

సిటీ బ్యాంకుకు రూ.3 కోట్ల జరిమానా

ముంబై: అమెరికా ప్రధాన కేంద్రంగా సేవలు అందించే సిటీ బ్యాంకుకు భారతీయ రిజర్వు బ్యాంకు రూ.3 కోట్లు జరిమానా విధించింది. సమర్థులైన డైరెక్టర్లను నియమించాలని, సరైన అర్హతలుండాలని ఆర్బీఐ గతంతో బ్యాంకును ఆదేశించింది. ఈ ఆదేశాలను పాటించకపోవడంతో బ్యాంకుకు జరిమానా విధించారు. వినియోగదారుల లావాదేవీలతో ఈ జరిమానాకు ఎలాంటి సంబంధం లేదని ఆర్బీఐ వెల్లడించింది. 'సిటీ బ్యాంకుకు జనవరి 3న ఆర్బీఐ రూ.3 కోట్లు జరిమానా విధించింది. ఆర్బీఐ ఆదేశాల మేరకు డైరెక్టర్ల నియామకంలో నిబంధనలు పాటించకపోవడమే ఇందుకు కారణం' అని రిజర్వు బ్యాంకు ఓ ప్రకటనలో తెలిపింది. అక్రమ నగదు చెలామణి, కేవైసీ ఉల్లంఘనలను సంబంధించి జులై 2013లోనూ సిటీబ్యాంకుకు ఆర్బీఐ హెచ్చరిస్తూ లేఖ రాసింది.

ఐడీఎఫ్‌సీ పేరు మార్పు

న్యూఢిల్లీ: ఐడీఎఫ్‌సీ బ్యాంకు ఇక ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా మారింది. కొత్తగా ఏర్పడ్డ ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌బ్యాంక్ లిమిటెడ్‌కు ఎండీగా కేపిటల్ ఫస్ట్ వ్యవస్థాపకులు, చైర్మన్ వి.వైద్యనాథన్ వ్యవహరించనున్నారు. ఐడీఎఫ్‌సీ బ్యాంక్ వ్యవస్థాపక ఎండీ, సీఈవో రాజీవ్ లాల్‌ను తాత్కాలిక నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఐడీఎఫ్‌సీ, కేపిటల్ ఫస్ట్ విలీనం గతేడాది డిసెంబరు 18న జరిగింది. విలీనం తర్వాత ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ 203 బ్యాంకు శాఖల ద్వారా 7.2మిలియన్ల ఖాతాదారులకు సేవలు అందిస్తోంది. కేపిటల్ ఫస్ట్ సంస్థకు చెందిన ప్రతి 10 షేర్లకు 139 ఐడీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లను బదలాయించేలా విలీన ఒప్పందం జరిగింది.



తెలంగాణలో కెనాన్ ఇండియా

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కెనాన్ ఇండియా తెలంగాణలో మొట్టమొదటిసారిగా హైదరాబాద్‌లోని ఐకార్డ్స్ ప్రింటర్స్‌తో మొదటి 80 పీపీఎం ఇమేజ్ ప్రెస్ సీ8000 వీపీని నెలకొల్పింది. కెనాన్ ఇండియా ప్రొఫెషనల్ ప్రింటింగ్ ప్రోడక్ట్స్ డైరెక్టర్ పునీత్ దత్తా సమక్షంలో ఈ మెషిన్ ప్రారంభించారు. ఇమేజ్ ప్రెస్ సీ8000 వీపీ సిరీస్ ఆవిష్కరించిననాటి నుంచి 75 ఇన్‌స్టాలేషన్స్ జరిగాయని పునీత్ తెలిపారు. వివిధ వినియోగితాల్లో నిజమైన తిరుగులేని ఫలితాలను అందించేందుకు ఈ ప్రింటర్ ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణలో తొలిసారిగా తమ ఉనికిని చాటుకోవడం తమకెంతో ఆనందంగా ఉందని, మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. ఐకార్డ్స్ మేనేజింగ్ డైరెక్టర్ మణి వర్గీస్ మాట్లాడుతూ కెనాన్ దేశంలో ప్రసిద్ధి చెందిన బ్రాండ్ అని, ప్రొఫెషనల్ ప్రింటింగ్ రంగంలో వినూత్నతకు పేరొందిందన్నారు. భారీ క్లయింట్ల అవసరాలను తీరుస్తుందని, ఈ ప్రాంతంలో తమ సంస్థమరింత పటిష్టం కానుందన్నారు.

'ఎఫ్‌సీసీ-కార్డియక్ ఇన్‌సైట్స్' సదస్సు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీలలో నూతనంగా వచ్చిన పురోగతులపై ఫ్యాక్ట్స్ కార్డియోవాస్క్యులర్ రీసెర్చ్ ఫౌండేషన్ కార్డియోలజీ క్లినిక్స్ (ఎఫ్‌సీసీ)-కార్డియాక్ ఇన్‌సైట్స్ పేరుతో ఫాక్ట్స్ (ఎఫ్ఏసీటీఎస్) ఫౌండేషన్ సదస్సును నిర్వహించింది. కొలంబియా హాస్పిటల్స్ సహకారంతో ఈ ప్రతిష్టాత్మక 'హార్ట్ వాల్వ్ థెరపీ సింపోసియమ్'ను నిర్వహించారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 300 మంది కార్డియోలజిస్టులు, కార్డియాక్ సర్జన్లతో పాటు ఐదుగురు విదేశీ నిపుణులతో కలుపుకుని మొత్తం 50 మందికి పైగా వైద్య బోధకులు హాజరయ్యారు. కొలంబియా హార్ట్ వాల్వ్ థెరపీ న్యూయార్క్ డైరక్టర్ డా.సుశీల్ కె. కొడాలి, కార్డియోవాస్క్యులర్ రీసెర్చ్ ఫౌండేషన్ సీఈవో డా.జువన్ గ్రెనెడా,కార్డియాక్ క్యాథ్ ల్యాబ్ డైరక్టర్ డా.అజయ్ కీర్తనే, అపోలో హాస్పిటల్స్ సీఈవో వై. సుబ్రమణ్యం హార్ట్ వాల్వ్ థెరపీ ప్రోగ్రామ్, కార్డియాలజీలో వచ్చిన నూతన ఆవిష్కరణల గురించి వెల్లడించారు. అమెరికాకు వెళ్లి వైద్యం చేయించుకుంటే అయ్యే ఖర్చుతో పోలిస్తే తక్కువ ఖర్చుతోనే ఇక్కడే ట్రాన్స్‌క్యాథటర్ అరోటిక్ వాల్వ్ రిప్లేస్‌మెంట్, టీఏవీఆర్‌ను అందుతుందన్నారు.

వెయ్యి మందికిపైగా ఉద్యోగులపై ఫోర్డ్ వేటు!


న్యూఢిల్లీ : ప్రముఖ కార్ల తయారీ కంపెనీ ఫోర్డ్ బ్రిటన్‌లో 1,150 మంది ఉద్యోగులను తొలగించనుంది. యూరోపియన్ కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈచర్య తీసుకోనుంది. లాభాలను పెంచుకునేందుకుగాను ఉద్యోగుల తొలగించడంతో పాటు మరికొన్ని చర్యలను తీసుకోనున్నట్లు ఫోర్డ్ ప్రకటించింది. ఫ్రాన్స్, జర్మనీ, రష్యా దేశాల్లో ఉద్యోగులపై వేటు వేయనున్నట్టు పేర్కొంది.

2012లోనే ఫేస్‌బుక్ డేటా లీక్ యోచన



న్యూఢిల్లీ: వినియోగదారుల డేటాను లీక్ చేసి చిక్కుల్లో పడ్డ ప్రముఖ సోషల్ మీడియా సంస్థ ఫేస్‌బుక్ 2012లోనే డేటాను అమ్మాలనుకున్నదట. వినియోగదారుల సమాచారాన్ని ఉపయోగించుకు నేందుకు అనుమతులు పెంచుతూ ప్రకటనకర్తల నుంచి మరికొంత రాబడి పొందవచ్చనే అంశంపై ఫేస్‌బుక్ ఉద్యోగులు చర్చలు జరిపారని వాల్‌స్ట్రీట్ జర్నల్ కూడా ఓ కథనంలో పేర్కొంది. కనీసం 2,50,000 డాలర్లకు యూజర్ల డేటాను ఉపయోగించుకునేందుకు అవకాశం ఇవ్వాలని ఫేస్‌బుక్ సిబ్బంది అప్పట్లో భావించినట్టు సమాచారం. అయితే 2014లో తన నిర్ణయాన్ని మార్చుకున్న ఫేస్‌బుక్ యూజర్ల డేటాను ఉపయోగించుకోకుండా పరిమితులు విధించింది. 2015 జూన్‌కి పాత వెర్షన్‌లో ఉన్న అనుమతులను తొలగించింది. అమెరికాకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఒప్పంద ఉల్లంఘన కేసు నమోదు చేయగా ఫేస్‌బుక్‌కు చెందిన కొన్ని అంతర్గత పత్రాలు బయటకు పడ్డాయి. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

అమెరికాకు ఒపెక్ వ్యతిరేకం కాదు




న్యూఢిల్లీ : ఒపెక్ అమెరికాకు వ్యతిరేకం కాదని యుఏఈ ఇంధన మంత్రి సొహెయిల్ అల్ మజ్రోయి తెలిపారు. చమురు ధరలు పతనం కాకుండా ఒపెక్, రష్యా నేతృత్వంలోని సహచర దేశాలు రోజుకు 1.2 మిలియన్ బ్యారళ్ల చమురును ఉత్పత్తి చేయడంపై కోత విధించాలని నిర్ణయించాయి. దీనిపై ట్రంప్ స్పందిస్తూ ఒపెక్, సహచర దేశాల నిర్ణయం వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరగవచ్చన్నారు. అయితే ఒపెక్ అమెరికాకు వ్యతిరేకం కాదని, 2018లో చమురు బ్యారెల్ ధర 70 డాలర్లుగా ఉందని సొహెయిల్ వెల్లడించారు. 1.2 మిలియన్ బ్యారెళ్ల మేరకు చమురు ఉత్పత్తిలో కోత విధిస్తే ధర పతనం కాబోదని అభిప్రాయపడ్డారు. ఈఏడాది మధ్యలో చమురు ధర లక్ష్యాన్ని చేరుకొంటుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఒపెక్‌లో మినహాయింపులు పొందిన వెనుజులా, లిబియా, ఇరాన్ దేశాలు ఉత్పత్తిని పెంచబోవని సొహెయిల్ ఆకాంక్షించారు.

లాభాలబాటలో కర్ణాటక బ్యాంకు

న్యూఢిల్లీ: కర్ణాటక బ్యాంకు ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.140 కోట్ల నికర లాభాన్ని సాధించింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.87 కోట్ల నికర లాభం రాగా, 61 శాతం వృద్ధి సాధించినట్టు బ్యాంకు వర్గాలు వెల్లడించాయి. నికర వడ్డీ ఆదాయం రూ.451 కోట్ల నుంచి 8 శాతం వృద్ధితో రూ.488 కోట్లకు పెరిగిందని పేర్కొన్నాయి. ఇతర ఆదాయం 55 శాతం ఎగసి రూ.301 కోట్లకు, నిర్వహణ లాభం 24 శాతం ఎగసి రూ.400 కోట్లకు పెరిగినట్టు తెలిపాయి. రుణ నాణ్యత నిలకడగా ఉన్నా, కేటాయింపులు పెరిగినట్టు వెల్లడించాయి. గత క్యూ3లో 3.96 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ3లో 4.45 శాతానికి పెరిగాయని పేర్కొంది. నికర మొండి బకాయిలు 2.85 శాతం నుంచి 3 శాతానికి చేరాయని తెలిపింది. ఆర్థిక ఫలితాలు బాగా ఉండటంతో బీఎస్ఈలో బ్యాంకు షేర్ 0.6 శాతం లాభపడి రూ.116 వద్ద ముగిసినట్టు వెల్లడించింది.

జీడీపీ వృద్ధికి జిల్లాలపై దృష్టి: సురేశ్ ప్రభు



న్యూఢిల్లీ : దేశ స్థూల జాతీయోత్పతి (జీడీపీ) వృద్ధి రేటును పెంచేందుకు జిల్లాలపై దృష్టి పెట్టనున్నట్టు కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు తెలిపారు. అక్కడ వృద్ధిని 3 నుంచి 4శాతం మేరకు పెంచితే దేశ జీడీపీ వృద్ధిరేటు పెరుగుతుందన్నారు. 'ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లోని జిల్లాలపై దృష్టి పెట్టాము. సులభతర వాణిజ్య విధానాలను ఇక్కడ అమలు చేస్తాము. వచ్చే ఏడు నుంచి తొమ్మిది సంవత్సరాల్లో దేశ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లను చేరుతుంది. దేశంలో ఏటా దాదాపు 100 బిలియన్ డాలర్ల మేరకు విదేశీ పెట్టుబడులను తీసుకురావాలని లక్ష్యంగా 'పెట్టుకొన్నాం' అని సురేశ్‌ప్రభు తెలిపారు. ఇప్పటివరకు గుర్తించిన ఆరు జిల్లాల వృద్ధికి ప్రణాళికలు ఐఐఎం, ఎన్‌సీఏఈఆర్ నేతృత్వంలో రూపొందుతున్నాయని తెలిపారు. స్థూల స్థాయి అంశాలపై మాత్రమే దృష్టిపెట్టామని, మరింత సూక్ష్మస్థాయి అంశాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని ఆయనన్నారు.

ఫోక్స్ వ్యాగన్ రికార్డు స్థాయి అమ్మకాలు

వూల్ఫ్స్‌బర్గ్(జర్మనీ): జర్మనీకి చెందిన ప్రఖ్యాత కార్ల కంపెనీ ఫోక్స్ వ్యాగన్ అమ్మకాల్లో రికార్డు సృష్టించింది. 2018లో వీడబ్ల్యూ బ్రాండ్ కింద 6.24 మిలియన్ కార్లు అమ్ముడయ్యాయి. కొత్త కాలుష్య నియంత్రణ నిబంధనల కారణంగా ఇబ్బందులు తలెత్తినప్పటికీ అమ్మకాల మీద ప్రభావం అంతంత మాత్రంగానే ఉంది. అయితే 2019లో ఆ కంపెనీకి అనేక సవాళ్లు ఎదురుకానున్నాయి. 2015లో ఉద్గారాల పరీక్షల చీటింగ్ కుంభకోణం నుంచి కంపెనీ ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. యూరోపియన్ పర్యావరణ నిబంధనలు కఠినతరం కావడం పెద్ద సమస్యగా ఉంది. ఈ నేపథ్యంలో కార్ల అమ్మకాలను పెంచుకోవడంపై ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఖర్చులను నియంత్రించుకొని ఆ నిధులను ఎలక్ట్రిక్ కార్లు, ఆటోమెటిక్ డ్రైవింగ్ ప్రాజెక్టుపై పెట్టాలని ప్రయత్నాలు చేస్తోంది. చైనా, అమెరికా మధ్య జరుగుతోన్న వాణిజ్య యుద్ధాల కారణంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'అమెరికా ఫస్ట్' విధానాంపై మొగ్గు చూపడం అంతర్జాతీయ ఆటో పరిశ్రమ మీద ప్రభావం చూపనుంది. '2019లో మాకు అనేక సవాళ్లు ఎదురుకానున్నాయి. వాటి మధ్యలో మేము అమ్మకాలు పెంచుకోవడంతో పాటు లాభదాయకతపై ఎక్కువ దృష్టి సారించనున్నాం' అని ఆ కంపెనీ సీఓఓ రాల్ఫ్ బ్రాండ్‌స్టేటర్ వెల్లడించారు. ఈ అమ్మకాల్లో ఫోక్స్ వ్యాగన్ బ్రాండ్లయిన ఆడి, పోర్షె, స్కోడా, బెంట్లే, బుగాట్టి, లంబొర్గినిని పరిగణలోకి తీసుకోలేదు. 2018లో చైనాలో వీడబ్ల్యూ బ్రాండ్ అమ్మకాలు ఎక్కువగా జరిగాయి.

'సౌర విద్యుత్' పెట్టుబడులు తగ్గుముఖం



న్యూఢిల్లీ: సౌర విద్యుదుత్పత్తి రంగంలో పెట్టుబడులు తగ్గుతున్నాయి. గత ఏడాది ఈ రంగంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. 2018 నుంచి తమ పెట్టుబడులను కార్పొరేట్ రంగం తగ్గించుకుంటున్నట్లు మెర్కామ్ క్యాపిటల్ గ్రూప్ నివేదిక పేర్కొంది. 2018లో అంతర్జా తీయ సౌర విద్యుత్ రంగం 970 కోట్ల డాలర్ల నిధులను కార్పొరేట్ రంగం నుంచి సమీకరించినట్టు వెల్లడించింది. 2017తో పోల్చితే నిధుల సమీకరణ 24 శాతం వరకు తగ్గిందని తెలిపింది. సౌర విద్యుదుత్పత్తి రంగంలో వెంచర్ క్యాపిటల్, డెట్ ఫైనాన్సింగ్, పబ్లిక్ మార్కెట్ ఫైనాన్సింగ్ సహా గ్లోబల్ కార్పొరేట్ రంగం సుమారు 970 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టాయని వెల్లడించింది. 2017లో కార్పొరేట్ రంగం 1,280 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టగా, 2018లో అంతర్జాతీయ సౌర విద్యుత్ రంగంలో గ్లోబల్ వెంచర్ క్యాపిటల్ సంస్థలు 65 డీల్స్ ద్వారా 130 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టాయని తెలిపింది. 2017తో పోల్చితే ఇది 18 శాతం తక్కువని తెలిపారు. దిగుమతులపై రక్షణాత్మక సుంకాలను భారత్ విధించటం కూడా ఈ రంగాభివృద్ధిపై ప్రభావం చూపించినట్టు తెలుస్తోంది. అంతర్జాతీయంగా పేరొందిన కంపెనీలు సైప్రస్ క్రీక్ రెన్యువబుల్స్ (20 కోట్ల డాలర్లు), గ్రీన్ యెల్లో (17.4 కోట్ల డాలర్లు), ఏఎంపీ సోలార్ (15.4 కోట్ల డాలర్లు), వండర్ క్యాపిటల్ (11.2 కోట్ల డాలర్లు), సున్నోవా ఎనర్జీ (10 కోట్ల డాలర్లు) వెంచర్ క్యాపిటల్ సంస్థల నుంచి నిధులను సమీకరించిన వాటిల్లో ఉన్నాయి. యూరోపియన్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ (ఈబీఆర్‌డీ) దాదాపు 16 ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టగా డచ్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఎఫ్ఎంఓ 7 ప్రాజెక్టులు, నటిక్సిస్ 6 ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాయని నివేదిక వెల్లడించింది.

పాకిస్థాన్‌లో సౌదీ చమురుశుద్ధి కర్మాగారం

గ్వదర్ : పాకిస్థాన్ గ్వదర్ డీప్ వాటర్ పోర్టులో పది బిలియన్ డాలర్ల పెట్టుబడితో చమురుశుద్ధి కర్మాగారాన్ని నెలకొల్పేందుకు ప్రణాళిక సిద్ధమైందని సౌదీ అరేబియా ఇంధన శాఖ మంత్రి ఖలీద్ అల్-ఫలీహ్ విలేకరులకు తెలిపారు. పోర్టు వద్ద ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు నిర్మాణంలో చైనా సహాయం ఉండవచ్చునని కూడా తెలిపారు. ప్రస్తుతం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పాకిస్థాన్ ఇతర దేశాల ఆర్థిక సహాయాన్ని కోరుకుంటున్నది. ఆర్థిక లోటును కొంత పూడ్చుకునేందుకు చమురు ధరలను ప్రభుత్వం పెంచింది. ఆరు బిలియన్ డాలర్ల ప్యాకేజిని ఆర్థిక సహాయంగా సౌదీ గతేడాది ప్రకటించింది. ముడి చమురు దిగుమతి చేసుకునేందుకు ఈ ఆర్థిక సహాయాన్ని పాకిస్థాన్ ప్రభుత్వం వినియోగించుకుంటోంది. చమురుశుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయడం ద్వారా పాకిస్థాన్ ఆర్థికంగా సుస్థిరతను, వృద్ధిని సాధించేందుకు సహాయపడాలని సౌదీ అభిలషిస్తున్నది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో సౌదీ, పాకిస్థాన్, చైనాలు భాగస్వామ్యం వహించే అవకాశం ఉందని సౌదీ ఇందన శాఖ మంత్రి తెలిపారు. ఈ మడు దేశాల ఆర్థిక కారిడార్‌లో భాగంగా ఈ కర్మాగారాన్ని ఏర్పాటు చేయనున్నారు. వచ్చే ఫిబ్రవరిలో సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్ పాకిస్థాన్‌లో పర్యటించి ఇందుకు సంబంధించిన ఒప్పందంపైన సంతకం చేయనున్నారు. ఇతర రంగాలలోనూ తాము పెట్టుబడులు పెట్టనున్నామని సౌదీ మంత్రి తెలిపారు. చమురు శుద్ధి కర్మాగారంలో ఆర్థిక కారిడార్‌లో భాగంగా 60 బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెడతామని చైనా గతంలో హామీ ఇచ్చింది. అలాగే విద్యుత్ స్టేషన్లు, ప్రధాన రహదారుల నిర్మాణం, రైల్వేల ఆధునీకీకరణ తదితర ప్రాజెక్టులలోనూ చైనా సహకరిస్తుందని పాకిస్థాన్ పెట్రోలియం మంత్రి గులాం సర్వర్ ఖాన్ తెలిపారు.

న్యాయం కావాలి

- క్రిమినల్ జస్టిస్‌లో కుల వివక్ష ?
- ఖైదీల్లో ఎస్సీలు, ఎస్టీలు, ముస్లింలు అత్యధికం
- జనాభాలో 39 శాతం, జైళ్లలో 55 శాతం
- న్యాయ వ్యవస్థలోని లోపాలపై ఓ నివేదిక



న్యూఢిల్లీ: జాతీయ నేర రికార్డుల బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) తన 21వ నివేదికను 2015లో విడుదల చేసింది. దాని ప్రకారం దేశ జైళ్లలోని విచారణ ఖైదీల్లో 55 శాతంమంది దళితులు, ఆదివాసీ లు, ముస్లింలేనని తేలింది. జనాభాలో వారి వాటాకన్నా ఇది అత్యధికం కావడం గమనార్హం. 2011 లెక్కల ప్రకారం జనాభాలో ఈ మూడు వర్గాల వాటా 39 శాతం. అంటే జనాభాతో పోలిస్తే 16 శాతం అధికంగా జైళ్లలో మగ్గుతున్నారని అర్థం. అరెస్టయి విచారణను ఎదుర్కొంటున్నవారితోపాటు శిక్షలు పడినవారి లెక్కలు చూసినా ఈ వ్యత్యాసం కనిపిస్తుంది. 2014 ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం జైళ్లలో ఉన్న ఎస్సీలు 21.6 శాతం కాగా, ఎస్టీలు 12.4 శాతం. వీరి జనాభా మొత్తం 24.4 శాతం (ఎస్సీలు 16.2 శాతం, ఎస్టీలు 8.2 శాతం) కాగా జైళ్లలో ఉన్నది 34 శాతం(21.2+12.4). ఆదివాసీల జనాభా 8.2 శాతం కాగా, జైళ్లలో ఉన్నది 12.4 శాతం. ఎస్సీ,ఎస్టీల జనాభాతో పోలిస్తే జైళ్లలో ఖైదీలుగా ఉన్న ఆ వర్గాల శాతం అత్యధికంగా ఉన్న రాష్ట్రాలు అస్సాం, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడులో ఎస్సీ,ఎస్టీల జనాభా 21.2 శాతం కాగా, ఆ వర్గాలు ఖైదీలుగా ఉన్నది 38.6 శాతం. అంటే వ్యత్యాసం 17.4 శాతం. ఈ వర్గాలవారు అత్యధిక సంఖ్యలో జైళ్ల లో మగ్గడానికి కారణాలేమిటో నివేదిక వెల్లడించింది. వీరికి సంబం ధించిన కేసుల్లో పోలీస్ దర్యాప్తు ఆలస్యం కావడం, నిర్ణీత సమయంలో ఛార్జిషీట్లు దాఖలు చేయకపోవడం, విచారణ న్యాయస్థానాల సంఖ్య లేదా జడ్జిల సంఖ్య తక్కువగా ఉండటం కారణాలని నివేదికలో పేర్కొన్నారు. దళితులు,ఆదివాసీలపై నేరాలు మోపిన ఆధిపత్య కులాలు తమ కున్న పలుకుబడితో పోలీస్‌దర్యాప్తును ప్రభావితం చేయడం కూడా మరో కారణంగా నివేదిక స్పష్టం చేసింది. అకారణంగా అరెస్టులు, తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులపాలు చేయడం కూడా కుల వివక్షతో కూడిన మన సమాజంలో జరుగుతున్న సాధారణ పరిణామంగా అర్థం చేసుకోవాలి.


వ్యవస్థాగత లోపాలు

తగిన సంఖ్యలో జైలు అధికారులు లేకపోవడం వల్ల విచారణ ఖైదీల పై ఎప్పటికపుడు సమీక్షలు నిర్వహించలేకపోతున్నారు. నేర శిక్షాస్మృతి లోని సెక్షన్ 436 ఏ ప్రకారం జైళ్లలో విచారణ ఖైదీలుగా నిర్ణీత గడువు వరకే ఉంచాల్సి ఉంటుంది. ఛార్జిషీట్ వేయడంలో ఆలస్యమైతే వారిని బెయిల్‌పై విడుదల చేయాల్సి ఉంటుంది. అయితే, ఖైదీలపై సమీక్షలు జరిపే యంత్రాంగం తగినంతగా లేకపోవడం వల్ల వారు జైళ్లలోనే మగ్గాల్సి వస్తోంది. మంజూరైన జైలు అధికారుల పోస్టుల్లో 66.3 శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. ఆదివాసీలు, దళితుల్లో పేదరికం, నిరక్షరాస్య త, న్యాయ వ్యవస్థ పట్ల అవగాహన లేకపోవడం మరో కారణం. ఆయా కేసుల్లో బెయిల్ ఎలా పొందాలో తెలియకపోవడం, వారికి న్యాయ సహాయం అందించేవారు లేకపోవడం కూడా కారణాలు. వీరిపై నేరాలు మోపినవారు రాజకీయ పలుకుబడి ఉన్న ఆధిపత్య కులాల వారైనపుడు సాక్ష్యులు కూడా బెదిరింపులకు గురై తప్పుడు సాక్ష్యాలిచ్చే అవకాశాలు ఉండనే ఉన్నాయి. సమాజంలోని కుల వ్యవస్థ ప్రభావం అన్ని వ్యవస్థలపైనా సహజంగానే ఉంటుందనేది శాస్త్రీయమైన అవగాహన. వాస్తవ పరిశీలనలోనూ అదే నిజమని స్పష్టమవుతోంది

ఎండోస్కోప్‌పై అవగాహన అవసరం



డాక్టర్
ఎం.జగన్‌మోహన్,
ఎం.డి.డి.ఎం., జీర్ణకోశ
వ్యాధి నిపుణులు,
విజయవాడ



కంటితో చూడలేని జీర్ణవ్యవస్థ లోపలి భాగాలను వైద్య నిపుణులు ప్రత్యేకమైన పరికరాల ద్వారా రోగి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి, సరైన వైద్యం అందించడానికి ఉపయోగపడే ప్రక్రియే ఎండోస్కోపి. ఈ విధానం పట్ల ప్రజల్లో అవగాహన కలిగించడం ఎంతైనా అవసరం. ఛాతీలో మంట, కడుపునొప్పి, పుల్లటి తేన్పులు, వాంతులు, విరేచనాలు, మలద్వారం నుండి రక్తస్రావం, మలంలో రక్తం పడటం, రక్తపు వాంతులు, అజీర్తి, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, మలబద్ధకం వంటి లక్షణాలు జీర్ణకోశ వ్యాధులకు కారణాలుగా పేర్కొనవచ్చు.

ఇటీవలి కాలంలో ఆహారంలో మార్పులు రావడం, కల్తీ ఆహారం, జంక్‌ఫుడ్స్, సమయానుకూలంగా ఆహారం తీసుకోకపోవడం, వివిధ రకాల పానీయాలు తీసుకోవడం మూలంగా అనేక రకాల జీర్ణకోశ వ్యాధులు సంక్రమిస్తున్నాయి. విచారకరమైన అంశం ఏమిటంటే, ముఖ్యంగా యువత, చిన్నవయసు వారు కూడా జీర్ణకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. పైన తెలిపిన లక్షణాలు ఉంటే వెంటనే జీర్ణకోశ వ్యాధి నిపుణులను సంప్రదించాలి. రోగి అవసరాన్ని బట్టి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో ముఖ్యమైనది ఎండోస్కోప్ విధానం. ఈ పద్ధతిలో రోగి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సులువుగా నిర్వహిస్తారు.

ఈ విధానంపై కొంతమందికి పలు అనుమానాలు ఉన్నాయి. ఒకటే స్కోప్‌ని (గొట్టం) ప్రతిరోజూ అనేకమందికి వాడుతుంటే ఏమైనా ఇతరత్రా సమస్యలు తలెత్తుతాయేమోనని అంటున్నారు. అంతేకాక ఏమైనా ఇతరత్రా వ్యాధులు సంక్రమిస్తాయా ? అని ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఇలాంటి అపోహలకు తావులేదు. ఆ పరికరాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిశుభ్రం చేస్తారు. అందువల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవు. అంతేకాక ఈ ఎండోస్కోప్ ఖర్చు కూడా చాలా తక్కువగా ఉంటుంది. ఒకసారి పరీక్షా విధానాన్ని పరిశీలిస్తే, ఒక పొడవాటి వంగే స్కోప్, దాని చివర చిన్న లైటు, వీడియో కెమెరా అమర్చి ఉంటాయి. ఈ స్కోప్‌ని గొంతులో అన్నవాహిక ద్వారా జీర్ణాశయంలోకి పంపిస్తారు. జీర్ణాశయం లోపలి భాగాలను క్షుణ్ణంగా పరిశీలించి, వ్యాధిని నిర్ధారిస్తారు. ఈ ప్రక్రియను వైద్యులు మానిటర్ ద్వారా పరిశీలిస్తారు.

ఈ పరీక్షకు 8 గంటల ముందు నుండి ఎటువంటి ఆహార పానీయాలు తీసుకోరాదు. ఖాళీ కడుపుతో మాత్రమే వైద్యుడిని సంప్రదించాలి. ఈ పరీక్షా విధానం ఎలా ఉంటుందంటే.. స్కోప్ ఎక్కించే సమయంలో ఎడమవైపునకు తిరిగి పడుకుంటే జీర్ణాశయం భాగాలను సులువుగా పరిశీలించవచ్చు. అతి కొద్దిమందికి మాత్రమే మత్తుమందు ఇస్తారు. ఆ సమయంలో రక్తపోటు, నాడీ వేగం, శ్వాస, రక్తంలో ఆక్సిజన్ స్థాయిలు గమనిస్తారు. కడుపు లోపలి భాగం, పొట్ట పేగులు తెరవడానికి, తద్వారా ఎండోస్కోప్ సాఫీగా వెళ్లడానికి, వైద్యుడు స్పష్టంగా చూడడానికి వీలుగా స్కోప్ ద్వారా మెల్లగా ఆక్సిజన్ ప్రవేశపెడతారు.

ఎండోస్కోప్ అనంతరం వైద్యుడు వ్యాధి నిర్ధారణ చేసి, సరైన మందులను అందించే అవకాశం ఉంది. పరీక్ష అనంతరం రోగి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఒంటరిగానే ఇంటికెళ్లిపోవచ్చు. అంటే ఇది ఎంత సులభతరమైన ప్రక్రియో అర్థమవుతుంది. గొంతులో కొంచెం మంటగా ఉంటే దాన్ని వేడి పానీయాలు లేదా గొంతునొప్పికి వాడే బిళ్లలను చప్పరించడం ద్వారా తగ్గించుకోవచ్చు. ఈ ఎండోస్కోప్ చేయించదలిచినవారు అర్హత కలిగిన, అనుభవజ్ఞుడైన వైద్యుడిని సంప్రదిస్తే సత్ఫలితాలు వస్తాయి.

– గోపాలుని రాధాకృష్ణ,
సీనియర్ జర్నలిస్ట్

హైపర్ టెన్షన్ నిర్వహణలో డైట్ పాత్ర



హైపర్ టెన్షన్ గురించి తగిన జాగ్రత్తలు తీసుకోకపోయినట్లయితే కరోనరి హార్ట్ డిసీజ్, హార్ట్ ఫెయిల్యూర్, స్ట్రోక్, కిడ్నీ ఫెయిల్యూర్ వంటి ప్రమాదకర వ్యాధులు కలుగుతాయి. మరి ఇలాంటి హైపర్ టెన్షన్ కలిగి ఉన్న వారు ఆహారంలో చేయాల్సిన మార్పుల గురించి ఇక్కడ తెలుపబడింది.

హైపర్ టెన్షన్ డైట్

హైపర్ టెన్షన్ లేదా అధిక రక్తపోటు అనేది వైద్యశాస్త్ర ప్రకారం, ధమని రక్త ప్రవాహం పెరిగి, గోడలపై ఒత్తిడి పెరగటం వలన అనేక రకాల అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉంది. ఒకవేళ దీనికి సరిగా చికిత్స అందించని ఎడల, కరోనరి హార్ట్ డిసీజ్, హార్ట్ ఫెయిల్యూర్, స్ట్రోక్, కిడ్నీ ఫెయిల్యూర్ వంటి ప్రమాదకర వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. ఆహారంలో చేసే మార్పుల వలన హైపర్ టెన్షన్‌ను తగ్గించుకోవచ్చు.

ఉప్పు

హైపర్ టెన్షన్ కలిగి ఉన్న వారు, సోడియంను తక్కువ తీసుకోవటం ద్వారా రక్తపీడన స్థాయిలు ఆరోగ్యకర స్థాయిలో నిర్వహించవచ్చని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. అధికంగా సోడియం అధికంగా గల ఆహారాలు, ద్రావణాలను నిలుపుదల చేయటం వలన రక్త పరిమాణం పెరిగి, గుండెపై ఒత్తిడిని పెంచుతాయి.

ఒమేగా–3 ఫాటీ ఆసిడ్

చేపలు ఒమేగా–3 ఫాటీ ఆసిడ్ లను అధికంగా కలిగి ఉండి, హైపర్ టెన్షన్, గుండె సంబంధిత రుగ్మతలను కూడా తగ్గిస్తాయి. చేప నూనె సప్లిమెంట్స్, సిస్టోలిక్ మరియు డయాస్టోలిక్ రక్తపీడనాలను గణనీయంగా తగ్గిస్తాయి. అధిక డోస్ గల చేప నూనె గుండె సంబంధిత వ్యాధులను కలిగించవచ్చు. సాల్మన్, సార్డైన్, హాలిబట్, మకేరాల్ వంటి ఫాటీ ఫిష్‌లను వారంలో కనీసం ఒక పౌండ్ వరకు తినాలి.

విటమిన్ 'K2'

విటమిన్ 'K2' అనేది చాలా కీలక పోషకం. హైపర్ టెన్షన్‌ను ఆరోగ్యకర స్థాయిలో నిర్వహించటానికి ఈ విటమిన్ తప్పక అవసరం. ఈ పోషకం వాస్కులార్ దృఢత్వాన్ని, ఎట్రియల్ కాల్సిఫికేషన్‌ను తగ్గిస్తుంది.

హెర్బల్ టీ

కొన్ని ప్రత్యేక రకాల హెర్బల్ టీలు రక్తపోటును తగ్గిస్తాయి. హైబిస్కస్ టీ లో ఉండే ఫ్లావనాయిడ్‌లు, మినరల్ మైర్యు ఇతర పోషకాలు హై బ్లడ్ ప్రెషర్‌ను ఆరోగ్యకర స్థాయిలో నిర్వహిస్తాయి. గ్రీన్ టీ కూడా హై బ్లడ్ ప్రెషర్ తగ్గించటంలో సహాయపడుతుంది.



పోషకాల గని... దంపుడు బియ్యం

బియ్యం అనగానే మనకిప్పుడు బాగా పాలిష్ పట్టిన తెల్లటి బియ్యమే గుర్తుకొస్తాయి. కానీ ఒకప్పుడు దంపుడు బియ్యమే తినేవారు. చూడ్డానికి దుమ్ము పట్టినట్టుగా, ముదురు రంగులో కనిపిస్తుండొచ్చు గానీ.. నిజానికివి మంచి పోషకాల గనులు. వరి పొట్టు కింద ఉండే తవుడు పొరలో విటమిన్లు, ఖనిజాలు దండిగా ఉంటాయి. పాలిష్ పట్టినపుడు తవుడుతో పాటు ఇవన్నీ తొలగిపోతాయి. అందుకే తెల్ల బియ్యం కన్నా దంపుడు బియ్యమే మంచివని పరిశోధకులు చాలాకాలంగా చెబుతూనే ఉన్నారు. వారానికి ఐదు, అంతకన్నా ఎక్కువసార్లు తెల్లబియ్యం తీసుకోవటం వల్ల మధుమేహం ముప్పు పెరుగుతున్నట్టు హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిశోధకులు గుర్తించారు. తెల్లబియ్యాన్ని 50 గ్రాములు తగ్గించి, వాటి స్థానంలో దంపుడు బియ్యాన్ని చేర్చుకుంటే మధుమేహం ముప్పు 16% వరకు తగ్గుతున్నట్టు తేలింది కూడా. అంతేకాదు, రక్తపోటు పెరగటానికి దోహదం చేసే సోడియం పాళ్లు కూడా దంపుడు బియ్యంలో తక్కువే. ఇక పోషకాల పరంగా చూస్తే– మనం తిన్న ఆహారాన్ని శక్తిగా మలచటంలో కీలకపాత్ర పోషించే నియాసిన్, విటమిన్ బి3 వీటిల్లో చాలా ఎక్కువ. వీటిల్లోని మెగ్నీషియం ఎముకల ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తుంది. థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తికి, విశృంఖల కణాలను అడ్డుకోవటానికి తోడ్పడే సెలీనియం కూడా దంపుడు బియ్యంలో దండిగానే ఉంటుంది. వీటిల్లోని లిగ్నాన్లు అనే పాలీఫెనాల్స్ పేగుల్లోకి చేరిన తర్వాత ఫైటోఈస్ట్రోజన్ ఎంటెరోలాక్టోన్‌గానూ మారతాయి. ఇవి క్యాన్సర్ నివారకంగా పనిచేయటమే కాకుండా గుండె ఆరోగ్యంగా ఉండటానికీ దోహదం చేస్తాయి. ఇక వీటిలోని పిండి పదార్థం నెమ్మదిగా జీర్ణమవుతుంది. అందువల్ల రక్తంలో గ్లూకోజు స్థాయిలు అంత త్వరగా పెరగవు. కడుపు నిండిన భావన కలిగించటం వల్ల వెంట వెంటనే ఆకలి వేయదు కూడా.





వైజాగ్‌లో టీఎస్సార్ అవార్డుల పండుగ

టి.ఎస్.ఆర్. – టీవీ 9 నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్‌కు విశాఖపట్నం మరోసారి వేదిక కాబోతోంది. 2010 నుండీ రెండేళ్ళకు ఒకసారి కళాబంధు, సాంస్కృతిక సార్వభౌమ టి.సుబ్బరామిరెడ్డి ఈ అవార్డులను జాతీయ స్థాయిలో అందిస్తున్నారు. ఫిబ్రవరి 17వ తేదీ విశాఖపట్నం, పోర్ట్ గ్రౌండ్‌లో వేలాదిమంది సమక్షంలో ఘనంగా 2017, 18 ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవాన్ని జరుపుబోతున్నట్టు శనివారం టి.సుబ్బరామిరెడ్డి తెలిపారు. ఈ మీడియా సమావేశంలో జ్యూరీ ఛైర్మన్ సుబ్బరామిరెడ్డితో పాటు సభ్యులు డా. శోభనా కామినేని, పింకీరెడ్డి, నగ్మా, మీనా, పరుచూరి గోపాలకృష్ణ, నరేశ్, కె.ఎస్. రామారావు పాల్గొన్నారు. వీరితో పాటుగా జీవిత, కె.రఘురామ కృష్ణంరాజు సైతం జ్యూరీ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.

టి. సుబ్బరామిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాట్లాడుతూ, '2010లో మొదలు పెట్టిన ఈ అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్విఘ్నంగా కొనసాగించడం ఆనందంగా ఉందని, ఈశ్వర శక్తి, ప్రజల ప్రేమతో ఇది సాధ్యమౌతోంద'ని అన్నారు. శ్రీదేవి మెమోరియల్ అవార్డును విద్యాబాలన్ కు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి రజనీకాంత్, సూర్య, విక్రమ్ తో పాటు చిరంజీవి, బాలక ృష్ణ, నాగార్జున, వెంకటేశ్ తదితర తారలు హాజరవుతారని అన్నారు. నెల్లూరులో పుట్టిన సుబ్బరామిరెడ్డికి హైదరాబాద్, విశాఖపట్నంతో విడదీయరాని అనుబంధం ఉందని, ఆయన ఆరాధించే శివుడి ఆజ్ఞతోనే ఈ కళాసేవ అపూర్వంగా సాగుతోందని పరుచూరి గోపాలకృష్ణ చెప్పారు. తమ జ్యూరీ గౌరవప్రదంగా, అందరికీ ఆమోదయోగ్యమైన నటీనటులను అవార్డులకు ఎంపిక చేస్తుందని నరేశ్ తెలిపారు. తెలుగు చిత్రసీమకు చెందిన అనేక మందికి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడానికి టి. సుబ్బరామిరెడ్డి కారకులని కె.యస్. రామారావు చెప్పారు. భారతీయ కళలు, సంస్కృతికి సేవ చేస్తున్న గొప్ప వ్యక్తి సుబ్బరామిరెడ్డి అని నగ్మా అన్నారు. గతంలో అవార్డుల కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యానని, ఆ తర్వాత 'ద ృశ్యం' చిత్రానికి గానూ ఉత్తమ నటిగా అవార్డును అందుకున్నానని, ఇప్పుడు జ్యూరీలో ఉండటం ఆనందంగా ఉందని మీనా తెలిపారు. రాజకీయ, పారిశ్రామిక, కళా రంగాలలో తనదైన ముద్ర వేసిన టి.సుబ్బరామి రెడ్డి జీవితాన్ని బయోపిక్‌గా రూపొందించాల్సిన అవశ్యకత ఉందని శోభనా కామినేని అభిప్రాయపడ్డారు. తన తండ్రికి వేరెవ్వరూ సాటిరారని, అతి త్వరలోనే ఆయన ఆటోబయోగ్రఫీని విడుదల చేయబోతున్నామని పింకీ రెడ్డి చెప్పారు.

నేడు 'మిస్టర్ మజ్ను' పాటలు విడుదల



అఖిల్ అక్కినేని హీరోగా శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి పతాకంపై 'తొలిప్రేమ' ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వంలో భారీ నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ మజ్ను'. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకొని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి జనవరి 25న చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించి విడుదలైన పాటలకు, టీజర్‌కు చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. 'ఏమైనదో... ఏమైనదో', మిస్టర్ మజ్ను టైటిల్ సాంగ్, 'హార్ట్ బ్రేక్' పాటలకు మంచి ఆదరణ లభిస్తోంది. జనవరి 14 ఉదయం 10 గంటలకు సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం జ్యూక్ బాక్స్‌ను విడుదల చేయబోతున్నారు. అఖిల్ అక్కినేని సరసన నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: థమన్, పాటలు: శ్రీమణి, సినిమాటోగ్రఫీ: జార్జ్ సి. విలియమ్స్, ఎడిటింగ్: నవీన్ నూలి, ఆర్ట్: అవినాష్ కొల్లా, కొరియోగ్రఫీ: శేఖర్, నిర్మాత: బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వెంకీ అట్లూరి.

నేను వారి స్థాయిలో లేను

విశాలాంధ్ర సినిమా

అనిల్ రావిపూడి



వెంకటేష్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహరీన్ కౌర్ హీరో హీరోయిన్లుగా దిల్‌రాజు సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అనిల్ రావిపూడి దర్శకత్వంలో శిరీష్, లక్ష్మణ్ నిర్మాతలుగా రూపొందిన చిత్రం 'ఎఫ్2.. ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్'. జనవరి 12న సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు అనీల్ రావిపూడి మాట్లాడుతూ...

ఆసనం ఐడియా అలా వచ్చింది..

- సాధారణంగా మనం రకరకాల ఆసనాలు వేస్తుంటాం. అలాంటిది మనలో ఉన్న ఒత్తిడిని దూరం చేసుకోవడానికి ఒక ఆసనం ఉంటే ఎలా ఉంటుంది. అనే ఆలోచన నుండి ఈ వెంకీ ఆసనం పుట్టుకొచ్చింది. అలాగే వెంకటేష్‌గారికి ఓ మెనరిజమ్ పెట్టి.. దాన్ని కథకు లింక్ చేస్తు బావుంటుందనిపించి ఈ వెంకీ ఆసనం కనిపెట్టాను. ఆడియెన్స్ దాన్ని బాగా ఓన్ చేసుకున్నారు. చాలా మంది థియేటర్‌లో ఆ ఆసనాన్ని వేస్తున్నారు. పాపులర్ అయ్యింది.

వారి స్థాయికి ఇంకా చేరుకోలేదు..

- సంక్రాంతి విన్నర్ అంటే పక్క సినిమాలతో పోటీ అనే భావన వచ్చేస్తుంది. అయితే నాకొక ఆలోచన ఉండేది. ఈవీవీగారి సినిమాలు, క ృష్ణారెడ్డిగారి సినిమాలు.. జంధ్యాలగారి సినిమాలను చూస్తే.. అన్నీ వర్గాల ప్రేక్షకులు నవ్వుతూనే ఉండేవారు. వారి సినిమాలను బాగా చూసేవాడిని. అలా పూర్తిస్థాయి సినిమాను తీయాలనే కోరిక ఉండేది. అది ఈ సినిమాతో తీరింది. మెమొరబుల్ ఎక్స్‌పీరియెన్స్. అందరూ పగలబడి నవ్వుతున్నారు. సోషల్ మీడియాలో ఈవివిగారు, జంధ్యాలగారితో పోలుస్తూ కొందరు కామెంట్స్ కూడా చేశారు. అయితే వారి స్థాయికి నేను ఇంకా చేరుకోలేదు. అయితే ఎక్కడో ఒకచోట వాళ్ల ప్రభావం నాపై ఉంటుందనే మాట మాత్రం వాస్తవం. ఎందుకంటే వాళ్ల సినిమాలను నేను అలా చూసేవాడిని. వారి స్టయిల్‌ను నా స్టయిల్‌కు తగ్గట్టు మార్చుకుని సినిమాలు చేస్తున్నాను.

వరుణ్ చక్కగా చేశాడు...

- వరుణ్ కూడా ఇప్పటి వరకు కామెడీ జోనర్‌లో సినిమా చేయలేదు. తను వెంకటేష్‌తో ఎలా కామెడీ టైమింగ్‌లో చేస్తాడోనని కాస్త ఆలోచించాను. తెలంగాణ యాస మాట్లాడుతూ వరుణ్ యాదవ్ అనే కుర్రాడి పాత్రలో కామెడీ జోనర్‌లో తొలిసారి చాలా చక్కగా నటించాడు. వెంకీగారితో కలిసి తను అద్భుతంగా నటించాడు.

కథాలోచన అక్కడ నుండే వచ్చింది...

- 'పటాస్' నుండి రాజాది గ్రేట్ వరకు కమర్షియల్ సినిమాలు చేశాను. అయితే రాజాది గ్రేట్ సినిమా చేసేటప్పుడు అసలు ఫైట్ లేకుండా ఓ కమర్షియల్ సినిమా చేద్దాం అనే ఆలోచన వచ్చింది. దానికి ఎలాంటి బేస్ తీసుకొద్దాం. అని ఆలోచన వచ్చింది. పెళ్ళాం చెబితే వినాలి, క్షేమంగా వెళ్ళి లాభంగా రండి జోనర్‌లో ఈ మధ్య సినిమాలు రాలేదనిపించి ఈ కథను రాసుకున్నాను. సాధారణంగా ఓ సినిమాను పూర్తి చేయడానికి ఏడాది సమయం పడుతుంది. కాబట్టి నాటీం సాయి, ప్రవీణ్, నారాయణలతో కథపై నాలుగైదు నెలలు వర్క్ చేశాం.

సీక్వెల్‌గా చేస్తా...

- హిందీలో గోల్‌మాల్, హౌస్‌ఫుల్ సినిమాల సిరీస్ ఉంది. మన తెలుగులో ఇలాంటి జోనర్‌లో సినిమాలు చేయాలని ఉంది. కచ్చితంగా ఎఫ్ 2కు సీక్వెల్‌గా ఎఫ్ 3 చేస్తాను. వెంకటేష్‌గారికి, వరుణ్‌కి చెప్పేశాను. వాళ్లు ఎప్పుడైనా రెడీ అన్నారు.

చర్చల్లో ఉంది...

- వెంకటేష్‌కి ఓ లైన్ చెప్పాను. ఆయనకు బాగా నచ్చింది. కథా చర్చలు జరుగుతున్నాయి. అది ఎప్పుడు ఓకే అవుతుందో ఇప్పుడే చెప్పలేను.

కథను నమ్మారు..

- వెంకటేష్ కథను బాగా నమ్మారు. డబ్బింగ్ చెప్పేటప్పుడు సినిమా అంతా చూసి.. బయటకు వచ్చి 'అదేంటమ్మా అలా చేయించేశావ్' డబ్బింగ్ ఎంత ఎనర్జీతో చెప్పాలో తెలుసా! రేపు వచ్చి డబ్బింగ్ చెబుతాను' అని వెళ్లిపోయారు. చాలా కేర్ తీసుకుని డబ్బింగ్ చెప్పారు.

అక్కడే నుండే ఆ క్యారెక్టర్స్...

- సూర్యకాంతంగారి నటనలో, డైలాగ్ చెప్పడంలో ఓ స్టయిల్ ఉంటుంది. ఆమె డైలాగ్‌ను చాలా అందంగా విరుస్తారు. అలాంటి క్యారెక్టర్ మోడ్రన్‌గా ఉంటే ఎలా ఉంటుందో అని ఆలోచించి ప్రగతి క్యారెక్టర్‌ను పెట్టాం. మా అమ్మమ్మ, నాయనమ్మలు ఉండేవారు. ఏ ఫంక్షన్‌కి వచ్చినా మంచంపై కూర్చుని అది.. ఇది అంటూ అందరినీ కామెంట్ చేస్తుంటారు. ఆ క్యారెక్టర్స్ నాకు బాగా రిజిష్టర్ అయ్యాయి. అందువల్ల అలాంటి క్యారెక్టర్స్‌ను అన్నపూర్ణమ్మ, వై.విజయలుగా సినిమాలో చూపెట్టాం.

తదుపరి చిత్రాలు...

- ఇంకా ఏమీ అనుకోలేదు. పండుగకు ఊరెళ్లి ఎంజాయ్ చేసి.. మూడు వారాలు రిలాక్స్ అయ్యి.. ఓ జోనర్‌లో చేయాలనేది ఆలోచించుకుని చేస్తాను. బాలక ృష్ణగారికి కూడా ఓ ఐడియా చెప్పాను. ఈసారి ఫుల్ లెంగ్త్ కామెడీ చేయను. అయితే నా సినిమాల్లో ఫన్ లేయర్ లేకుండా ఉండదు.

'యమ్6' సెన్సార్ పూర్తి - ఫిబ్రవరి మొదటి వారం విడుదల



విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బ్యానర్స్‌పై విశ్వనాథ్ తన్నీరు నిర్మించిన చిత్రం 'యమ్6'. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని యు/ఎ సర్టిఫికెట్ పొందింది. ఈ సందర్భంగా నిర్మాత విశ్వనాథ్ తన్నీరు మాట్లాడుతూ 'మా 'యమ్6' చిత్రం సెన్సార్ పూర్తి చేసుకొని యు/ఎ సర్టిఫికెట్ పొందింది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా చాలా క్వాలిటీగా నిర్మించాం. ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే ఒక అద్భుతమైన కథని దర్శకుడు జైరాం అంతే అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమా ప్రతి ఒక్కరినీ అలరిస్తుంది. ఫిబ్రవరి మొదటి వారంలో ఈ సినిమాను విడుదల చేస్తున్నాం" అన్నారు.

దర్శకుడు జైరామ్‌వర్మ మాట్లాడుతూ "నిర్మాత విశ్వనాథ్‌గారు ఈ సినిమాను క్వాలిటీలో ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. ఎలాంటి హంగులు ఆర్భాటాలు లేకుండా సినిమాను నేచురల్‌గా తెరకెక్కించాం. ప్రత్యేకంగా పోరాట దృశ్యాలు మన కళ్ళముందే జరుగుతున్నట్లు ఉంటూ అందరినీ అలరిస్తాయి. ఇలాంటి సినిమాలు తమిళ, మలయాళ, కన్నడలో వచ్చేవి. ఇప్పుడు తెలుగు ప్రజలు కూడా ఈ రకమైన సినిమాల్ని ఎంజాయ్ చేయటం ఆనందంగా ఉంది. ఈ సినిమాని ఒక రకమైన ప్రయోగంలా భావించి తెరకెక్కించాము. చూసిన ప్రతి ఒక్కరూ థ్రిల్‌గా ఫీల్ అవుతూనే లవ్, కామెడీని బాగా ఎంజాయ్ చేస్తారు" అన్నారు.

హీరో ధ్రువ మాట్లాడుతూ "ఒక మంచి చిత్రం ద్వారా పరిచయం అవుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. నా టాలెంట్‌ను గుర్తించి నాకు ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు" అన్నారు ధ్రువ, అశ్విని, శ్రావణి, తిలక్, సాధన, అప్పలరాజు, హరిత, వంశీ, ఇంద్రతేజ నటించిన ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బాలాజీ, సినిమాటోగ్రఫీ: మహ్మద్ రియాజ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సురేష్, సమర్పణ: శ్రీమతి పార్వతి, నిర్మాత: విశ్వనాథ్ తన్నీరు, కథ–స్క్రీన్‌ప్లే–దర్శకత్వం: జైరామ్ వర్మ.

పండగ వేళ పెట్రో భారాలు



న్యూఢిల్లీ : పండగ వేళ ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రో భారాలు మరింత మోపాయి. మూడు రోజులుగా స్వల్పంగా పెరిగిన పెట్రో ఉత్పత్తుల ధరలు ఆదివారం మరింతగా భారమయ్యాయి. పలు చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్ ధరలను లీటర్‌కు 49 నుంచి 60 పైసల మధ్య, డీజిల్ ధరలు లీటర్‌కు 59 నుంచి 75 పైసల వరకు పెంచాయి. తాజా పెంపుతో హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ రూ.73.47కు ఎగబాకింది. ఇక డీజిల్ ధర లీటర్‌కు రూ.69.24కు చేరింది. దేశ రాజధాని ఢిల్లీలో పెట్రోల్ లీటర్ రూ.69.75కు పెరిగింది. డీజిల్ ధర లీటర్‌కు రూ.63.69కు చేరింది. ముంబైలో పెట్రోల్ ధర లీటర్ రూ.75.39 పలికితే, డీజిల్ ధర 62 పైసలు పెరిగి రూ.66.66కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరగడంతో పాటు ముడిచమురు ఉత్పత్తులను రోజుకు ఎనిమిదిలక్షల బారెల్స్‌కు పరిమితం చేయాలన్న సౌదీ అరేబియా నిర్ణయంతో పెట్రో ఉత్పత్తుల ధరలు భారమయ్యాయి.

ఇద్దరు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: ఓ కరడుగట్టిన ఉగ్రవాది సహా మరో ఉగ్రవాదిని ఆదివారం భద్రతా దళాలు హతమార్చాయి. వీరిలో అల్-బదర్ ఉగ్ర సంస్థకు చెందిన ఉగ్రవాది జీనత్-ఉల్-ఇస్లామ్ ఉన్నాడని పోలీసులు తెలిపారు. అతనితోపాటు మృతి చెందిన షకీల్ దార్ అనే ఉగ్రవాది కలిసి గతంలో అనేక ఉగ్ర నేరాలకు పాల్పడ్డట్లు తెలిపారు. వీరు 2015 నుంచి ఈ ప్రాంతంలో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అల్-బదర్ సంస్థను బలోపేతం చేసేందుకు గతేడాది నవంబరులో ఉగ్రవాది జీనత్-ఉల్-ఇస్లామ్.. హిజ్బుల్ ముజాహిదిన్ నుంచి ఈ సంస్థలో చేరాడని పోలీసులు వివరించారు. ఉగ్రవాదులు ఓ ఇంట్లో దాగి ఉన్నారన్న సమాచారం మేరకు కుప్వారా జిల్లా యారిపోరాలోని కత్‌పోరా ప్రాంతంలో పోలీసులు నిర్బంధ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. 'తొలుత ఉగ్రవాదులు భద్రతా దళాలపై కాల్పులు జరపడంతో ఎదురు కాల్పులు జరపాల్సి వచ్చింది. నిబంధనల ప్రకారం వారికి లొంగిపోయేందుకు అవకాశం కూడా ఇచ్చాం. అయినా వారు కాల్పులు ఆపలేదు' అని పోలీసులు వివరించారు.



అనికా చోప్రా

50 మంది సైనికులు ఫేస్'బుక్'

శ్రీనగర్ : ఫేస్‌బుక్ వేదికగా ఒకరిద్దరిని కాదు ఏకంగా 50 మంది జవాన్లను మోసం చేసిందో యువతి. ఆకర్షణీయమైన ఫొటోలను పోస్టు చేస్తూ వారిని ముగ్గులోకి దించింది. సైన్యానికి సంబంధించిన గోప్య సమాచారాన్ని, రహస్యాలను రాబట్టేందుకు యత్నించింది. ఆమె అందం వెనుక వికృతరూపం దాగి ఉందని తెలుసుకోలేకపోయిన ఓ జవాను అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చుకుంటూ వచ్చాడు. చీరకట్టులో కనిపించే ఆమెను చూసి భారతీయురాలని భావించి అత్యంత కీలకమైన సమాచారాన్ని చెప్పేశాడు. వాస్తవానికి ఆమె పాకిస్థానీ ఇంటెలిజెన్స్ ఏజెంటు. ఫేస్‌బుక్‌లో మాత్రం తన పేరును అనికా చోప్రాగా పేర్కొంది. మిలిటరీ నర్సింగ్ కార్ప్స్‌కి కెప్టెన్‌గా ప్రొఫైల్‌లో రాసుకుంది. 2016లో ఫేస్‌బుక్ ద్వారా సోమ్ వీర్ సింగ్‌కు పరిచయమైంది. తనకు ఆర్మీ అంటే ఇష్టమని, జవాన్లంటే గౌరవం అని చెప్పి అతడితో మాటలు కలిపింది. సోమ్‌వీర్‌తో సన్నిహితంగా మెలుగుతూ జవాన్లుండే స్థావరాల వివరాలను తెలుసుకోసాగింది. భార్యకు విడాకులిచ్చి తనని పెళ్లాడాల్సిందిగా ఆ జవానుపై ఒత్తిడి తెచ్చింది. ఈ విషయంలో అతడిని బెదిరించింది కూడా. కొద్ది రోజులక్రితం సోమ్‌వీర్ ప్రవర్తనను గమనించిన సహచర్లు పై అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో సోమ్‌వీర్ ఫోన్‌కాల్స్, సామాజిక మాధ్యమాలపై నిఘా ఉంచారు. అనికా చోప్రాతో జరిగిన సంభాషణను తెలుసుకున్నారు. భారత మిలిటరీకి సంబంధించి విలువైన సమాచారం, ఫొటోలు సోమ్‌వీర్ ఆమెకు పంపినట్లు గుర్తించారు. వెంటనే జవానును అదుపులోకి తీసుకొని విచారించారు. ఆమె సోమ్‌వీర్‌నే కాకుండా వివిధ స్థావరాల్లో ఉన్న 50 మంది జవాన్లకు వల వేసినట్టు తెలిసింది. జవాన్లతో చాట్ చేయడానికి ఒక్కొక్కరికి ఒక్కో సమయం కేటాయించినట్టు వెల్లడైంది. సోమ్‌వీర్ మాత్రం తనకేం తెలీదని ఆమె వ్యక్తిగత వివరాలను తానెప్పుడూ అడగలేదన్నాడు. ఆమె వ్యవహారంలో విచారణ కొనసాగుతోంది.

80 సీట్లలో ఒంటరి పోరే

ఉత్తరప్రదేశ్ ఎన్నికలపై గులాం నబీ ఆజాద్ వెల్లడి



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఆజాద్. పక్కన రాజ్ బబ్బర్ తదితరులు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఎస్‌పీ, బీఎస్‌పీ పొత్తు పెట్టుకొని కాంగ్రెస్‌ను దూరం చేశాయి. దీంతో తాము మొత్తం 80 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఆదివారం ప్రకటించింది. కాంగ్రెస్ యూపీలో తమ భవిష్యత్ కార్యాచరణపై వివరాలు తెలిపింది. ఆ పార్టీ సీనియర్ నేత, యూపీ ఇన్‌ఛార్జ్ గులాం నబీ ఆజాద్ ఈ విషయంపై తమ పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. తాము యూపీలో 80 స్థానాల్లోనూ పోటీ చేస్తామని, ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ పూర్తి సన్నద్ధంగా ఉందని ఆజాద్ చెప్పారు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ రాష్ట్రంలో సత్తా చాటిందని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా ఒంటరిగానే పోటీ చేసి అత్యధిక సీట్లు సాధిస్తామని ఆజాద్ ప్రకటించారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఇతర ఏ పార్టీతోనైనా పొత్తు పెట్టుకుంటుందా? అని ప్రశ్నించగా ఎస్‌పీ-బీఎస్‌పీతో పొత్తును తాము ఉద్దేశపూర్వకంగా వదులుకోలేదని, ప్రజలకి ఈ విషయం తెలుసని ఆజాద్ చెప్పారు. బీజేపీని ఓడించేందుకు తాము అన్ని పార్టీలతో కలిసి పోటీ చేస్తామని ఇంతకు ముందే చెప్పామని గుర్తుచేశారు. కానీ తమతో కలిసి రావాలని తాము ఎవరినీ ఒత్తిడి చేయలేమన్నారు. యూపీలో తమతో పొత్తుకు ఎస్‌పీ, బీఎస్‌పీ ముగింపు పలికారని, దీంతో తాము సొంతశక్తిని నమ్ముకునే బీజేపీపై పోరాడతామని వ్యాఖ్యానించారు. యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్‌బబ్బర్‌తో పాటు పలువురు నేతలతో లోక్‌సభ ఎన్నికలపై ఆజాద్ ఇటీవల చర్చలు జరిపారు. ఆదివారం కూడా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన రాష్ట్ర నేతలతో కూలంకుషంగా చర్చించారు.

పశ్చిమ యూపీపై కాంగ్రెస్ కన్ను

ఫిబ్రవరిలో రాహుల్ ర్యాలీలు



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఎస్‌పీ, బీఎస్‌పీ కాంగ్రెస్‌ను పక్కన పెట్టాయి. ఆ రెండు పార్టీలు సీట్ల సర్దుబాటు చేసుకున్నాయి. దీంతో కీలక రాష్ట్రం యూపీలో సొంతంగా పట్టు సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాలకు పదునుపెడుతోంది. 2019 సార్వత్రిక ఎన్నికల కోసం లౌకిక శక్తుల ఏకీకరణతో పాటు యూపీలో బలం పెంచుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. ఇందుకుగాను పార్టీ చీఫ్ రాహుల్ గాంధీ ఫిబ్రవరిలో పశ్చిమ యూపీలో ఏకంగా 15 ప్రచార ర్యాలీలను ఉద్దేశించి ప్రసంగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రైతుల సమస్యలను ప్రధానంగా లేవనెత్తుతూ ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో చేపట్టిన వ్యవసాయ రుణాల మాఫీని ప్రజల ముందుకు తీసుకువెళ్లేలా ఈ ర్యాలీలకు రూపకల్పన జరుగుతోందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. కేంద్రంలో నరేంద్ర మోడీ సర్కార్ వైఫల్యాలు, వ్యవసాయ సంక్షోభం, రైతుల దుస్థితిని ఈ ర్యాలీల్లో రాహుల్ ప్రజల ముందుంచనున్నారు. పశ్చిమ యూపీలోని హపూర్‌లో తొలి ర్యాలీని చేపట్టే రాహుల్ అనంతరం మొరదాబాద్, షహరాన్‌పూర్, బరేలీ ర్యాలీల్లో పాల్గొంటారు. యూపీలో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని అఖిలేష్, మాయావతి ప్రకటించడంతో యూపీపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని రాహుల్ పార్టీ నేతలకు సూచించారు. ఎస్పీ, బీఎస్పీలు రాజకీయ నిర్ణయం తీసుకున్నాయని, కాంగ్రెస్ యూపీలో పూర్తిసామర్థ్యంతో పోరాడుతుందని దుబాయ్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాహుల్ వ్యాఖ్యానించారు.

శబరిమల అంశంపై మాటమార్చిన రాహుల్

శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10 నుంచి 50 ఏళ్లలోపు మహిళల ప్రవేశంపై రాహుల్ గాంధీ తన ధోరణి మార్చుకున్నారు. గతంలో యువతుల ప్రవేశాన్ని సమర్థించిన రాహుల్.. సంప్రదాయ నిషేధాన్ని కొనసాగించేలా ప్రజల వద్ద ఆమోదించదగ్గ కారణాలే ఉన్నాయని తాజాగా అన్నారు. శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల మహిళల ప్రవేశంపై ఇరు వర్గాల వాదనలు తాను పరిశీలించానని, వారు ఆలయంలోకి ప్రవేశించాలా వద్దా అనేది తాను చెప్పబోనని, ఈ విషయాన్ని తాను ప్రజలకే వదిలేస్తున్నానని రాహుల్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు అన్ని వయసుల మహిళలను ఆలయంలోకి అనుమతించాలని తొలుత రాహుల్ కేరళ ప్రభుత్వానికి మద్దతిచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న బీజేపీ సహా.. ఇతర హిందుత్వ సంస్థల వాదనలను ఖండించారు. అయితే, శబరిమల అంశంలో రాహుల్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఎన్నికల వ్యూహంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

సీవీసీని తొలగించాలి : కాంగ్రెస్ డిమాండు

న్యూఢిల్లీ : సీబీఐ డైరెక్టర్ అలోక్ శర్మ తొలగింపు వివాదం నడుమ, ప్రధాన విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ)ని తక్షణం ఆ పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ ఆదివారం పేర్కొంది. ప్రభుత్వం చేతుల్లో ఒక 'తోలుబొమ్మ' మాదిరిగా ఆయన నటిస్తున్నాడని ఆరోపించింది. ఇక్కడ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడుతూ 'సీవీసీ(సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్)ని తొలగించాలి లేదా ఆయన తన పదవికి రాజీనామా చేయాలి' అని స్పష్టం చేశారు. అయితే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ లేదా కేంద్ర ప్రభుత్వం నుంచి వెంటనే ఎటువంటి స్పందన రాలేదు. రాఫెల్ కేసులో ఎటువంటి దర్యాప్తునైనా దూరంగా ఉంచేందుకు సీవీసీ కె.వి.చౌదరి ఒక 'తోలుబొమ్మ' మాదిరిగా పని చేస్తున్నాడని కాంగ్రెస్ ఆరోపించింది. 'ఆస్థానా(సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేష్ ఆస్థానా) కోసం లాబీయింగ్‌కు ప్రభుత్వానికి ఒక రాయబారి మాదిగా సీవీసీ పని చేస్తున్నారు' అని పేర్కొన్నారు. సీవీసీ ప్రజలకు మంచి చేయాలే కానీ రాజకీయ నాయకుల చేతిలో ఒక 'విజిలెంట్' బొమ్మగా ఉండకూడదని సింఘ్వీ విమర్శించారు.

హైకోర్టుల్లో 73 మందే మహిళా జడ్జిలు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో 670 మంది జడ్జిలు ఉండగా వారిలో 73 మందే మహిళా జడ్జిలని న్యాయమంత్రిత్వ శాఖ పార్లమెంటరీ కమిటీకి తెలిపింది. 2018 మార్చి 23 నాటికి 1,079 మంది ఉన్నారని అంతకు ముందు 670 మంది న్యాయమూర్తులే 24 హైకోర్టుల్లో పనిచేస్తున్నారని కేంద్రం తెలిపింది. గతేడాది మార్చి 23 నాటికి 10 శాతం మంది మహిళా జడ్జిలు పనిచేస్తున్నారని న్యాయమంత్రిత్వశాఖ తెలిపింది. మహిళా, వెనుకబడినవర్గాలు, ఎస్సీ, ఎస్టీల నుంచి జడ్జిలు చాలా తక్కువ మంది ఉన్నారని, హైకోర్టు చీఫ్ జడ్జిలు ఆయా వర్గాల వారిని న్యాయమూర్తులుగా నియామకాలు జరపాలని కేంద్రం ప్రతిపాదనలు పంపిందన్నారు. దీంతో అన్ని వర్గాల వారికి ప్రాతినిధ్యం లభిస్తుందని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఆరువారాల్లో ముఖ్యమంత్రి/ గవర్నర్‌లు ఈ నియామకాలు జరిపించడానికి వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవాలని కేంద్ర తేల్చిచెప్పింది. జనవరి 1 నుంచి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు వేర్వేరుగా హైకోర్టులు పనిచేస్తున్నాయి.

ఆరు నెలలుగా లైంగిక వేధింపులు

హిరాణీపై మహిళా దర్శకురాలి సంచలన వ్యాఖ్యలు



ముంబై : బాలీవుడ్ దర్శకుడు రాజ్ కుమార్ హిరాణీపై లైంగిక వేధింపుల ఆరోపణలు సంచలనం సృష్టి స్తున్నాయి. 'సంజు' సినిమాకు సహాయ దర్శకురాలిగా పనిచేసిన ఓ మహిళ.. సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్న సమయంలో హిరాణీ తనను లైంగికంగా వేధించాడని ఆరోపించారు. ఆరు నెలలుగా తనను వేధిస్తున్నాడని అన్నారు. ఈ విషయం గురించి ఆ మహిళ 'సంజు' సినిమా నిర్మాత విధు వినోద్ చోప్రాకు, అతని సోదరి, భార్యకు మెయిల్ పంపినట్లు ఓ పత్రిక తెలిపింది. ఆ మహిళ రాసిన మెయిల్‌లో.. 'సార్.. నా పట్ల చాలా పెద్ద తప్పు జరిగింది. హిరాణీ పేరుగల దర్శకుడు. నేను ఆయన అసిస్టెంట్‌ను మాత్రమే. నా పట్ల జరిగిన దారుణాన్ని చెప్పుకోలేను. ఆరోజు నా మనసు, శరీరం పాడై పోయాయి. ఆరు నెలల పాటు హిరాణీ నన్ను లైంగికంగా వేధించారు. కానీ నాకు వేరే అవకాశం లేదు. ఉద్యోగం పోగొట్టుకోలేక మౌనం వహించాల్సి వచ్చింది. ఒకవేళ ఈ ఉద్యోగం వదిలేసినా మరో ఉద్యోగం దొరకదేమోనన్న భయం, ఆయన నా పని తనం గురించి బయట తప్పుగా మాట్లాడతారేమోనన్న అనుమానం నన్ను మౌనం వహించేలా చేసింది' అని తెలిపింది. మరోవైపు, తనపై వస్తున్న ఆరోపణలను హిరాణీ ఖండించారు. హిరాణీ తరపు న్యాయవాది ఆనంద్ దేశాయ్ మీడియా ద్వారా మాట్లాడుతూ..'నా క్లయింట్‌పై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. ఎవరో కావాలనే ఇలా చేయిస్తున్నారని అన్నారు.

బీజేపీలో తీవ్ర అసంతృప్తి

నాయకులు, కార్యకర్తల్లో వణుకు : అఖిలేశ్



లక్నో : బీజేపీపై ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ నిప్పులు చెరిగారు. బీజేపీ అధిష్ఠానం ఇంతకు ముందెన్నడూ లేనంత అసంతృప్తితో కనపడుతోందని అఖిలేశ్ వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల కోసం యూపీలో ఎస్పీ-బీఎస్పీ మధ్య సీట్ల పంపిణీ ఒప్పందం కుదిరిన విషయం విదితమే. అఖిలేశ్ యాదవ్ ఆదివారం ట్విటర్ వేదికగా స్పందిస్తూ... యూపీలో ఎస్పీ-బీఎస్పీ కూటమిగా ఏర్పడటంతో బీజేపీ గెలుపుపై ఆ పార్టీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు ఆశలు వదులుకున్నారని అన్నారు. మేరా బూత్ సబ్సే మజ్బూత్ (నా పోలింగ్ బూత్.. చాలా శక్తిమంతమైనది) అనే నినాదంతో పనిచేయాలంటూ తమ కార్యకర్తలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచనలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. తమ రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరాక బీజేపీ కార్యకర్తలు 'నా పోలింగ్ బూత్ చీలిపోయింది' అని అంటున్నారని అఖిలేశ్ చురకలంటించారు. లోక్‌సభ ఎన్నికల ముందు తీవ్ర అసంతృప్తి చెందుతున్న ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఇప్పుడు మరో పార్టీ వైపు చూస్తున్నారని అఖిలేశ్ విమర్శించారు. కాగా, యూపీలో మొత్తం 80 లోక్‌సభ స్థానాలున్నాయి. ఎస్పీ, బీఎస్పీ 38 స్థానాల చొప్పున పోటీ చేయనున్నాయి. మిగిలిన స్థానాలను మిత్రపక్షాల కోసం వదిలేసింది. ఆ కూటమిలో తాము చేరతామని రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డీ) ఇటీవల తెలిపింది. ఆయా పార్టీలతో తాము చర్చలు జరుపుతున్నట్లు చెప్పింది. అయితే, ఆ పార్టీ కాంగ్రెస్‌తో కలిసే అవకాశం కూడా ఉన్నట్లు సమాచారం. ఆ పార్టీ యూపీ అధ్యక్షుడు ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ... ఒకే భావజాలం కలిగిన పార్టీలతో కలవడానికి తాము సిద్ధమని అన్నారు. ఆ పార్టీ కనీసం ఆరు స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తోంది. మరో వైపు, ప్రగతిశీల సమాజ్‌వాదీ పార్టీ లోహియా (పీఎస్‌పీఎల్) అధ్యక్షుడు శివపాల్ యాదవ్ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీకి వ్యతిరేకంగా ఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తే, తమ పార్టీకి గౌరవప్రదమైన సంఖ్యలో వారు సీట్లు ఇస్తే తాము తప్పకుండా ఆ కూటమిలో చేరతామని ఆయన ఇటీవల వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీతో పాటు తమ పార్టీ 'ఎస్పీ, బీఎస్పీ' ఏర్పాటు చేసిన కూటమిలో లేకపోవడంతో ఆయన కాంగ్రెస్‌తో కలవవచ్చని భావిస్తున్నారు. ఏ పొత్తులూ కుదరకపోతే తాము రాష్ట్రంలో 80 స్థానాల్లోనూ పోటీ చేస్తామని శివపాల్ మీడియాకు తెలిపారు.

మమ్మల్ని ఓడించే వారు లేరు

బీజేపీపై శివసేన విమర్శలు

ముంబై : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మాజీ మిత్రులతో ముందస్తు పొత్తులు కుదరనట్లయితే వారు దెబ్బతింటారని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై శివసేన ఆగ్రహం వ్యక్తం చేసింది. తమను ఓడించేవారు ఇంకా పుట్టలేదంటూ శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే ఆదివారం అమిత్ షా వ్యాఖ్యలను తిప్పికొట్టారు. శివసేన కేంద్రంలో, మహారాష్ట్రలో అధికార బీజేపీకి మిత్రపక్షంగా ఉంది. ఇక్కడి వోర్లీ ప్రాంతంలో ఒక బహిరంగ సభలో ఉద్ధవ్ ప్రసంగిస్తూ 'ఒకరి నుంచి నేను అటువంటి మాటలు విన్నాను. శివసేనను ఓడించే వారు ఇంకా పుట్టలేదు' అని పేర్కొన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు మోడీకి ఉన్న ఆదరణ ఇప్పుడు లేదని. శివసేనకు ఇప్పుడు అటువంటి ఆదరణ ఉన్నట్లు ఆయన చెప్పారు. ఎల్‌జేపీకి చెందిన రామ్‌విలాస్ పాశ్వాన్, జేడీ(యూ)కి చెందిన నితీష్ కుమార్ వంటి భాగస్వామ్యులు వ్యతిరేకిస్తున్నప్పుడు బీజేపీ రామమందిరాన్ని ఏవిధంగా నిర్మించగలని ఆయన ప్రశ్నించారు.

అవకాశవాద కూటమి

- సొంత సామ్రాజ్యమా?.. సాధికారతా?
- ఎస్పీ, బీఎస్పీ పొత్తుపై మోడీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : తమకు వ్యతిరేకంగా పలు పార్టీలు ఏర్పాటు చేస్తున్న మహాకూటమిని 'అవకాశవాద కూటమి' అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తమిళనాడులోని బీజేపీ కార్యకర్తలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 'వారు తమ సొంత సామ్రాజ్య నిర్మాణం కోసం పనిచేస్తున్నారు. కానీ, మేము ప్రజల సాధికారత కోసం పనిచేస్తున్నాం. ప్రతి పక్షాలది తమ అవసరాల కోసం ఏర్పాటు చేసుకుంటున్న స్వల్ప కాలిక కూటమి. ఇతర పార్టీల్లా మేము ఓటు బ్యాంకు కోసం.. విభజించు, పాలించు అనే విధానాన్ని పాటించట్లేదు. అన్ని రంగాల్లోనూ దేశానికి సేవ చేయాలనే ఉద్దేశంతో పని చేస్తున్నాం. మన అభివృద్ధి అజెండాను మరింత ముందుకు తీసుకెళ్లాల్సి ఉంది. వచ్చే లోక్‌సభ ఎన్నికలు బీజేపీకి, దేశానికి చాలా ముఖ్యమైనవి' అని మోడీ చెప్పుకొచ్చారు. 'ఓ వైపు అభివృద్ధి అజెండాతో బీజేపీ పనిచేస్తోంది. మరోవైపు అవకాశవాద కూటమి, రాజవంశ పార్టీలు ఉన్నాయి. తానుగానీ, ప్రభుత్వంగానీ సమర్థమంతంగా పని చేయట్లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మరి మమ్మల్ని ఓడించేందుకు కూటమిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏముంది? ప్రభుత్వం సమర్థంగా పని చేస్తుందని వారికి తెలుసు. వారిపై వారికి నమ్మకం లేదు. ప్రభుత్వం సరిగ్గా పని చేయట్లేదని అసత్య ప్రచారం చేయడానికి వారు ఏ అవకాశాన్నీ వదులు కోవట్లేదు. యువత, రైతులు, మహిళలతో పాటు సమాజంలోని ప్రతి వర్గానికి ఎన్డీఏ ప్రభుత్వంపై నమ్మకం ఉంది. మొదటిసారి ఓటు వేసే వారు సహజంగానే బీజేపీకి మద్దతు తెలుపుతారు. వారికి రాజవంశ రాజకీయాలపై కాకుండా అభివృద్ధిపైనే ఆసక్తి ఉంటుంది. హామీలు ఇచ్చే వారికి కాకుండా పనిచేసే వారికి మద్దతు తెలుపుతారు' అని మోడీ నమ్మబలికారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి చెప్పాలని కార్యకర్తలకు మోడీ సూచించారు. 'కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే డబ్బు పడుతోంది. మధ్యలో ఎటువంటి అవకతవకలు జరిగే అవకాశం లేదు. వస్త్ర పరిశ్రమ రంగంలో తమిళనాడు ప్రసిద్ధి చెందింది. మేము ఆ పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకున్నాం. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు మేము ప్రాధాన్యతనిస్తున్నాం. రానున్న ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుంది. అది తన వల్లో, ఇతర ఏ నాయకుడి వల్లో కాదు. బీజేపీ కార్యకర్తల వల్ల మాత్రమే సాధ్యపడుతుంది. దేశ ప్రయోజనాల కోసమే మన కార్యకర్తలు పనిచేస్తారు. వారికి సొంత ప్రయోజనాల కన్నా దేశ ప్రయోజనాలే ముఖ్యం' అని అన్నారు.

గురుగోవింద్ సింగ్ స్మారక నాణెం విడుదల



సిక్కుల పదవ గురువు గురు గోవింద్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన స్మారక నాణేన్ని ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం విడుదల చేశారు. లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు సిక్కు నేతలు పాల్గొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సైతం హాజరయ్యారు. నరేంద్ర మోడీ 2017 జనవరి 5న పాట్నాలో జరిగిన గురుగోవింగ్ సింగ్ 350వ జయంత్యుత్సవాల్లోనూ పాల్గొన్నారు. గురుగోవింద్ సింగ్ స్మారక తపాలా బిళ్లను విడుదల చేశారు. ఖల్సా పంథా, ఐదు ప్యారాల ద్వారా దేశాన్ని సమైక్యంగా ఉంచేందుకు గురుగోవింద్ సింగ్ చేసిన సేవలను మోడీ కొనియాడారు.

మహారాష్ట్రలో రైతాగ్రహం



- బకాయిల చెల్లింపులో జాప్యంపై నిరసన
- సుగర్ ఫ్యాక్టరీలు ముట్టడించిన కర్షకులు
- కనీస మద్దతు చెల్లించాలని డిమాండు

ముంబై : మహారాష్ట్రలో అన్నదాతలు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కడుపు కొడితే ఊరుకునేది లేదంటూ ఆందోళనకు దిగారు. చెరకు రైతులు బకాయిల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ సతారా, సంగ్లీ, కొల్హాపూర్ జిల్లాల్లోని చక్కెర ఫ్యాక్టరీల కార్యాలయాలను ముట్టడించారు. రైతులు జనవరి 11 శుక్రవారం సతారాలోని కరాడ్ వద్ద కృష్ణా సుగర్ ఫ్యాక్టరీ కార్యాలయాన్ని దగ్ధం చేశారు. కొన్ని ముఖ్యమైన పత్రాలు, కంప్యూటర్లు, ఫర్నీచర్ కాలిపోయాయి. కాగా కరాడ్ గ్రామీణ పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులపై నేరాలు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే పొరుగునే ఉన్న సంగ్లీలోని మరో చక్కెర ఫ్యాక్టరీ కార్యాలయాన్ని కూడా శనివారం ఉదయం దగ్ధం చేసినట్లు ఇస్లాంపూర్ పోలీసుస్టేషన్ అధికారి ఒకరు చెప్పారు. అనేక పత్రాలు, కంప్యూటర్లు దగ్ధమైన సుగర్ ఫ్యాక్టరీ కార్యాలయం వద్ద జరిగిన ఈ ఘటనపై కొంత మంది సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారన్నారు. ఇదిలాఉండగా నిరసనకారులు సంగ్లీలోని వాల్వా వద్ద క్రాంతి సుగర్ ఫ్యాక్టరీ కార్యాలయాన్ని ధ్వంసం చేసి నిప్పటించినట్లు అధికారులు తెలిపారు. ఐపీసీ సెక్షన్ల క్రింద ఈ ఘటనకు పాల్పడిన వారిపై నేరాలు నమోదు చేశామని, అయితే ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని వివరించారు. కాగా శనివారం మధ్యాహ్నం కొల్హాపూర్‌లోని షిరోలి వద్ద గురు దత్తా సుగర్ ఫ్యాక్టరీ కార్యాలయం సమీపంలో రైతులు సమావేశమై తమ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండు చేశారు. స్థానిక రైతు సంఘాలకు చెందిన నిరసనకారులు ఫ్యాక్టరీ కార్యాలయం తాళాన్ని పగులగొట్టి అందులోని ఫర్నీచర్, కంప్యూటర్లు, స్టేషనరీ, ఇతర సామాగ్రిని ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి సుమారు 65 మందిపై నేరాభియోగాలు నమోదు చేసినట్లు షిరోలి పోలీసులు తెలిపారు.

విశాలాంధ్ర
విజయవాడ, సోమవారం 14, జనవరి 2019



స్కూల్‌గేమ్స్ సెపెక్‌తక్రా నేషనల్ చాంపియన్ ఏపీ

విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్ : విజయవాడలో ఉత్కంఠగా సాగిన 64వ జాతీయస్థాయి సెపెక్‌తక్రా స్కూల్‌గేమ్స్ బాలుర విభాగం చాంపియన్‌షిప్‌ను ఆంధ్రప్రదేశ్ జట్టు కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో ఒడిశా, మూడవ స్థానంలో తెలంగాణ, నాల్గవ స్థానంలో మహారాష్ట్ర జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో ఒడిశా జట్టు చాంపియన్‌గా నిలిచింది. మహారాష్ట్ర జట్టు ద్వితీయ స్థానంలో, మూడవ స్థానంలో తెలంగాణ, నాల్గవ స్థానంలో ఢిల్లీ జట్లు నిలిచాయి. విజయవాడ ఎస్‌కేపీవీ హిందూ హైస్కూల్‌లో ఈ నెల 10 నుంచి 13 వరకు కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు కొనసాగిన జాతీయ స్థాయి పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఎనిమిది రాష్ట్రాల నుంచి 80 మంది క్రీడాకారులు, 16 మంది టెక్నికల్ అఫీషియల్స్, 32 మంది శిక్షకులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చుక్కల్లి అరుణ్‌కుమార్ ముగింపు వేడుకలో కష్టసాధ్యమైన ఈ ఆటలో రాణిస్తున్న క్రీడాకారులను అభినందనీయులని కొనియాడారు. విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాల కార్యదర్శి మద్ది సుబ్బారావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.రమేష్, కృష్ణాజిల్లా స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.లక్ష్మీకుమారి, టోర్నీ అబ్జర్వర్ కోష్లి, రిఫరీ సురేష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

10 శాతం 'రిజర్వేషన్ చట్టం' రద్దు చేయాలి



విశాలాంధ్ర - విశాఖ సిటీ : రాజ్యాంగ సవరణను అడ్డంపెట్టుకొని ఓట్ల కోసం రిజర్వేషన్ల స్ఫూర్తికి విరుద్ధంగా తెచ్చిన ఆర్థిక వెనుకబాటు 10 శాతం రిజర్వేషన్ చట్టాన్ని రద్దు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ డిమాండ్ చేశారు. విశాఖలోని పౌరగ్రంథాలయంలో డీహెచ్‌పీఎస్, దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ తరతరాలుగా కుల వివక్షకు, అణచివేతకు గురైన అట్టడుగు కులాలు ప్రజలకు మాత్రమే రాజ్యాంగం రిజర్వేషన్ల సౌకర్యం కల్పించిందన్నారు. రిజర్వేషన్లు 50 శాతం మించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసినా ప్రధాని నరేంద్రమోడీ ఈ బిల్లు తీసుకురావడం దుర్మార్గమన్నారు. ప్రైవేటురంగంలో రిజర్వేషన్ల బిల్లుకు గత 13 ఏళ్ళుగా పౌర సమాజం చర్చిస్తున్నా కనీసం నోరువిప్పని ప్రధాని అర్థాంతరంగా అగ్రవర్ణాల కోసం బిల్లు తీసుకొచ్చారని దుయ్యబట్టారు. ఐక్య వేదిక కన్వీనర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వాస్తవ జనాభా ఆధారంగా రిజర్వేషన్లను 70 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. పేదరికంలో రోజుకు 32 రూపాయలు కూడా కనీస సంపాదన లేని ఎస్సీ, ఎస్టీల పిల్లలకు ప్రైవేటు స్కూళ్లలో రిజర్వేషన్లు లేవన్నారు. లక్షల ఆదాయం పొందే అగ్రవర్ణాలకు నేడు ప్రైవేటు విద్యలో కూడా రిజర్వేషన్లు ఇవ్వడం ఆరెస్సెస్ కుట్రే అన్నారు. కార్యక్రమంలో ఎం.సత్యనారాయణ, జి.రాంబాబు, డాక్టర్ ఆదన్న, షారోనరాజు, రాంప్రభు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై బ్లేడ్ బ్యాచ్ దాడి

విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్) : ఏఆర్ కానిస్టేబుల్ పై బ్లేడ్ బ్యాచ్ సభ్యుడు దాడి చేసిన ఘటన స్థానిక సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. శనివారం అర్ధరాత్రి ఏఆర్ కానిస్టేబుల్ లక్ష్మయ్య విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో బ్లేడ్ బ్యాచ్ సభ్యుడు మల్లెల రవికుమార్ అలియాస్ జబల్‌పురి (35) మద్యం సేవించి వీరంగం సృష్టిస్తున్నాడు. అక్కడ ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ మందలించడంతో రవికుమార్ తిరగబడి కానిస్టేబుల్ ఎడమ భుజం పై గట్టిగా కొరకటంతో స్వల్ప గాయమైంది. రవికుమార్ అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించగా, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏఆర్ కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించారు. దీనిపై సత్యనారాయణపురం పోలీసులు విచారణ జరుపుతున్నారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కండి



విశాలాంధ్ర - డోన్/తుగ్గలి రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా తుగ్గలి మండలంలోని రాంకొండ, రాంపల్లి, ఆర్‌ఎస్ పెండేకల్ గ్రామాల్లో జరిగిన పార్టీ సమావేశాల్లో పి.రామచంద్రయ్యతోపాటు రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి గురుదాస్ ప్రసంగించారు. రామచంద్రయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు మోడీ, చంద్రబాబు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చినా అమలు చేయకపోవడం మోసమేనన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో మోడీ నల్లధనం ఊసే ఎత్తలేదన్నారు. పెద్దనోట్ల రద్దు పేరుతో కుబేరులకు పెద్దపీట వేశారన్నారు. తినే తిండిపై ఆంక్షలు పెట్టి దళితులు, ముస్లిం, మైనార్టీలపై బీజేపీ నాయకులు దాడిచేయడం బాధాకరమన్నారు. జగన్నాథం, గురుదాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పచ్చ చొక్కా నేతలకే పనులు జరుగుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల్లో తెలుగు తమ్ముళ్ల అవినీతి కంపు కొడుతోందన్నారు. జిల్లాలో కరవు మండలాలు ప్రకటించినా ఎలాంటి సహాయక చర్యలు చేపట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై పోరాటాలు తీవ్రతరం చేయడం ద్వారా వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు సుల్తాన్, మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, శాఖా కార్యదర్శులు లాలప్ప, క్రిష్ణమూర్తి, ఉమాపతి, రామిరెడ్డి, పీరా, సూరి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 19న మాదిగల విశ్వరూప సభ



విశాలాంధ్ర - మంగళగిరి : ఆంధ్రప్రదేశ్‌లో మాదిగల ఆత్మ గౌరవాన్ని చాటే విధంగా గతంలో నిర్వహించిన కురుక్షేత్రం తరహాలోనే ఫిబ్రవరి 19వ తేదీన మాదిగల విశ్వరూప మహాసభ మంగళగిరిలో నిర్వహించబోతున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ తెలిపారు. మంగళగిరి ఎంఎంకె. స్టేడియంలో ఆదివారం జరిగిన విలేఖరుల సమావేశంలో కృష్ణ మాదిగ మాట్లాడుతూ 10 లక్షల మందితో సభ నిర్వహించబోతున్నామని తెలిపారు. తెలంగాణలో ఎస్సీ రిజర్వేషన్‌కు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాయకులు మద్దతు పలికి ఇక్కడ మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. గతంలో కురుక్షేత్ర సభకు అనుమతి నిరాకరించారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం ఎస్సీలు నిర్వహించిన సభకు హాజరయ్యారని తెలిపారు. 2019 ఎన్నికల్లో తమ జాతి పట్ల ఏ పార్టీ అనుకూలంగా ఉంటుందో వారికి తమ మద్దతు ఉంటుందని అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 10 శాతం రిజర్వేషన్‌కు తమ నుంచి పూర్తి మద్దతు ఉంటుందన్నారు. దేశంలో అనేక మంది ప్రధాన మంత్రులు ఓసీ వర్గం నుంచి వచ్చినప్పటికీ జాతికి ఎలాంటి ప్రయోజనం చేయలేదని, బీసీ వర్గం నుంచి వచ్చిన మోడీ ఓసీలో ఉన్న వెనుకబడిన వర్గాలను గుర్తించి 10 శాతం రిజర్వేషన్ కల్పించడం సంతోషకరమన్నారు. ఫిబ్రవరి 19వ తేదీన జరిగే మాదిగల విశ్వరూప మహాసభకు ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు కలిగించినా తాము మాత్రం సభ నిర్వహిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

శీతలీకరణ గోదాములో మంటలు



గోదాము నుంచి బయటకొస్తున్న పొగలు

విశాలాంధ్ర - కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలోని శీతలీకరణ గోదాములో ఆదివారం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గోదాము వెనుక వైపు కిటికీల నుంచి ఒక్కసారిగా మంటలు బయటకు వ్యాపించడంతో సిబ్బంది హడలిపోయారు. అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి సమాచారమివ్వడంతో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. గోదాములో చిన్నపిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు అందించే వ్యాక్సిన్‌తోపాటు పోలియో వాక్సిన్ పూర్తిగా దగ్ధమయ్యింది. ఫర్నిచర్, ఆఫీస్ రికార్డులు, ఫైళ్లు, బీరువాలు, ఏసీలు కాలిపోయాయి. కేవలం వ్యాక్సిన్ విలువ దాదాపు రూ.40 లక్షల వరకు ఉండొచ్చని డీఐవో వెంకటరమణ తెలిపారు. జిల్లా కలెక్టర్ సత్యనారాయణ ఘటనా స్థలిని పరిశీలించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే అజెండా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా పనిచేస్తామని ఏపీఎన్జీవోస్ నూతన అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎన్.చంద్రశేఖరరెడ్డి, బండి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని ఏపీఎన్జీవోస్ హోమ్‌లో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ దాదాపు ఐదు లక్షల మంది ఉద్యోగులు, నాలుగు లక్షల మంది పెన్షనర్ల సంక్షేమం కోసం పనిచేస్తామన్నారు. ఉద్యోగులకు 35శాతం మధ్యంతర భృతి, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగభద్రత, పదవీవిరమణ ఉద్యోగులకు గృహాలు, స్థలాల తదితర సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్‌కార్డులపై పూర్తిస్థాయి వైద్యసేవలు అందించేలా కార్పొరేట్ యాజమాన్యాలకు ప్రభుత్వం ఆదేశాలివ్వాలని డిమాండు చేశారు. సమావేశంలో ఏపీఎన్జీవోస్ పూర్వపు అధ్యక్షుడు పి.అశోక్‌బాబు పాల్గొన్నారు. ఇప్పటివరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన పి.అశోక్‌బాబు స్వచ్ఛందంగా పదవీవిరమణ చేయడంతో రాష్ట్ర అధ్యక్షపదవికి ఖాళీ ఏర్పడింది. ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ భవన్‌లో కార్యవర్గ సమావేశంలో చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పండగ పూట సిక్కోలు పల్లెల కన్నీరు

- సంక్రాంతి శోభ కోల్పోయిన గ్రామీణ ప్రాంతాలు
- శోకం మిగిల్చిన తిత్లీ తుపాను

తిత్లీ తుపాను మిగిల్చిన చేదు జ్ఞాపకాల నుంచి నేటికీ కోలుకోలేని సిక్కోలు జిల్లా రైతాంగం పెద్ద పండగ సంక్రాంతి వేళ కన్నీరుపెడుతోంది. పండగ పూట కూతురు, అల్లుడిని పిలిచినా కనీసం మనవడికి కొత్తబట్టల మాటకేమో గానీ కడుపునిండా తిండి కూడా పెట్టే పరిస్థితి లేదని కంట తడిపెడుతున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో పండగ శోభ కానరావడం లేదు.



నేలకొరిగిన కొబ్బరి పంట (ఫైల్ ఫొటో)



దెబ్బతిన్న గృహాలు(ఫైల్ ఫొటో)

విశాలాంధ్ర - శ్రీకాకుళం : సంక్రాంతి శోభతో కళకళలాడాల్సిన గ్రామీణ పల్లెలు జీవం కోల్పోయి కన్నీరు పెడుతున్నాయి. మూడు నెలల క్రితం నిట్టనిలువునా ముంచిన తిత్లీ తుపాను బీభత్సం మిగిల్చిన కష్టాలు ఇంకా కళ్ళముందే కదలాడుతుండటంతో శ్రీకాకుళం గ్రామీణ ప్రాంతాల్లో నైరాశ్యం రాజ్యమేలుతోంది. ఈ ఏడాది వ్యవసాయం కలిసిరాకపోవడం, తుపాను దెబ్బకు పంటల దిగుబడి తగ్గిపోవడం, అరకొర వచ్చిన దిగుబడులకు గిట్టుబాటు ధర వంటి సమస్యలతో రైతాంగం సతమతమవుతోంది. ఆర్థిక, వ్యవసాయ తదితర రంగాల్లో వెనుకబడ్డ శ్రీకాకుళం జిల్లాలో ఉపాధి దొరక్క, ఉద్యోగాలు లేక ఏటా ప్రజలు వలస పోవడం ఆనవాయితీగా మారింది. ఈ క్రమంలో కూలీల వలసలను నియంత్రించే లక్ష్యంతో ఆవిర్భవించిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కూడా గ్రామీణుల కనీస అవసరాలు తీర్చలేకపోవడంతో గడ్డు పరిస్థితి నెలకొంది. ఈసారి కూలీలను పక్కనపెట్టి భారీ యంత్రాలతో పనులు పూర్తి చేయాలన్న నిర్ణయాలు గ్రామీణ పేదల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపాయి. దీనికి తోడు కొద్దినెలల నుంచి ఉపాధి కూలీలకు వేతనాలు మంజూరు కాకపోవడంతో ఆర్థిక సమస్యలు తీవ్రంగా మారాయి. ఈ నేపథ్యంలో తిత్లీ తుపాన్ సిక్కోలు రైతాంగానికి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. జీడి, మామిడి, కొబ్బరి తదితర పంటలకు ప్రతీకగా నిలిచిన ఉద్దానం తుపాన్ తాకిడికి కకావికలమైంది. ఈ ప్రాంత ప్రజలకు ప్రధాన జీవనాధారామైన కొబ్బరి, మామిడి, జీడి తోటలు ధ్వంసం కావడంతో పంటల దిగుబడి భారీగా పడిపోయింది. ఎకరాకు 25 బస్తాల వరకు ధాన్యం దిగుబడి రావాల్సినా 10 బస్తాలు పండటం, దానిని కూడా నాణ్యతాలోపంతో దళారులు తక్కువరేటుకు కొనుగోలు చేయడంతో సిక్కోలు రైతులకు ఈ ఏడాది అప్పులే మిగిలాయి. తుపానులో నష్టపోయిన రైతులను ఆదుకున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో నష్టపరిహారం నిజమైన బాధితులకు అందలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తుపాను, వ్యవసాయ సంక్షోభంతో గ్రామీణ ప్రాంతాలు బోసిపోతున్నాయి. ఇదిలా ఉండగా జిల్లా నుంచి ఉపాధి, ఉద్యోగం, వ్యాపారం కోసం విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, చెన్నై వంటి నగరాలకు వెళ్ళిన ప్రజలు సొంత ఊళ్లకు చేరుకుంటున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. తిత్లీ తుపాను రూపంలో రైతాంగంపై ప్రకృతి కన్నెర్ర చేయడంతోపాటు పాలకుల వాగ్దానాలు నీటిమూటలుగా మిగిలిపోయాయి. ఈ ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి శోభ కానరావడం లేదు.



ఆదివారం టోల్ వసూళ్లతో నిలిచిన వాహనాలు

టోల్ వసూళ్లు యథాతథం

విశాలాంధ్ర బ్యూరో - శ్రీకాకుళం : సంక్రాంతి పండగ నేపథ్యంలో జాతీయ రహదారులపై టోల్‌గేట్ రుసుం వసూళ్లను మూడురోజులపాటు నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినా శ్రీకాకుళం జిల్లాలో యథాతథంగా వసూలు చేశారు. జిల్లాలోని చిలకపాలేం, మడపాం, లక్ష్మీపురం (పలాస), ఇచ్ఛాపురం నాలుగు టోల్‌గేట్ల వద్ద ఆయా యాజమాన్యాలు దండించి వసూళ్లు చేశాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఈ నిబంధన తీసుకువచ్చినప్పటికీ టోల్‌ట్యాక్స్ వసూళ్లతో వందలకొద్దీ వాహనాలు టోల్‌గేట్ల వద్ద బారులుతీరాయి. వాహనదారులు వసూళ్లపై ప్రశ్నించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సమాచారం రాలేదని, అయినా టోల్ వసూలు అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని సమాధానమిచ్చారు. దీంతో ప్రభుత్వ ప్రకటనకు విలువ లేనట్టైంది.

ఏరో స్పోర్ట్స్ ఫెస్టివల్ సందడి



విశాలాంధ్ర - సీతంపేట : శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఏరో స్పోర్ట్సు ఫెస్టివల్‌ను ఆదివారం జిల్లా కలెక్టర్ కె.ధనంజయరెడ్డి ప్రారంభించారు. హాట్ ఎయిర్ బెలూన్‌లో కలెక్టర్‌తోపాటు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి లోతేటి శివ శంకర్ విహరించారు. సాహస క్రీడల నిర్వహణ రాష్ట్ర, జిల్లా చరిత్రలోనే వినూత్నమని కలెక్టర్ అన్నారు. మూడు రోజులపాటు కొనసాగే ఏరో స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో పారా మోటారింగ్ సాధనాలు, హాట్ ఎయిర్ బెలూన్లు, పారా సైలింగ్ సాధనాలు, రిమోట్ కంట్రోల్ ఫ్లైయింగ్ సాధనాలు పాల్గొంటున్నాయి. దేశం నలుమూలల నుంచి 15 మంది పైలెట్లు భాగస్వామ్యమవుతున్నారు. ఐటీడీఏ ద్వారా పారా మోటారింగ్‌లో శిక్షణ పొందిన ఇద్దరు గిరిజన పైలెట్లు ఉన్నారు. ఈ పైలట్లతోపాటు 40 మంది సహాయక సిబ్బంది పాల్గొంటున్నారు. ఐటీడీఏ పీవో శివశంకర్ మాట్లాడుతూ సాహస క్రీడలకు ఇప్పటికే 270 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. మూడు రోజులు ప్రజలు వీక్షించేలా ఉదయం, సాయంత్రం పారామోటారింగ్, రిమోట్ కంట్రోల్ ఫ్లైయింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పైలెట్ల సహాయంతో ప్రజలు స్వయంగా పారా మోటార్, హాట్ ఎయిర్ బెలూన్, పారా సైలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఫ్లైయింగ్ చేసేందుకు ఐటీడీఏ సీతంపేట టూరిజం.కాం వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన కౌంటర్ల ద్వారా నమోదు చేసుకోవచ్చని సూచించారు. పర్యాటకులకు, సాహస క్రీడల్లో పాల్గొనేవారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కలమట వెంకట రమణ మూర్తి, సెట్‌శ్రీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి.వి.ప్రసాదరావు, జిల్లా క్రీడల అభివృద్ధి సంస్థ అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, ఇంటాక్ కన్వీనర్ కె.వి.జె. రాధాప్రసాద్, ఆంధ్ర బ్యాంకు జోనల్ మేనేజర్ కె.రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మోడీని గద్దె దించుతాం

విశాలాంధ్ర - గుంటూరు : ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రధాని మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు దేశంలోని అన్ని కార్మిక సంఘాలు సిద్ధమవుతున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చలసాని వెంకట రామారావు పేర్కొన్నారు. స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ దేశ వ్యాపితంగా ఈ నెల 8, 9 తేదీలలో జరిగిన సమ్మెలో 20 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత కార్మికులు పాల్గొన్నారని, పరోక్షంగా మరో 30 కోట్ల మంది మద్దతు తెలియజేశారని పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి కార్మికులకు చట్టాలు వర్తించకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తున్నదని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను తొలగించి, యాజమాన్యాలకు బానిసలుగా మార్చాలని మోడీ ప్రయత్నిస్తున్నారన్నారు. కార్పొరేట్‌లకు అనుగుణంగా విధానాలు మార్చి కార్మికుల హక్కుల మీద దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ వర్గాలకు రాయితీలు కల్పిస్తూ పెంచి పోషిస్తున్నారన్నారు. గడిచిన నాలుగున్నరేళ్ళలో రూ.9.30 లక్షల కోట్లను కార్పొరేట్ శక్తులకు రాయితీలుగా ఇస్తున్నట్లు ప్రభుత్వమే చెబుతున్నదన్నారు. మోడీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. కార్మికుల హక్కుల కోసం భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలకు కార్యాచరణ రూపొందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, జిల్లా గౌరవాధ్యక్షులు చల్లా చిన్న అంజనేయులు, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ రావుల అంజిబాబు, ఏఐటీయూసీ నాయకులు రమణయ్య, సురేష్, శాంతి, బాలయ్య, రవి, శ్రీను, బుజ్జి మారుతి, మాల్యాద్రి, వరాహులు తదితరులు పాల్గొన్నారు.

'డీఎస్సీ' ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తేనే అందరికీ న్యాయం

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు జోసఫ్ సుధీర్‌బాబు



విశాలాంధ్ర - గుంటూరు జిల్లాపరిషత్ : డీఎస్సీ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించడం వల్ల ఇబ్బందులు ఉన్నాయని, ఆఫ్‌లైన్‌లో అయితే అందరికీ న్యాయం జరుగుతుందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు అన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలో నిర్వహించిన డీఎస్సీ నమూనా పరీక్షలో ప్రతిభ కనబర్చిన అభ్యర్థుల అభినందనసభ ఆదివారం స్థానిక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు వి.వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా సుధీర్‌బాబు మాట్లాడుతూ డీఎస్సీ నమూనా పరీక్షకు అభ్యర్థుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధ్యాయ ఉద్యోగం కోసం తీవ్ర పోటీ ఎదుర్కొంటున్న అభ్యర్థులు మనోధైర్యం, సమయస్ఫూర్తితో విజయం సాధించాలన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా వ్యాపితంగా తొమ్మిది కేంద్రాల్లో నమూనా పరీక్షకు 900 మంది హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. గుంటూరు పరీక్ష కేంద్రంలో అందరి కంటే ఎక్కువ మార్కులతో ఏ.మాధవి ప్రథమ స్థానం, షేక్ గౌస్ బాషా ద్వితీయ స్థానం, ఎస్.దుర్గాభవాని తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలను అతిథుల సమక్షంలో అభినందించారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు, అనిల్ కుమార్, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

కుళాయి నీరు కలుషితం

- విశాఖ నగరంలో పైప్‌లైన్ లీకులు
- నీటి నిండా నాచు
- ఆందోళనలో నగరవాసులు

విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : మహా విశాఖ నగర పాలక సంస్థ అందిస్తున్న కుళాయి నీరు కొన్ని చోట్ల కలుషితం కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అనేక చోట్ల లీకులు ఏర్పడడంతోపాటు నీటినిండా నాచు రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఏళ్లతరబడి వున్న పైపులైన్లు మార్పు చేయకపోవడంతో మురుగునీరు, కాలువల పక్కనే మంచినీటి కుళాయి పైపులు ఉండడంతో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయి. ప్రధానంగా వన్‌టౌన్ జోన్ 3 ప్రాంతంలో ఎక్కువగా కలుషిత నీరు తరచు కనిపిస్తుందని ప్రజలు అంటున్నారు. నగరంలో 3లక్షలకు పైగా కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. స్వచ్ఛ భారత్, ఆరోగ్యాంధ్రప్రదేశ్ అంటూ పిలుపునిస్తున్న జీవీఎంసీ అధికారులు స్వచ్ఛనీటిని అందించడంలో విఫలమౌతున్నారని ప్రజలు వాపోతున్నారు. సామాన్య రోజుల్లోనే తీవ్ర నీటి కాలుష్యాన్ని ఎదుర్కొంటున్న నగర జనం తుపానులు, వర్షాలు వస్తే మరింత కలుషిత నీటిని సేవించక తప్పడం లేదు. నగరంలోని పలు ప్రధాన రహదారులు, వీధుల్లో జీవీఎంసీ నీటి సరఫరా అయ్యే పైపు లైన్లు లీక్ కావడం, పలు పైపులైన్లు మురుగు కాలువల గుండానే ఏర్పాటు చేసిఉండడంతో వర్షం నీరు, చెత్తాచెదారం అంతా పైపుల్లో చేరుకొని నివాసాలకు సరఫరా అయ్యే కుళాయి నీరు చెత్తాచెదారం, నాచుతో కూడి ఉంటోంది. సాధారణంగా కుళాయినీరు ప్రారంభంలో కొంతసేపటివరకు చెత్తాచెదారంతోపాటు నాచు వస్తుంది. ఈ కారణంగా పలుచోట్ల వినియోగదారులు తొలుత కొంత సేపటి వరకు నీటిని వృధాగానే విడిచిపెట్టి, ఆ తరువాత తమ అవసరాల కోసం మంచినీటిని పట్టుకునేవారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కుళాయి గుండా పూర్తిగా చెత్తాచెదారం మిళితమైన నీటిధార రావడంతో వినియోగ దారులు ఆందోళన చెందుతున్నారు. కుళాయి నీరు పలు చోట్ల రంగు మారడం, ఫిల్టర్లతో వడగడితే ఫిల్టర్ నిండా నాచు వుండడమే కాకుండా సూక్ష్మపరిమాణాలతో చెత్త ఇంకా నీటిలోనే ఉండడం గమనార్హం. కుళాయి నీరంతా కలుషితమై జనాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. జీవీఎంసీ నీటిసరఫరా విభాగం అధికారులు జీవీఎంసీ నీటిని కనీసం క్లోరినేషన్ కూడా చేయడం లేదన్న వాదన వినిపిస్తోంది. నీటిని సమృద్ధిగా సరఫరా చేస్తున్నామంటూ ప్రకటనలు చేస్తున్న అధికారులు మరి నీటిని ఎంతవరకు శుద్ధిచేస్తున్నారో పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. దీంతో చాలా మంది కుళాయి నీటిని వాడుకోవడం మానేయగా, మరి కొందరు తప్పనిపరిస్థితుల్లో ఆ నీటిని వడగట్టి, వేడిచేసి వాడుకోవల్సిన పరిస్థితులు వస్తున్నాయి. ఈ సమస్య చాలా కాలంగా ఉన్నప్పటికీ తగు చర్యలు చేపట్టడంలో జీవీఎంసీ వాటర్‌సప్లయ్ విభాగం పట్టనట్టు వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. ఇదిలావుండగా ఇప్పటికే నగరంలో పలు రోగాలు విజృంభిస్తున్నాయి. డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, పలు జ్వరాలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యాధులు రావడానికి మూల కారణం నీరు కూడా. అయితే ఈ నీరు నేడు కలుషితం కావడంతో జనం ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా నగరంలోని శివారు ప్రాంతాలు, మురికివాడల్లో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. పలు పబ్లిక్ కుళాయిల్లో అయితే అపరిశుభ్ర వాతావరణంలోనే కలుషిత నీటిని పట్టుకోవల్సిన దుస్థితి. మరో వైపు రహదారులపై వున్న పైపులైన్‌ల లీకేజీల కారణంగా ఆయా ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొని, మురికికూపంగా మారి స్థానికులను రోగాల పాలు చేస్తోంది. నగరంలో ప్రతి ఇంటికి జీవీఎంసీ నీటి కుళాయి కనెక్షన్‌లు మంజూరుచేసేందుకు కార్యోన్ముఖులవుతున్న జీవీఎంసీ అధికారులు, మరి ఇప్పుడున్న నీటి కనెక్షన్‌లకే మంచినీటిని సరఫరా చేయడంలో విఫలమౌతున్న నేపథ్యంలో మరి లక్షలాది కనెక్షన్‌లకు ఏవిధంగా మంచినీరు అందించగలరని పలువురు ప్రశ్నిస్తున్నారు. జనం నుంచి పన్నుల రూపంలో జీవీఎంసీ ఆదాయాన్ని పెంచుకోవడంపై ఉన్న శ్రద్ధ, నగర ప్రజలకు సౌకర్యాలు కల్పించే విషయంలో కూడా చూపాలని పలువురు సూచిస్తున్నారు. మానవాళికి అత్యంత ముఖ్యమైన మంచినీరు, ఆరోగ్యం విషయంలో ప్రకటనలే తప్ప, చిత్తశుద్ధితో జీవీఎంసీ చర్యలు చేపట్టడం లేదంటూ పలువురు పెదవి విరుస్తున్నారు.

భృంగి వాహనంపై ఆది దంపతులు

విశాలాంధ్ర - శ్రీశైలం : మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకొని శ్రీశైల మహాక్షేత్రంలో పంచాహ్నిక దీక్షతో ఏడు రోజులపాటు నిర్వహించే సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన ఆదివారం స్వామి అమ్మవార్లకు ఆలయ అర్చక వేదపండితులు ఆగమ శాస్త్రానుసారంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణం కోసం జపాలు చేశారు. మండపారాధనలు, పంచవర్ణ అర్చనలు, రుద్ర హోమాలను నిర్వహించారు. వాహన సేవలో భాగంగా సాయంకాలం స్వామి అమ్మవార్లను భృంగి వాహనంపై ఉంచి అక్క మహాదేవి అలంకరణ మండపంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను మేళ తాళాల మధ్య మంగళవాయిద్యాలతో ఆలయ రాజ గోపురం గుండా పుర వీధుల్లో ఊరేగించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు భక్తులు, స్థానికులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు పలికారు. ఈ గ్రామోత్సవ కార్యక్రమంలో దేవస్థానం వారు ఏర్పాటు చేసిన వివిధ జానపద కళారూపాలు, కళాకారుల విన్యాసాలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యనిర్వహణాధికారి శ్రీరామచంద్ర మూర్తి, ఈఈ రామిరెడ్డి, ఆలయ అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



జస్టిస్ సిక్రికి సీఎస్ఏటీ పదవి

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏకే సిక్రి లండన్‌లోని కామన్వెల్త్ సెక్రటేరియట్ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్ (సీఎస్ఏటీ)కు నియమితులయ్యారు. ఆయనను ప్రతిష్టాత్మక సీఎస్ఏటీకి నియమించాలన్న నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం గతనెలలో తీసుకున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ వర్గాలు తెలిపాయి. సీఎస్ఏటీలో మొత్తం 8 మంది సభ్యులు ఉంటారు. వీరిలో ఒకరు అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ సభ్యులను కామన్వెల్త్ దేశాల ప్రభుత్వాలు ఎంపిక చేస్తాయి. అత్యున్నతస్థాయి న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించినవారిని, అత్యున్నత నైతికత, చిత్తశుద్ధి కలవారిని ఎంపిక చేస్తాయి. ఈ సభ్యుల పదవీ కాలం నాలుగేళ్లు. అయితే పదవీకాలాన్ని పొడిగించే అవకాశం ఉంది. 1964లో కామన్వెల్త్ సెక్రటేరియట్ మెమొరాండం ఆమోదం పొందింది. దీనిని 2005లో భాగస్వామ్య ప్రభుత్వాలు సవరించాయి. బ్రిటన్ ప్రభుత్వం కామన్వెల్త్ సెక్రటేరియట్ చట్టం, 1966ను ఆమోదించింది. దీని ప్రకారం కామన్వెల్త్ సెక్రటేరియట్ లీగల్ పర్సనాలిటీని నియమించేందుకు అవకాశం ఇస్తుంది. కొన్ని అధికారాలు, విశేష హక్కులను కల్పిస్తుంది. కాగా, జస్టిస్ సిక్రి మార్చి 6న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేయనున్నారు.

మాదక ద్రవ్యాల సమస్యపై ప్రణాళిక

న్యూఢిల్లీ : మాదక ద్రవ్యాలను, అందులో ఉన్న పదార్థాల దుర్వినియోగం సమస్యను పరిష్కరించేందుకు సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక ముసాయిదాను రూపొందించింది. ఈ సమస్యకు సంబంధించిన ముసాయిదా విధానం చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నది. ఈ కార్యాచరణ ప్రణాళిక (2018-23) లక్ష్యం బహువిధ వ్యూహాన్ని రూపొందించడం. మాదక ద్రవ్యాల డిమాండును తగ్గించేందుకు రూపొందించిన ఈ ప్రణాళికలో ముందుగానే చైతన్యపరచడం, మాదక ద్రవ్యాల సేవనాన్ని నిలువరించడం, బాధితులకు, వారి కుటుంబాలకు పునరావాసం వంటి అంశాలు ఈ వ్యూహంలో ఉన్నాయని ప్రభుత్వాధికారి తెలిపారు. జాతీయ మాదక ద్రవ్యాల డిమాండు తగ్గింపు ముసాయిదా విధానాన్ని సంబంధిత మంత్రిత్వ శాఖ ఉపసంహరించుకున్న తరువాత తాజాగా ఐదేళ్ల కార్యాచరణ ముసాయిదాను రూపొందించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సమస్య ఐదున్నర సంవత్సరాలుగా మంత్రివర్గం ముందున్నది. ఈ కాలంలో ముసాయిదా విధానాన్ని రెండుసార్లు మార్పుచేశారు. ముసాయిదా విధానం స్థానే మంత్రివర్గం జాతీయ కార్యాచరణను రూపొందించింది.



మృత్యువులోనూ వీడని స్నేహం

బైకును ఢీకొన్న లారీ : ముగ్గురి దుర్మరణం

విశాలాంధ్ర - ఏఎస్‌పేట : నెల్లూరు జిల్లా సంగం మండలం గాంధీజన సంఘం వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. బైకును లారీ ఢీకొన్న ఈ ఘటనలో ముగ్గురు స్నేహితులు అక్కడికక్కడే మరణించారు. ఈ దుర్ఘటన పండుగ వేళ మూడు కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చింది. సంక్రాంతికి హైదరాబాద్ నుంచి స్వస్థలమైన జంగాల దొరువు గ్రామానికి వచ్చిన వెంకటేశ్వర్లు (30) తన స్నేహితులు రాము (35), సన్నే సాహెబ్ (36)తో కలిసి సంగం నుంచి నెల్లూరు వైపుకు వెళుతుండగా గాంధీజన సంఘం వద్ద ఎదురుగా వస్తున్న లారీ వారి బైకును ఢీకొంది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. రాము దగదర్తి మండలం, ఊచగుంటపాలెం వాసి కాగా సన్నే సాహెబ్ రాజుపాలానికి చెందినవారని తెలుస్తోంది. విషయం తెలుసుకున్న సంగం ఎస్సై నాగార్జునరెడ్డి, బుచ్చి సీఐ సురేష్‌బాబు, డీఎస్పీ రాఘవరెడ్డిలు ఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించారు. అయితే ఈ దుర్ఘటనతో మూడు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

కురుబలకు ప్రత్యేక కార్పొరేషన్

- గొర్రెలు, మేకలను 90 శాతం సబ్సిడీతో అందించాలి
- ఉన్నత విద్య కోసం విద్యార్థులకు ఆర్థిక సాయం
- 'కురుబ మహాగర్జన'లో వక్తల డిమాండు
- శాసనాధికారం దక్కేంత వరకు పోరాటం



విశాలాంధ్ర బ్యూరో - అనంతపురం : హక్కుల సాధనలో వెనుకబడిన కురుబ సామాజికవర్గం ఇప్పటికైనా మేల్కొని శాసనాధికారం కోసం పోరాడాలని, అందుకు రాబోవు ఎన్నికలను వేదిక చేసుకోవాలని వక్తలు పిలుపు నిచ్చారు. ఆదివారం నగరంలోని జూనియర్ కళాశాల మైదానంలో 'జిల్లా కురుబల మహాగర్జన' సభ జరిగింది. ఈ కార్యక్రమానికి కర్ణాటక మాజీ మంత్రి హెచ్‌ఎం రేవణ్ణ, పెనుకొండ శాసనసభ్యుడు, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు బి.కె.పార్థసారథి, సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శి డి.జగదీష్, జిల్లా కురుబ సంఘం అధ్యక్షుడు వశికేరి లింగమూర్తి, వైసీపీ హిందూపురం పార్లమెంటు సెగ్మెంట్ అధ్యక్షుడు శంకరనారాయణ, టీడీపీ రాష్ట్ర నాయకురాలు ఆర్.సవిత పాల్గొని ప్రసంగించారు. అనంతపురం జిల్లాలో దాదాపు 8 లక్షల మంది కురుబలు ఉన్నారని, సుమారు పది నియోజకవర్గాల్లో ఏ రాజకీయ పార్టీ అభ్యర్థినైనా గెలిపించే, ఓడించే సత్తా ఒక్క కురుబ వర్గానికే ఉందని వక్తలు పేర్కొన్నారు. రాప్తాడు, ధర్మవరం, పెనుకొండ, పుట్టపర్తి, హిందూపురం నియోజకవర్గాల్లో మెజార్టీ జనాభా కురబలదేనన్నారు. అందువల్లే తాము అన్ని రాజకీయ పక్షాలపై ఒత్తిడి తెచ్చి ఐదు అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానం కురుబలకు కేటాయించాలని డిమాండు చేస్తున్నామన్నారు.

అటుతర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లాలో 10 ఎంపీపీ స్థానాలు, 10 జెడ్‌పీటీసీ స్థానాలు ఇవ్వాలని కూడా కోరుతున్నామన్నారు. అలాగే 25 ఎంపీటీసీలు, 50 సర్పంచు స్థానాలు కూడా కురుబలకు ఇచ్చి ప్రోత్సహించాలని, జిల్లాలో నాలుగు వ్యవసాయ మార్కెట్ యార్డులు కురబలకు కేటాయించాలని పేర్కొన్నారు. కురుబలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగడా నికి కృషి చేయాలని, ముఖ్యంగా విద్యాపరంగా మన పిల్లలు అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఐక్యంగా పోరాడితే ఇవన్నీ సాధ్యమన్నారు. కర్ణాటక రాష్ట్రంలో సమైక్యంగా, క్రమశిక్షణతో కురబలు ముందుకు కదులుతున్నారని, యువత బాగా చదువుకుని ఆర్థికంగా ఎదుగుతు న్నారన్నారని విశ్లేషించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేకంగా కురుబలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, తెలంగాణా తరహాలో గొర్రెలు, మేకలను 90 సబ్సిడీతో అందించాలని, కురుబ విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని వక్తలు డిమాండు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వశికేరి రమేష్, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ బిల్లే ఈశ్వరయ్య, కురుబ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, నగర మాజీ మేయర్ రాగే పరశురాం, నగర కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యురాలు బిల్లే శివబాల, వైసీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త ఉషశ్రీ పాల్గొన్నారు.

ఎంసీఐ ఆర్డినెన్స్ పొడిగింపు

న్యూఢిల్లీ : భారత వైద్య మండలి (ఎంసీఐ) కుంభకోణానికి పాల్పడినట్లైతే ఒక కమిటీ దానిని నిర్వహించేందుకు వీలుగా ప్రభుత్వం గతంలో జారీచేసిన ఆర్డినెన్స్‌ను పొడిగించింది.

ఈ మేరకు తాజాగా మరోసారి ఆర్డినెన్స్ జారీ చేసింది. గతంలో జారీచేసిన ఆర్డినెన్స్‌ను చట్టం చేయడానికి ఇంకా పార్లమెంట్ ఆమోదం పొందాల్సి ఉన్నది. అందువల్లనే మరోసారి ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేసింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) బిల్లు, 2017 ప్రకారం దేశంలో వైద్య విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఎంసీఐ స్థానంలో మరో వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ జారీచేసిన ఆర్డినెన్స్ పార్లమెంట్ ముందుంది. ప్రభుత్వం ఇటీవల ఎంసీఐని తోసిపుచ్చుతూ దాని అధికారాలను గవర్నర్ల బోర్డుకి అప్పగించేందుకు వీలుకల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ అయింది. ఎంసీఐ చట్టం ప్రకారమే గవర్నర్ల బోర్డు మళ్లీ కౌన్సిల్ ఏర్పడే వరకు ఏడాదిపాటు విధులను నిర్వహిస్తుంది.


ఎంసీఐ ఆఫీసుబేరర్లపైన అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు, అలాగే గుర్తింపు పొందిన మెడికల్ కాలేజీలపైన దర్యాప్తు చేసేందుకు ప్రభుత్వం కమిటీని వేసి ఎంసీఐకి ఉన్న చట్టబద్ధమైన విధుల ప్రకారమే అజమాయిషిని నిర్వహించాలని 2016 మే నెలలో సుప్రీంకోర్టు ఆదేశించింది. కొత్త చట్టం అమలులోకి వచ్చే వరకు ఈ కమిటీ తన విధులను నిర్వహిస్తుంది.

మాజీ మంత్రులకు ప్రభుత్వ సౌకర్యాలు తొలగింపు


విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : తెలంగాణలో మాజీ మంత్రులకు సౌకర్యాలను ప్రభుత్వం తొలగించింది. ఇప్పటికే వారికి సెక్యూరిటీ తగ్గించడమే కాకుండా, బుల్లెట్ ప్రూఫ్ వాహనం తోపాటు మరో వాహనాన్ని, గన్‌మెన్లలను వెనక్కి తీసుకుంది. దీంతో మాజీ మంత్రులు సొంత వాహనాలను ఎక్కనున్నారు. కొత్త మంత్రుల కోసం మినిస్టర్స్ క్వార్టర్స్ కు మరమ్మతులు చేయనున్నారు. దీని కోసం మాజీ మంత్రులను క్వార్టర్ల నుంచి ఖాళీ చేయించనున్నారు. ఈటల రాజేందర్, జూపల్లి కృష్ణారావు తప్ప మిగిలిన మాజీ మంత్రులు మినిస్టర్ క్వార్టర్లలోనే ఉన్నారు. సంక్రాంతి తర్వాత మాజీ మంత్రులందరినీ ఖాళీ చేయమని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది. ఐదేళ్లుగా మంత్రులుగా ఉన్న కొంతమందికి సొంత వాహనం కూడా లేదు. వారి కుటుంబ సభ్యులకు చెందిన వాహనాల్లోనే వారు వెళ్తున్నారు. మరోవైపు కేబినెట్ ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కసరత్తులు చేస్తున్నారు. రెండు దఫాలుగా మంత్రివర్గ విస్తరణ జరగనుండగా, ఈ నెల 18న ఎనిమిది మందికి మాత్రమే అవకాశం కల్పిస్తారన్న ప్రచారం సాగుతోంది. రెండు దఫాలుగా మంత్రివర్గ విస్తరణ జరగనుంది. కేటీఆర్, హరీశ్‌రావు, కడియం శ్రీహరి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, రేఖానాయక్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, రెడ్యానాయక్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాల్క సుమన్, కొప్పుల ఈశ్వర్, ఆరూరి రమేశ్, వినయ్ భాస్కర్, నరేందర్‌రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ నెల 19న గవర్నర్ శాసన సభను ఉద్దేశించి ప్రసంగించనుండటంతో ఆ సమయానికి సభలో మంత్రులు తప్పనిసరిగా ఉండాల్సిందే. మర్నాడు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సమయంలో మంత్రులు మాట్లాడాలి అదే సమయంలో శాసనసభ వ్యవహారాల మంత్రి కూడా ఉండాలి. ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణకు జనవరి 18 అనుకూలమని కేసీఆర్ భావిస్తోన్నట్లు తెలుస్తోంది.

కారుగూటికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు..?


- సంక్రాంతి తర్వాత టీఆర్ఎస్‌లో చేరడం ఖాయమని ప్రచారం
- టీఆర్ఎస్ మైండ్ గేమ్ అంటూ కాంగ్రెస్ నేతల విమర్శలు




సబితా ఇంద్రారెడ్డి



సుధీర్‌రెడ్డి



రేగా కాంతారావు



పోదెం వీరయ్య

విశాలాంధ్ర బ్యూరో - హైదరాబాద్ : ఇటీవల ముగిసిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో ఘోర పరాజయంతో డీలాపడ్డ కాంగ్రెస్ పార్టీకి మరో భారీ షాక్ తగిలే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు టీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారని రాజకీయ వర్గాల సమాచారం. ఆరుగురు ఎమ్మెల్యేలు టీఆర్ఎస్ గూటికి చేరదానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ జాబితాలో చేవెళ్ల చెల్లెమ్మ, మాజీ హోం మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈమెతోపాటు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, సురేందర్, వీరయ్య, కాంతారావు, ఉపేందర్‌రెడ్డి కూడా టీఆర్ఎస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమవు తున్నట్లు ప్రచారం సాగుతోంది. వీరితోపాటు మరో ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు కూడా కారెక్కడానికి సిద్ధపడినట్లు సమాచారం. సంక్రాంతి పండుగ తరువాత ఈ రాజకీయ ప్రక్రియ జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ ఆరుగురు తరువాత మరో నలుగురైదుగురు రెండో విడతలో టీఆర్ఎస్‌లో చేరతారని సమాచారం. యూరప్ నుండి తిరిగి వచ్చిన పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే ఈ అంశంపై దృష్టి పెట్టి సదరు ఎమ్మెల్యేలకు ఫోన్ చేయగా వారంతా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే టీఆర్ఎస్‌కి టచ్‌లో ఉన్న సదరు ఎమ్మెల్యేలంతా సంక్రాంతి తరువాత ఆ పార్టీలో చేరేందుకు సిద్ధపడుతున్నారు. టీఆర్ఎస్‌లో చేరతారని భావిస్తున్న సబితా ఇంద్రారెడ్డికి మంత్రివర్గ విస్తరణలో అవకాశం లభించనున్నట్లు తెలిసింది. ఒకవేళ మంత్రి పదవి దక్కకపోతే ఆమె కుమారుడు కార్తీక్‌రెడ్డికి చేవెళ్ల ఎంపీ టికెట్ ఇచ్చే ఆలోచనలో టీఆర్ఎస్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. గతంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఆ స్థానం నుంచి కార్తీక్‌కు సీటు ఇచ్చేందుకు గులాబీ పార్టీ హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇదిలాఉండగా ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కూడా టీఆర్ఎస్‌లో చేరడం దాదాపుగా ఖాయమైందని ప్రచారం సాగుతోంది. నియోజకవర్గ అభివృద్ధికి వీలుగా టీఆర్ఎస్‌లో చేరితే ఎలా ఉంటుందని సుధీర్‌రెడ్డి తన సన్నిహిత నేతలు, కార్యకర్తలతో ఇప్పటికే సమాలోచనలు జరిపినట్లు తెలిసింది. ఒకవేళ అదేకనుక జరిగితే గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతు కానుంది. అయితే తాను టీఆర్ఎస్‌లో చేరబోతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని, అవి పూర్తిగా నిరాధారమైనవి, అవాస్తవమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని ఆయన స్పష్టం చేశారు. ఇతర పార్టీ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరనున్నారని టీఆర్ఎస్ మైండ్‌గేమ్ ఆడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై దుష్ప్రచారాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మరోవైపు ఖమ్మం జిల్లా నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో ముగ్గురు టీఆర్ఎస్‌లో చేరడానికి సిద్ధపడినట్లు ప్రచారం జరుగుతోంది. భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్య, పినపాక ఎమ్మెల్యే రేగ కాంతారావు, పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, నిజామాబాద్ జిల్లా నుంచి గెలిచిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జె.సురేందర్ కూడా టీఆర్ఎస్‌లో చేరుతారని ప్రచారం ఊపందుకుంది. ఆయనతో టీఆర్ఎస్ నేతలు ఇప్పటికే చర్చలు జరిపారని రాజకీయ నేతల సమాచారం. ఏదేమైనా సంక్రాంతి తర్వాత తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులు జరిగే అవకాశం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నట్లుగా టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల సంఖ్య సెంచరీ దిశగా పయనిస్తోంది.

రుణ మాఫీ కోసం బడ్జెట్‌లో రూ.46 వేల కోట్లు

- వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు హామీ
- ఇప్పటికే 12 లక్షల మందికి రుణమాఫీ
- దేశానికే కర్ణాటక ప్రభుత్వం ఆదర్శం
- కుమారస్వామి వెల్లడి



బెంగళూరు : కర్ణాట ప్రభుత్వం సంపూర్ణ రైతు రుణమాఫీకోసం బడ్జెట్‌ను రూపొందించింది. ఇందుకోసం రెండో బడ్జెట్‌లో రూ. 46వేల కోట్లు కేటాయించామని కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి వెల్లడించారు. కాంగ్రెస్ - జేడీఎస్ కూటమితో ఏర్పడిన ప్రభుత్వం ఫిబ్రవరి 8న రెండో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. మొదట నాలుగుదశల్లో రైతురుణమాఫీ చేయాలని సంకల్పించామని, అయితే బీజేపీ తరచూ ఈ విషయంపై మాటల దాడి చేయడంతో వన్ టైమ్ సెటిల్‌మెంట్‌కు హామీ ఇస్తున్నామన్నారు. ఢిల్లీలో జరిగిన బీజేపీ జాతీయ సమావేశంలో కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం ఆర్భాటంగా రైతురుణమాఫీ ప్రకటించిందని దానిని అమలు చేయకపోవడంతో బ్యాంకులు నోటీసులు పంపుతున్నారని ఎద్దేవా చేయడంపై ఆయన మండిపడ్డారు. ఈ వ్యాఖ్యల ద్వారా బీజేపీ నీచ స్వభావం తెలుస్తుందన్నారు. 2019-2020 బడ్జెట్‌ను ఫిబ్రవరి 8న ప్రవేశపెట్టనున్నామని కుమారస్వామి వివరించారు. ఎన్నికల్లో ప్రకటించిన ఆర్థిక వాగ్దానాలకు కట్టుబడి ఉన్నామని, జేడీఎస్ వాటిని నెరవేర్చుతుందన్నారు. జాతీయ, సహకార బ్యాంకు నుంచి రైతులు తీసుకున్న రుణాల మొత్తం రూ.46 వేల కోట్లను రెండో బడ్జెట్‌లో విడుదల చేస్తామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో రైతురుణమాఫీ అమలులో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రుణమాఫీల కోసం ఒక ఐఏఎస్ అధికారిని నియమించి, ప్రత్యేకంగా ఒక కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నా మన్నారు. ఇది 24 గంటలు అందుబాటులో ఉంటుందని, ముఖ్యమంత్రి కార్యాలయం ప్రతిరోజు ఈ విషయాలను పర్యవేక్షిస్తుందన్నారు. జేడీయూ పదవీబాధ్యతలు తీసుకున్న అనంతరం జూలైలో బడ్జెట్ రూపొందించి రూ. 9,000 కోట్లు విడుదల చేసి, జనవరి 31 నాటికి 11నుంచి 12 లక్షల మంది వ్యవసాయదారులకు ప్రయోజనం చేకూర్చామని సీఎం వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వం రూ. 70 వేల కోట్ల రుణాల మాఫీ చేస్తామని ప్రకటించడాన్ని ఆయన గుర్తుచేశారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లతో పోల్చి చూసుకుంటే ఏడు నెలల్లో రూ.9000 వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత జేడీఎస్‌దే అన్నారు. ఒన్ టైమ్ సెటిల్‌మెంట్ కోసం ఇప్పటికే జాతీయ బ్యాంకులను సంప్రదించామన్నారు. రూ. 9,500 కోట్ల రుణమాఫీల్లో కొన్ని నకిలీ రుణాలు ఉన్నాయన్నారు. నియమనిబంధనల మేరకు లోన్లను రద్దు చేస్తామని అది తమ పార్టీకి అతి పెద్ద విజయమన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉన్నప్పటికీ సిద్దరామయ్య ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను యథావిధిగా అమలు చేస్తున్నామని వివరించారు. చిన్న వ్యాపారులకు, వీధుల్లో విక్రయదారులకు వడ్డీలేకుండా బడవార బంధు పథకం అమలు చేస్తున్నామని, ఇజ్రాయిల్ తరహా వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. మరికొన్ని ఆలోచనలతో వచ్చే బడ్జెట్‌ను రూపొందిస్తున్నామన్నారు. అయితే అధికారం చేపట్టిన 24 గంటల్లో రాష్ట్రంలో రుణమాఫీ చేస్తామన్న జేడీఎస్ మేనిఫెస్టోని బీజేపీ ఎద్దేవా చేస్తోంది.



దివిసీమ పడవ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - నాగాయలంక (కృష్ణాజిల్లా) : అద్యంతం ఉల్లాసం.. ఉత్సాహం.. ఆపై సరాలు తెగే ఉత్కంఠ.. గెలిచి తీరాలన్న పట్టుదలతో హైలెస్సా అంటూ మత్స్యకార యువత నదిలో చేసిన సాంప్రదాయ పడవల విన్యాసాలు.. ఇవి ఆదివారం నాగాయలంకలో ప్రారంభమైన సంక్రాంతి సంబరాల్లోని దివిసీమ సాంప్రదాయ పడవ పోటీలు, మహిళా క్రీడా పోటీల దృశ్యాలు. మహిళల ముగ్గుల పోటీలతో ఆరంభమైన సాంప్రదాయ పడవ పోటీలు, మహిళా క్రీడలు ఆసాంతం ఉత్సాహ భరితంగా సాగాయి. పడవ పోటీల తొలిరోజున సాంప్రదాయ కోల పడవల లీగ్ రేస్ నిర్వహించగా 16 జట్లు ఈ పోటీల్లో పాల్గొని తమ సత్తాను చాటా యి. డ్రాగన్ పోటీలలో తొలి రోజున ఆరు జట్లు ప్రదర్శన ఇచ్చాయి. కృష్ణానదిలో వేటచేసే సాంప్రదాయ మత్స్యకారుల నడుమ జరిగిన కోల పడవ పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తొమ్మిది మంది జట్టుతో సాగిన ఈ పోటీలను నాలుగు విడతలుగా నిర్వహించారు. గెలుపే లక్ష్యంగా మత్స్యకార యువకులు కోల లాగిన తీరును ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. లీగ్ పోటీలలో నాలుగు జట్లు తుది పోరుకు అర్హత పొందాయి. సోమవారం ఫైనల్స్ నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ తెలిపింది. రాష్ట్రంలోనే తొలిసారిగా నిర్వహించే డ్రాగన్ పడవ పోటీలను కూడా సోమవారం నిర్వహించనున్నట్లు స్వచ్ఛ నాగాయలంక కార్యదర్శి బోయపాటి రాము, పడవ పోటీల నిర్వాహక కమిటీ సభ్యుడు తలశిల రఘుశేఖర్ తెలిపారు.

రంగోలి శోభ : ముగ్గుల పోటీలతో దివిసీమకు సంక్రాంతి శోభ వచ్చింది. మొత్తం 195 మంది మహిళలు రంగోలి పోటీలలో పాల్గొన్నారు. పోటీలలో కేవన్ మల్లేశ్వరి ప్రథమస్థానం సాధించి ఎల్‌ఈడీ టీవీని దక్కించుకుంది. ఏ గీతాంజలి రెండోస్థానం, ఎన్ శ్రీలక్ష్మీ, ఎన్ లావణ్య, ఎం శ్రీలత తర్వాత స్థానాలను పొందారు. పర్యాటకశాఖ ఏర్పాటు చేసిన నవలంక కార్యక్రమం బాలలను అమితంగా ఆకట్టుకుంది. చిన్నారులు పారా గ్లైడింగ్ చేసేందుకు, ఒంటెలపై ఎక్కి ఆడేందుకు ఆసక్తి కనబరిచారు. పెద్దలుసైతం పిల్లల మాదిరిగా మారిపోయారు. నవలంకలో ఏర్పాటు చేసిన వివిధ రకాల జంగిల్ హంట్ బొమ్మల వద్ద పర్యాటకులు ఫొటోలు దిగేందుకు ఉత్సాహం చూపటం విశేషం.

పోటీలను తిలకించిన ప్రముఖులు : నాగాయలంకలో జరుగుతున్న పడవ పోటీలను పలువురు ప్రముఖులు తిలకించారు. జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ జయరామిరెడ్డి, విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తదితరులు పోటీలను తిలకించారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసిన కళాప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను నాగాయలంక ప్రముఖులు మండవ బాలవర్ధిరావు, ఈడి మల్లిఖార్జునరావు, తలశిల స్వర్ణలత, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, గడ్డిపాటి సుధీర్ బాబు, చెన్ను లక్ష్మణరావు, తిరుమలశెట్టి మస్తాన్ రావు పర్యవేక్షించారు.

ప్రొఫెసర్ అభ్యంతరకర వ్యాఖ్యలు

కోల్‌కతా : అమ్మాయిల కన్యత్వంపై ఒక ప్రొఫెసర్ అభ్యంతకర వ్యాఖ్యలు చేసి నెటిజన్ల ఆగ్రహానికి గురయ్యాడు. 'అబ్బాయిలు.. సీల్ ఊడిన కూల్ డ్రింక్స్ కొంటారా? అలాంటప్పుడు కన్యత్వం కోల్పోయిన అమ్మాయిలను ఎలా పెళ్లి చేసుకుంటారు? అబ్బాయిలు కన్యత్వం కలిగిన యువతుల విషయంలో మోసపోతున్నారు. వర్జినిటీ కలిగిన అమ్మాయిలను పెళ్లి చేసుకుంటే లభించే లాభాల గురించి వారికి అవగాహన లేదు. కన్యత్వం కలిగిన అమ్మాయిలు దేవదూతలు' అంటూ కోల్‌కతాలో జాదవ్‌పూర్ యూనివర్సిటీకి చెందిన కనక్ సర్కార్ అనే ప్రొఫెసర్ ఫేస్‌బుక్‌లో వరుసగా పోస్టులు చేశాడు. ఈ పోస్టులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో ప్రొఫెసర్ ఆ పోస్టులను తొలగించాడు. మరో పోస్టులో అబ్బాయిలు, అమ్మాయిలు విలువలకు పాతరేస్తూ పెళ్లికి ముందే తమ వర్జినిటీని కోల్పోతున్నారని, దీంతో అబ్బాయిలు అమ్మాయిల పట్ల మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారని చెప్పుకొచ్చాడు. అమ్మాయిలు తమ లైఫ్ పార్టనర్‌కు వర్జినిటీ విషయం తెలియజేస్తే వారు గౌరవిస్తారని, ప్రతి పురుషుడు వర్జినిటీ కలిగిన భార్యను గౌరవిస్తారని మరో పోస్టులో పేర్కొన్నాడు. ఈ విషయం అమ్మాయిలకు కూడా బాగా తెలుసని చెప్పుకొచ్చాడు. జపాన్‌లో 99 శాతం యువతులు పెళ్లి అయ్యేవరకు కన్యత్వాన్ని కోల్పోరని, అందుకే వారి సమాజం బాగుందని, జపాన్ అభివృద్ధిలో దూసుకుపోతోందని ఒక ఉదాహరణ కూడా చెప్పాడు.

ట్రిపుల్ తలాక్ ఆర్డినెన్స్ పొడిగింపు

న్యూఢిల్లీ : ముస్లిం మహిళల వివాహ హక్కుల రక్షణ కోసం తక్షణం ట్రిపుల్ తలాక్‌ను చెప్పి విడాకులు తీసుకోవడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం గతంలో జారీచేసిన ఆర్డినెన్స్‌ను పొడిగించింది. ఈ ఆర్డినెన్స్‌ను మరోసారి శనివారం ప్రకటించింది. తక్షణ ట్రిపుల్ తలాక్ ద్వారా విడాకులు అక్రమమని, చెల్లవని, ఒకవేళ ఆ సంప్రదాయాన్ని పాటిస్తే భర్తకు మూడేళ్ల జైలుశిక్ష విధించే వీలును కల్పిస్తూ 2019 ముస్లిం మహిళల (వివాహ హక్కుల రక్షణ) ఆర్డినెన్స్‌ను ప్రభుత్వం మళ్లీ జారీచేసింది. ఆర్డినెన్స్ స్థానే లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టి సభ ఆమోదం పొందింది. ప్రస్తుతం ఈ బిల్లు రాజ్యసభ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నది. అందువల్లనే మరోసారి ఆర్డినెన్స్ జారీచేయాల్సి వచ్చింది. ఈ చట్టాన్ని దురుపయోగం చేసే అవకాశం ఉందని వ్యక్తమౌతున్న ఆందోళనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్టు కనిపించదు. నిందితుడిని కోర్టు విచారణ చేయకముందే బెయిల్ పొందే అవకాశాన్ని బిల్లులో పొందుపరిచారు. బిల్లులో కొన్ని సవరణ లను మంత్రివర్గం 2019 ఆగస్టు 29న ఆమోదిం చింది. ట్రిపుల్ తలాక్ ద్వారా విడాకులు తీసుకో వడం నాన్‌బెయిలబుల్ నేరంగా పరిగణిస్తారు. నిందితుడికి పోలీసులు గానీ, పోలీసు స్టేషన్‌గానీ బెయిల్ మంజూరుచేసే అవకాశంలేదు. మెజిస్ట్రేట్ మాత్రమే బెయిల్ మంజూరు చేయాల్సి ఉంటుంది. అది కూడా నిందితుడి భార్య చెప్పే అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న తరువాత మాత్రమే బెయిల్ మంజూరు చేస్తారు. భార్యకు నష్టపరిహారం చెల్లించేందుకు నిందితుడైన భర్త అంగీకరించిన తరువాతే మెజిస్ట్రేట్ బెయిల్ మంజూరు చేస్తారు. భార్య లేదా రక్తసంబంధీకులు లేదా బంధువులు ఫిర్యాదు చేస్తే పోలీసులు ఎఫ్ఐఆర్‌ని మాత్రమే నమోదు చేస్తారు. ఈ ఆర్డినెన్స్ క్రింద ఇరుగు పొరుగు వారుగానీ, ఇతరులుగానీ ఫిర్యాదు చేయడా నికి వీలులేదు. భార్యాభర్తల మధ్య వివాదాన్ని మెజిస్ట్రేట్ తమ హక్కులను వినియోగించుకుని పరిష్కరించవచ్చు. అయితే, భార్య కోర్టును ఆశ్రయించినప్పుడు మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. కోర్టు నుంచి కేసును ఉపసంహరిం చుకునేందుకు రెండు పక్షాలకు అవకాశం ఉంటుంది.

మత విశ్వాసాలను గౌరవించండి

న్యూఢిల్లీ : మైనార్టీల మత విశ్వాసాలను గౌరవించాలని ప్రభుత్వ విభాగాలకు ఢిల్లీ మైనార్టీ కమిషన్ ఆదేశించింది. విద్యా సంబంధిత పరీక్షలు, నియామకాలకు వచ్చినపుడు వారివారి మత విశ్వాసాల ప్రకారం తీసుకువచ్చే వస్తువులు, ధరించే దుస్తులను అనుమతించాలని నగర ప్రభుత్వ విభాగాలను కమిషన్ కోరింది. పరీక్షలకు, నియామకాలకు హాజరయ్యే మైనార్టీ విద్యార్థులు, అభ్యర్థుల డ్రెస్ కోడ్‌పై తగిన చర్య కోరుతూ కమిషన్ ఆదేశం అమలుకు ప్రిన్సిపల్ సెక్రటరీలు, విభాగాధిపతులకు సాధారణ పరిపాలనా విభాగం(జీఏడీ) ఒక సర్క్యులర్ జారీ చేసింది. మైనార్టీ కమిషన్ చైర్మన్ జాఫ్రుల్లా ఇస్లాం ఖాన్ మాట్లాడుతూ పరీక్షలకు హాజరవుతున్నపుడు తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మైనార్టీ సమాజ సభ్యుల నుంచి ఫిర్యాదుల నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ చేశామన్నారు. 'ముస్లిం మహిళలు వారి మత ఆచారం ప్రకారం బురఖా ధరించే హక్కును తిరస్కరించలేరు. అలాగే భారత రాజ్యాంగం 25వ అధికరణ ప్రకారం సిక్కులు కిర్పాన్ (బాకు) కలిగి ఉండటాన్ని అనుమతించాలి' అని కమిషన్ తన ఆదేశాల్లో పేర్కొంది. అయితే పరీక్షల సమయంలో భద్రతాపరమైన జాగ్రత్తలు చాలా అవసరమని, కానీ మైనార్టీ విద్యార్థులు, అభ్యర్థుల ప్రయోజనాలకు హాని కలగకూడదని తెలిపింది. ముస్లిం మహిళల బురఖాను తనిఖీ చేసి అటు తర్వాత దానిని ధరించడానికి సిబ్బంది అనుమతించాలని వివరించింది. 'దుస్తుల కోడ్' ఆర్డర్‌ను పూర్తిగా అమలు చేయాలని విద్యా సంస్థలు, ప్రభుత్వ విభాగాలన్నింటినీ కమిషన్ ఆదేశించింది. అమలులో విఫలమైతే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొంది.

విచారణ వేగవంతం..
అంత తొందరెందుకు..?

సీఓఏలో అభిప్రాయభేదాలు



న్యూఢిల్లీ: క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కె.ఎల్ రాహుల్‌లపై విచారణ విషయంలో బోర్డు పరిపాలక కమిటీ (సీఓఏ)లో భేదాభిప్రాయాలు బహిర్గతమయ్యాయి. సీఓఏ చీఫ్ వినోద్ రాయ్ టీమిండియా జట్టు కూర్పు పటిష్టత కోసం క్రికెటర్లపై చేపట్టిన విచారణను వేగవంతం చేయాలని సూచిస్తుంటే... కమిటీ సభ్యురాలు డయానా ఎడుల్జీ మాత్రం అంత తొందరెందుకని మండిపడుతున్నారు. తూతూమంత్రం విచారణతో ఏదో రకంగా ఈ వివాదాన్ని ముగించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇటీవల ఒక టీవీ షోలో క్రికెటర్లిద్దరు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పెను విమర్శలకు దారితీసింది. దీంతో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పాండ్య, రాహుల్‌లపై వేటు వేసింది. ఆ వెంటనే ఇద్దరు క్రికెటర్లు ఆసీస్ నుంచి అర్థంతరంగా స్వదేశం పయనమయ్యారు. జట్టు బలం ఇప్పుడు 15 సభ్యుల నుంచి 13కు పడిపోవడంతో వెంటనే విచారణ పూర్తిచేసి వారి స్థానాలను భర్తీచేయాలని సీఓఏ చీఫ్ రాయ్ భావిస్తున్నారు. దీన్ని ఎడుల్జీ విభేదించారు. లోగడ బోర్డు సీఈఓ రాహుల్ జోహ్రి ఎదుర్కొన్న లైంగిక వేధింపుల ఆరోపణలపై ఇలా తొందరపడే త్వరగా ముగించారని ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు హార్దిక్ పాండ్య, రాహుల్ స్థానాల్లో శుబ్‌మాన్ గిల్, విజయ్ శంకర్‌లను జట్టులోకి ఎంపిక చేసినట్లు సెలెక్టర్లు తెలిపారు.

ధోనీని నాలుగులో పంపాలి : రోహిత్



సిడ్నీ: వన్డేల్లో నాలుగో స్థానానికి ధోనీనే సరిపోతాడని టీమిండియా వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. కొంత కాలంగా ఈ స్థానంలో అంబటి రాయుడు ఆడుతుండటం, అతడికి కెప్టెన్ కోహ్లి మద్దతుగా నిలుస్తోన్న తరుణంలో రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. సిడ్నీ వేదికగా శనివారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 34 పరుగుల తేడాతో ఓటమి పాలైన సంగతి తెలిసిందే. మ్యాచ్ అనంతరం రోహిత్ శర్మ మీడియాతో మాట్లాడుతూ "ధోనీ నాలుగో స్థానంలో రావడం జట్టుకు మేలు చేస్తుందని నా వ్యక్తిగత అభిప్రాయం. కానీ ఆ స్థానంలో రాణిస్తున్న రాయుడు ఉన్నాడు. అయితే జట్టు కూర్పు విషయంలో తుది నిర్ణయం మాత్రం కెప్టెన్, కోచ్‌లదే" అని రోహిత్ తెలిపాడు.

ధోని నెమ్మదిగా ఆడాడన్న విమర్శలపై

ఇక, సిడ్నీ వన్డేలో ధోని మరీ నెమ్మదిగా ఆడాడన్న విమర్శలపై కూడా రోహిత్ శర్మ స్పందించాడు. 'ధోని తన కెరీర్లో దాదాపు 90 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేశాడు. తొలి వన్డేలో అతను బ్యాటింగ్‌కు వచ్చేటప్పటికే టీమిండియా మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. పైగా ఆస్ట్రేలియా బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేస్తున్నారు. అలాంటి సందర్భాల్లో 100 భాగస్వామ్యం నమోదు చేయడం సులభం కాదు" అని రోహిత్ శర్మ పేర్కొన్నాడు.

భారత జట్టులోకి శుబ్‌మాన్ గిల్



న్యూఢిల్లీ: ఓ టీవీ కార్యక్రమంలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురైన కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య స్థానాలను శుబ్‌మన్ గిల్, విజయ్ శంకర్‌లతో భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బీసీసీఐ) భర్తీ చేయనుంది. ఈ మేరకు బీసీసీఐ తాజాగా నిర్ణయం తీసుకుంది. అయితే గిల్ న్యూజిలాండ్ పర్యటనకు టీమిండియా వెళ్లే సమయంలో జట్టుతో కలుస్తాడు. ఇక విజయ్ శంకర్ మాత్రం ఆస్ట్రేలియాతో అడిలైడ్‌లో మంగళవారం జరిగే రెండో వన్డే కోసం జట్టులో కలవనున్నాడు. ఇప్పటికే భారత్ తరపున విజయ్ శంకర్ ఆడగా, శుబ్‌మాన్ గిల్ అరంగేట్రానికి రంగం సిద్ధమైంది. గతేడాది జరిగిన అండర్-19 వరల్డ్‌కప్‌లో భారత జట్టు విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ టోర్నమెంట్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును గిల్ గెలుచుకున్నాడు.

వారిని తీవ్రంగా శిక్షించొద్దు : బాబుల్ సుప్రియో



న్యూఢిల్లీ: ఓ టీవీ షోలో క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్ చేసిన వ్యాఖ్యలపై వివాదం ఇంకా రగులుతూనే ఉంది. వారి వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ బీసీసీఐ షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసింది. పాండ్య ఇప్పటికే ఆ వివాదంపై క్షమాపణలు కోరాడు. అయితే త్వరలో జరగబోయే ఐసీసీ ప్రపంచ కప్‌లో ఆడకుండా వారిద్దరిపై వేటు వేయాలంటూ వాదనలు వినిపిస్తున్న నేపథ్యంలో కేంద్ర సహాయ మంత్రి బాబుల్ సుప్రియో స్పందించారు. వారిని తీవ్రంగా శిక్షించవద్దంటూ ఆదివారం ట్విటర్ వేదికగా..పాలకుల కమిటీ సభ్యురాలు డయానా ఎడుల్జి, ఇతర అధికారులను మంత్రి కోరారు. వారిని తొలగించడం వల్ల భవిష్యత్తులో మిగతా క్రీడాకారులు బాధ్యతాయుతంగా ఉంటారని కొంతమంది భావిస్తున్నారని, కానీ అది వారి కెరీర్‌ను నాశనం చేస్తుందని ఆ ఆలోచనలను ఆయన తోసిపుచ్చారు. 'వారు చేసిన వ్యాఖ్యలు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. కానీ, చిన్న వయసు వారిని సరైన మార్గంలో పెట్టడానికి మీరు ప్రయత్నించాలి. కఠినమైన చర్యల వల్ల వారి భవిష్యత్తు నాశనమవుతుంది. శిక్షించడానికి, జీవితాన్ని నాశనం చేయడానికి మధ్య ఒక చిన్న గీత ఉంటుంది. సీనియర్లకు నేను చేసే అభ్యర్థన ఏంటంటే.. మీ వయసు రీత్యా నిర్ణయాలు తీసుకోండి. జెంటిల్ మెన్ అండ్ లేడీస్' అని డయానా ఎడుల్జీ బృందానికి సూచించారు. న్యాయ నిపుణుల బృందం తీసుకోబోయే నిర్ణయం మీద ఈ ఇద్దరు ఆటగాళ్ల భవితవ్యం ఆధారపడనుంది.

రాజస్థాన్ రాయల్స్‌కు కొత్త కోచ్



ముంబై: ఐపీఎల్ తొలి ఎడిషన్ విజేత రాజస్థాన్ రాయల్స్ కొత్త కోచ్‌ను ఎంపిక చేసింది. టీమిండియా మెంటల్ కండీషనింగ్ మాజీ కోచ్ ప్యాడీ అప్టన్‌ను తిరిగి తన బృందంలో చేర్చుకుంది. గతంలోనూ ఆయన నాలుగుసార్లు రాజస్థాన్‌కు కోచ్‌గా పనిచేశారు. ఆయన శిక్షణలోనే 2013లో ఆ జట్టు సెమీస్ చేరుకుంది. అదే ఏడాదిలో శ్రీశాంత్ సహా ముగ్గుర్ని పోలీసులు అరెస్టు చేయడంతో జట్టు పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. అప్పుడే చాంపియన్స్ లీగ్ టీ20 ఫైనల్ చేరుకుంది. అప్టన్‌కు కోచింగ్‌లో మంచి అనుభవం ఉంది. ఐపీఎల్, బిగ్‌బాష్, పీఎస్‌ల వంటి లీగుల్లో జట్లకు మార్గనిర్దేశకుడిగా ఉన్నారు. బిగ్‌బాష్‌లో సిడ్నీ థండర్స్‌కు నాలుగేళ్లు కోచ్‌గా ఉండి 2016లో విజేతగా నిలిపారు. అప్పటి కోచ్ గ్యారీ కిర్‌స్టన్‌తో కలిసి టీమిండియాకు మెంటల్ కండీషనింగ్ కోచ్‌గా పనిచేశారు. వారి ఆధ్వర్యంలోనే భారత్ 2011 ప్రపంచకప్ గెలిచింది. ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. 2011-14 వరకు దక్షిణాఫ్రికా పెర్ఫామెన్స్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2012లో ఆ జట్టు టెస్టు, వన్డే, టీ20ల్లో ఒకేసారి అగ్రస్థానంలో నిలిచింది.

రాయుడు బౌలింగ్ అనుమానాస్పదం : ఐసీసీ



దుబాయ్: టీమిండియా బ్యాట్స్‌మన్, పార్ట్ టైం బౌలర్ అంబటి రాయుడు అనుమానాస్పద బౌలింగ్ శైలిపై ఫిర్యాదు అందిందని ఐసీసీ వెల్లడించింది. ఆస్ట్రేలియాతో సిడ్నీ మైదానంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో అతడు రెండు ఓవర్లు వేశాడు. 13 పరుగులు ఇచ్చాడు. 'రాయుడు బౌలింగ్ యాక్షన్ అనుమానాస్పదంగా ఉందని మ్యాచ్ అధికారులు నివేదిక ఇచ్చారు. దానిని భారత జట్టు యాజమాన్యానికి అందించాం. ఐసీసీ టెస్టు, వన్డే, టీ20ల్లో అనుమానాస్పద బౌలింగ్ యాక్షన్ నిబంధనల ప్రకారం అతడి బౌలింగ్‌ను పరీక్షించాల్సి ఉంటుంది. రాయుడు 14 రోజుల్లోపు పరీక్షకు వెళ్లొచ్చు. పరీక్ష ఫలితాలు వచ్చేలోపు అతడు మ్యాచుల్లో బౌలింగ్ చేయొచ్చు' అని ఐసీసీ తెలిపింది. అంబటి రాయుడు కెరీర్‌లో ఇప్పటి వరకు 46 వన్డేలు ఆడాడు. కేవలం 20.1 ఓవర్లు మాత్రమే వేశాడు. సగటు 41.33. ఎకానమీ రేటు 6.14. మూడు వికెట్లు తీశాడు. అతను ఆడిన ఆరు టీ20ల్లో రాయుడు బౌలింగ్ చేయలేదు. సిడ్నీ మ్యాచ్‌లో రాయుడు రెండో బంతికే డక్ అయ్యాడు. పరిమిత ఓవర్ల క్రికెట్ కోసం అతడు ఫస్ట్‌క్లాస్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే.

ఇంటర్ వర్సిటీ బాల్‌బ్యాడ్మింటన్ చాంప్ మంగుళూరు

నాలుగో స్థానంలో కృష్ణావిశ్వవిద్యాలయం జట్టు



విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : కృష్ణావిశ్వవిద్యాయం ఆధ్వర్యంలో ఐదురోజులపాటు సిద్దార్థ మహిళా కళాశాలలో నిర్వహించిన అఖిలభారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఆదివారం ముగిసింది. విజేతగా మంగుళూరు విశ్వవిద్యాలయం జట్టు నిలిచింది. లీగ్ దశలో మంగుళూరు విశ్వవిద్యాలయం జట్టు కాలికట్, ఎస్ఆర్ఎమ్, కృష్ణా విశ్వవిద్యాలయం జట్లపై గెలిచి ఆరు పాయింట్లతో ప్రథమస్థానంలో నిలిచింది. కాలికట్ విశ్వవిద్యాలయం జట్టు ఎస్ఆర్ఎమ్, కృష్ణా వర్సిటీ జట్లపై గెలిచి నాలుగు పాయింట్లతో ద్వితీయ, ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ కృష్ణాయూనివర్సిటీ జట్టుపై గెలిచి 2 పాయింట్లతో తృతీయస్థానంలో, ఆతిథ్య కృష్ణా యూనివర్సిటీ జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ గద్దెఅనురాధ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రీడల పట్ల పలువురికి ఆసక్తి పెరిగిందని తల్లిదండ్రులు, ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి క్రీడామైదానాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఏ గ్రేడ్ కళాశాల అయిన సిద్దార్థ మహిళా కళాశాల ఆల్‌ఇండియా ఇంటర్ వర్సిటీ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం అభినందించదగ్గ విషయమన్నారు. గౌరవ అతిథిగా హాజరైన కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ జీవితంలో విజయం కోసం నిరతంతం పోరాడాలన్నారు. విజయంతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో రాణించాలన్నారు. కృష్ణావిశ్వవిద్యాలయం ప్రత్యేక అధికారి ఆచార్య ఎమ్‌వి.బసవేశ్వరరావు, యూనివర్సిటీ ప్రాంగణ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్.ఉష, ఏఐయూ పరిశీలకులు ఆచార్య కెవి.టార్జాన్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎమ్.నళిని, డైరక్టర్ టి.విజయలక్ష్మి క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను, నగదు బహుమతులను బహుకరించారు. ఆచార్య ఎమ్‌వి.బసవేశ్వరరావు విజేతగా నిలిచిన మంగుళూరు జట్టుకు తమ వ్యక్తిగత నిధుల నుంచి రూ.5,116 బహుకరించారు. ఈ టోర్నీలో మంగుళూరు విశ్వవిద్యాలయానికి చెందిన జయలక్ష్మి ఉత్తమ క్రీడాకారిణిగా ప్రత్యేక బహుమతి అందుకుంది. జేడీ నాగేంద్రప్రసాద్ సమన్వయ కర్తగా వ్యవహరించగా చాంపియన్‌షిప్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, డైరెక్టర్ వి.రవికాంతి పోటీల నివేదికను ప్రకటించారు. టోర్నమెంట్ చీఫ్ రిఫరీ ఎస్.మురళీకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు.

అటవీ సంపదను కాపాడుకోవాలి : మేరీకోమ్



డిస్పూర్(అస్సోం) : ప్రపంచ నంబర్ వన్ మహిళా బాక్సర్ మేరీకోమ్ మొట్ట మొదటిసారి అస్సోంలోని కజిరంగా వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో పర్యటించారు. తోటి పర్యాటకులతో కలిసి ఏనుగు అంబారీ ఎక్కి కజిరంగా అందాలను ఆస్వాదించారు. పార్కుకు రావడంపై హర్షం వ్యక్తంచేసిన ఆమె.. అటవీ జంతువులు, సంపదను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఇటీవల ఆరోసారి ప్రపంచ చాంపియన్‌గా అవతరించిన మేరీ.. 48 కిలోల విభాగంలో ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ కైవసం చేసుకున్నారు.

కలుషిత రాజకీయాలు దేశానికే ప్రమాదం: నారాయణ




శివరామిరెడ్డికి అంజలి ఘటిస్తున్న నారాయణ, రామకృష్ణ, పల్లా వెంకటరెడ్డి, చెన్నకేశవరావు, రజని తదితరులు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: నేటితరం రాజకీయ నాయకుల ప్రసంగాలు, విమర్శలు, వ్యవహారశైలితో రాజకీయాలు కలుషితమైపోయాయని, ఇది దేశానికి ప్రమాదం అని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. రాజకీయాల్లో శివారామిరెడ్డి గొప్ప నైతిక విలువలు ఉన్న వ్యక్తి అని, ఒకరికి గౌరవం ఇచ్చి మాట్లాడటంలో ఆయనకు ఆయనే సాటి అని కొనియాడారు. ఆదివారం కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, కమ్యూనిస్టు నాయకులు, మాజీ ఎమ్మెల్యే నరెడ్డి శివరామిరెడ్డి సంతాప సభ జరిగింది. ఈ సభకు సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ఫౌండేషన్ కార్యదర్శి చెన్నకేశవరావు, సభ్యురాలు డాక్టర్ రజని, సీపీఐ శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్యదర్శి శ్రీశైలంగౌడ్ శివరామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. స్వతంత్ర్యం వచ్చిన తర్వాత చట్టసభకు ఎన్నికైన తొలితరం ప్రజాప్రతినిధుల్లో శివరామిరెడ్డి ఒకరని, ఉమ్మడి రాష్ట్రంలో శాసనసభ్యుడిగా ఎన్నికై ప్రజలకు నిస్వార్థ సేవలందించి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని నారాయణ అన్నారు. వెనుకబడిన రాయలసీమ పురోగతి ప్రాజెక్టుల నిర్మాణంతోనే సాధ్యమని భావించి ఉద్యమబాట పట్టి బలమైన పోరాటాలు నిర్వహించారన్నారు. పార్టీని పటిష్టపర్చడానికి కృషి చేశారని, ఆయా గ్రామాల్లో సమస్యలపై స్పందించి పోరాటాలలో ప్రధాన పాత్ర పోషించారని కొనియాడారు. మరణించే వరకు సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలోనే ఉంటూ నిస్వార్థంగా సేవలు అందించి సలహాలు సూచనలు ఇచ్చేవారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని నారాయణ తెలిపారు. రామకృష్ణ మాట్లాడుతూ శివరామిరెడ్డి రైతాంగ సమస్యలపై పోరాడి రైతాంగంలో మంచి గుర్తింపు పొందారన్నారు. నిజాయతీగల కమ్యూనిస్టుగా జీవితాంతం కొనసాగారని, అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. అటువంటి గొప్ప వ్యక్తిని కోల్పోవడం దేశానికే తీరని లోటన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించి పార్టీ ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేసుకోవడమే ఆయనకు మనం అర్పించే నివాళి అని రామకృష్ణ తెలిపారు. పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ శివరామిరెడ్డి భౌతికంగా మనమధ్యలేకపోయినప్పటికీ ఆయన నమ్ముకున్న ఆశయాల సాధనకు ఉద్యమాలు నిర్మించాల్సిన లక్ష్యం మన ముందుందన్నారు. ఈ సంతాప సభలో శివరామిరెడ్డి కుటుంబ సభ్యులు, సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం సహచరులు పాల్గొన్నారు.

పేదల కళ్లలో వెలుగే నిజమైన సంక్రాంతి

సీఎం చంద్రబాబు పండుగ శుభాకాంక్షలు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పెన్షన్లను రెట్టింపు చేసి ఇంటికి పెద్దకొడుకుగా సంక్రాంతి కానుక ఇచ్చానని, నిరు పేద ప్రజల కళ్లల్లో వెలుగు చూడటమే తనకు నిజమైన సంక్రాంతి అని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 50,61,906 సామాజిక భద్రత పెన్షన్లు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. దివ్యాంగులకు నెలకు రూ. 3 వేలు ఇస్తామని, రెండు చేతులు లేని దివ్యాంగులకు రూ.10 వేలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లోని తెలుగు వారికి ఆయన భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువాకిట వెలుగు ముగ్గులు వేసి మన సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పే సృజనాత్మక వేడుక సంక్రాంతి పండుగ అని అన్నారు. జీవన సమరంలో ఎక్కడో దూర తీరాల్లో ఉంటూ పండుగ వేళ కుటుంబ సభ్యులు, బంధు, మిత్రులు కలుసుకుంటున్నారని తెలిపారు. ఇది మన దేశ కుటుంబ వ్యవస్థ గొప్పదనమన్నారు. పంట చేతికొచ్చిన సంతోషంతో జరుపుకునే పండగే సంక్రాంతి అని, అందుకే ఇది రైతుల నిజమైన పండగగా అభివర్ణించారు. ప్రభుత్వ యంత్రాంగం, సిబ్బంది సహకారంతో రాష్ట్రం రెండంకెల వృద్ధిరేటు సాధించిందని గుర్తు చేశారు. నాలుగేళ్లుగా వర్షపాతం తక్కువగా ఉన్నా వ్యవసాయరంగం వృద్ధి రేటు 17.18 శాతం నమోదైందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతుల ఆదాయం రెట్టింపు అయ్యిందని, 2013-14కు రూ.1.28 లక్షల కోట్లు వచ్చిందని, 2017-18లో ఇది 2.53 లక్షల కోట్లకు పెరిగిందని (18.97 శాతం) సీఎం వివరించారు. రైతుల పండగ అయిన సంక్రాంతి ప్రకృతికి కర్షకులు నివేదించే కృతజ్ఞతల వేడకన్నారు. పట్టిసీమ ద్వారా నాలుగేళ్లలో రూ. 44 వేల కోట్ల విలువైన పంట పండిందన్నారు. ఇదే సమయంలో రాయలసీమకు కృష్ణా జలాలు తీసుకెళ్లి చెరువులు నింపామని, క్రమక్రమంగా కరవుఛాయలు తొలగిపోతున్నాయని చెప్పారు. పట్టిసీమ స్ఫూర్తితో పంచనదుల మహా సంగమ పనులకు శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తు చేశారు. రాజధాని అమరావతి నిర్మాణ పనులు శరవేగంతో పరుగులు తీస్తున్నాయన్నారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం తథ్యమని, కియా మోటారు కార్ల పరిశ్రమను అనంతపురం జిల్లాకు తెచ్చామని చెప్పారు సంక్షేమ కార్యక్రమాలు జరగాలంటే తమకు మద్దతిచ్చి, ఆశీర్వదించాలని కోరారు.

హోదా ప్రజా ఉద్యమం : చలసాని



విశాలాంధ్ర-గుంటూరు: హోదా ప్రజా ఉద్యమమని, విభజన హామీల విషయంలో రాజకీయాలు చేస్తే సహించేది లేదని ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మండిపడ్డారు. హోదా విభజన హామీల సాధన జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై సమావేశం జరిగింది. విభజన హామీల సాధన సమితి జిల్లా ప్రదాన కార్యదర్శి జంగాల అజయ్‌కమార్ అధ్యక్షత వహించారు. రాజకీయ పార్టీలు వారి స్వలాభం కోసం హోదాపై రాజకీయం చేయొద్దని అధికార, ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నామని చలసాని అన్నారు. హోదా ఉద్యమం సామాన్య ప్రజల గుండెల్లో నుంచి వచ్చిందని, మోసం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. మోడీ, అమిత్‌షా, అరుణ్‌జైట్లీలే హోదా రానీయకుండా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. విజయవాడలోని వచ్చేవారం అన్ని పార్టీలు, ప్రజా సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ విభజన హామీల సమితి ఆధ్వర్యంలో చలసాని శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ఉద్యమం ఉవ్వెత్తున ముందుకు సాగుతుందన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి ఉపాధ్యక్షులు తాడికొండ నరసింహారావు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ హుస్సేన్, ఏపీజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణాంజనేయులు, హోదా సాధన సమితి నాయకులు బాష్యం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాం

పెదరావూరు సంక్రాంతి సంబరాల్లో పవన్‌కల్యాణ్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జనసేనపార్టీ అధికారంలోకి వస్తే కులమతాలకు అతీతంగా అభివృద్ధి జరుగుతుందని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వెల్లడించారు. తెనాలి సమీపంలోని పెదరావూరులో వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలనే ప్రధాన లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చానని ఆయన స్పష్టం చేశారు. జీవితంలో తొలిసారిగా తెనాలి రావడం, ఘన స్వాగతం లభించడంపై సంతోషం వ్యక్తం చేశారు. జనసేనపార్టీ వెన్నుపోటు పునాదుల్లోంచి పుట్టిన పార్టీకాదనీ, ప్రజల నుంచి పుట్టిన పార్టీ అని, అవినీతి పునాదిపై పుట్టిన పార్టీ వైసీపీ అని ధ్వజమెత్తారు. చంద్రబాబుపై కక్ష సాధింపుతోనే జగన్ టీఆర్ఎస్‌కు మద్దతు పలికారని విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు కౌలురైతులకు అండగా ఉండే పాలసీలు రూపొందిస్తామని, ఫిబ్రవరి రెండో వారంలో రైతు సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 2019 ఎన్నికలు జనసేనకి మొదటి ఎన్నికలేగాని ఆఖరు ఎన్నికలు కాదని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చింది పోటీ చేయడం చేతగాక కాదని, రాష్ట్రం బాగుండాలనే లక్ష్యంతో మద్దతు ఇచ్చామని వివరించారు. అయితే టీడీపీ ప్రభుత్వం అవినీతిలో మునిగిపోయిందని విమర్శించారు. జనసేన అధికారంలోకి వస్తే బకింగ్ హాం కెనాల్‌ను పునరుద్ధరిస్తామని తద్వారా జలరవాణా జరుగుతుందని హామీ ఇచ్చారు. అనంతరం పవన్‌కల్యాణ్ జాగోరే జాగో కార్యక్రమం ఆరంభించారు. రైతులు, విద్యార్థులతో ఇష్టాగోష్టి నిర్వహించారు.

అంబరాన్నంటిన సంబరాలు

పెదరావూరు వ్యవసాయక్షేత్రంలో పవన్‌కల్యాణ్ సంక్రాంతి సంబరాలను ఆరంభించారు. భోగిమంటలు వేసి పండుగను ఆహ్వానించారు. గొబ్బెమ్మలు, ముగ్గులతో వ్యవసాయక్షేత్ర ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దారు. హాజరైన ప్రజలతో వ్యవసాయక్షేత్రం కిటకిటలాడింది.

నందివెలుగు అడ్డరోడ్డు నుంచి భారీర్యాలీ

ఆదివారం సాయంత్రం నందివెలుగు అడ్డరోడ్డు వద్ద పెద్దఎత్తున మహిళలు, ప్రజలు, అభిమానులు పవన్ కల్యాణ్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు, మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్, రాష్ట్రప్రధానకార్యదర్శి తోట చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, మాజీమంత్రి బాలరాజు, మాదాసు గంగాధరమ్, కేకే, ముత్తంశెట్టి కృష్ణారావు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.